ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 28.06.2025 | సంపుటి : 11 సంచిక : 340 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370





తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## అంతర్జాతీయ ఆర్బిట్రేషన్‌కు భూ కేటాయింపులు రద్దు

- హైకోర్టు తీర్పు
- ఐఏఎంసీకి 3.5 ఎకరాల భూమిని కేటాయిస్తూ జారీ చేసిన జీఓను కొట్టేసిన ధర్మాసనం

**హైదరాబాద్(జనంసాక్షి):** అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు చేసిన భూ కేటాయింపులను హైకోర్టు రద్దు చేసింది. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని సర్వే నెంబరు 83/1లో 3.5 ఎకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ జారీ చేసిన జీఓను హైకోర్టు కొట్టేసింది.ఐఏఎంసీకి భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ రెండు వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. న్యాయవాది కె.రఘునాథ్‌రావు, వెంకటరామ్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ కె.లక్ష్మణ్, మిగతా 2లో..



## కోల్‌కతా లాకాలేజీలో మరో ఘోరం

- న్యాయకళాశాలలో లా విద్యార్థినిపై సామూహిక అత్యాచారం
- నిందితుల అరెస్టు..
- జాతీయ మహిళా కమిషన్ ఆందోళన

**కోల్‌కతా(జనంసాక్షి):** పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో మరో ఘోరం వెలుగుచూసింది. గతంలో ఆర్జీ కర్ వైద్య కళాశాలలో విద్యార్థినిపై హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. తాజాగా న్యాయ కళాశాల ప్రాంగణంలోనే ఓ విద్యార్థిని (24)పై సామూహిక అత్యాచార ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. దక్షిణ కోల్‌కతాలో కస్బా పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యాయ కళాశాలలో ఓ విద్యార్థినిని బంధించిన కిరాతకులు దుర్మార్గానికి ఒడిగట్టారు. తనను వదిలేయాలంటూ ఆమె ఎంతగా ప్రాధేయపడినా కనికరం లేకుండా మిగతా 2లో..

## న్యాయమైన విద్య, ప్రపంచంతో పోటీపడే ప్రమాణాలే లక్ష్యం



విద్యా ప్రమాణాలు, మెరుగైన వసతులే ప్రామాణికం

- ఇంజనీరింగ్ కాలేజీల ఫీజుల నిర్ణయంపై ప్రభుత్వం యోచన
- గత విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక పరిశీలన
- పరిగణనలోకి గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు
- ఆయా అంశాల అధ్యయనానికి కమిటీ నియామకం
- నిర్దేశిత సమయంలోనే ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల నిర్ణయంపై హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఆయా కళాశాలల్లో బోధన సిబ్బంది, బోధన స్థాయి, కళాశాలల్లో ల్యాబ్‌లు, భవనాలు.. ఇతర వసతులు... ఇలా ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలనే భా వనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కృత్రిమ మేధ (ఏఐ) వంటి కోర్సులు సాంకేతిక రంగంపై బలమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో తెలంగాణలోని ఇంజినీరింగ్ కళాశాలలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పోటీ పడేలా ఉండాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు తగినట్లు కళాశాలలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ ప్రణాళికబద్ధంగా ముందుకువెళ్లేలా వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్‌లు.. ఏఐసీటీఈ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని ఆశిస్తున్నారు. ఫీజుల నిర్ణయానికి వీటినే ప్రాతిపదిక తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఫీజుల నిర్ణయానికి సంబంధించి ఇస్లామిక్ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ వర్సెస్ కర్ణాటక, పీఏ ఇనాందార్ అండ్ అదర్స్ వర్సెస్ మహారాష్ట్ర కేసుల్లో... మిగతా 2లో..

## సంస్కరణల పితామహుడు

అన్ని రంగాల్లో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత పీవీకే దక్కుతుంది

మాజీ ప్రధాని జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు

వార్త 2లో

'పది' సప్లిమెంటరీ ఫలితాలు

## మా నీళ్లు మాకే..

### కృష్ణా,గోదావరి బేసిన్‌లలో మా వాటా మాకు దక్కాల్సిందే

- గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఏటా రూ. 16 కోట్ల వడ్డీ కడుతున్నాం
- ఇది రైతు పక్షపాత ప్రభుత్వం
- ఎత్తిపోతలపథకాలతో హుజూర్‌నగర్, కోదాడలు సస్యశ్యామలమవుతాయి
- జాన్‌పహాడ్ లిఫ్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్ నగర్/పాలకవీడు/చింతలపాలెం(జనంసాక్షి):** కృష్ణా,గోదావరి జలాశయాలలో తెలంగాణాకు న్యాయబద్ధంగా రావలసిన నీటి వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజీ లేకుండా పోరాటం చేస్తుందని ఆయన చెప్పారు .రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సంప్రదింపులతో కేటాయింపులు జరగకుంటే న్యాయపరంగా పోరాడి న్యాయమైన వాటా సాధిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇది రైతుపక్ష పాత ప్రభుత్వమని,వారి ఉన్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని ఆయన చెప్పారు.కృష్ణా జలాశయాలలో 811 టి.యం.సి లకు గాను ఆంధ్రప్రదేశ్ కు 599 టి.యం.సి లనీటిని ధారా దత్తం చేసిన ఘనత బి.ఆర్.ఎస్ పాలకులదని ఆయన మండిపడ్డారు.తెలంగాణా కు 299 టి.యం.సిలు ఆంధ్రప్రదేశ్ కు 599 టి.యం.సి లంటూ వ్రాతపూర్వకంగా రాసిచ్చిన చరిత్ర బి.ఆర్.ఎస్ ప్రాణుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు.పదేళ్ళ బి.ఆర్.ఎస్ పాలకులు చేసిన పాపానికి రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 16 వేల రూపాయల వడ్డీలు చెల్లించాల్సి మిగతా 2లో..



సాగునీటి ప్రాజెక్టుల

## భవితవ్యం ప్రశ్నార్థకం

హరీశ్‌రావు ఆగ్రహం

**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల నిర్మాణ పనులు ముందుకు పోక, ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ లేక, కొత్త ప్రాజెక్టుల ఆలోచన రాక తెలంగాణ సాగునీటి రంగం సంక్షోభంలోకి వెళ్తున్నది మిగతా 2లో..

## నిన్న జూరాల.. నేడు మంజీర

### ఇది సర్కార్ అసమర్థతకు నిదర్శనం

### మాజీమంత్రి కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్(జనంసాక్షి):** జంటనగరాలకు మంచినీరు అందించే మంజీరా బ్యారేజీని కూడా ప్రమాదంలో పడేయడం అత్యంత ఆందోళనకరం అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ సర్కారు చేతకానితనంతో జూరాల ప్రాజెక్టును డేంజర్‌లోకి నెట్టిన సంఘటనకు 24 గంటలు గడవకముందే ఈ ఘటన చోటు చేసుకోవడం అసమర్థ పాలనకు నిదర్శనమని అన్నారు. సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణలో సీఎం రేవంత్ ఘోర వైఫల్యం వల్లే వరుసగా నిన్న జూరాల ప్రాజెక్టుకు, నేడు మంజీరా బ్యారేజీకి డేంజర్ బెల్స్ మోగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్ఓ) నిపుణుల బృందం గత మార్చి 22న బ్యారేజీని సందర్శించి సమర్పించిన నివేదికను ప్రభుత్వం నిర్లక్ష్యంగా పక్కనపెట్టడం మిగతా 2లో..



## కృష్ణా బోర్డు ప్రత్యేక సమావేశం

### ప్రత్యేక ఇన్సెంటివ్‌లపై చర్చ

**హైదరాబాద్(జనంసాక్షి):** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం ముగిసింది. బోర్డు ఛైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షతన హైబ్రిడ్ విధానంలో ఈ సమావేశం నిర్వహించారు.దిల్లీ నుంచి అతుల్ జైన్, తెలంగాణ, ఏపీ అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. కృష్ణా బోర్డులో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్, కేంద్ర జలశక్తి శాఖ మార్గదర్శకాలు, హైకోర్టు ఆదేశాలపై చర్చించారు. ప్రత్యేక ఇన్సెంటివ్‌లు ఇవ్వరాదని, ఉద్యోగుల నుంచి రికవరీ చేయరాదని కృష్ణా నదీ బోర్డు సభ్యులు నిర్ణయించారు.

## డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా

- కావల్సిన ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయండి
- డైరెక్టర్లకు కావాల్సినంత స్వేచ్ఛనిస్తాం, ప్రభుత్వ ఆశయాలు నెరవేర్చండి
- విద్యుత్ ఒప్పందాల అమలుపై అధికారులు రోజువారి సమీక్షలు నిర్వహించాలి
- జెన్ కో అధికారులు, డైరెక్టర్ల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు



**హైదరాబాద్(జనంసాక్షి):** రాబోయే 5, పది సంవత్సరాలకు రాష్ట్రంలో ఏర్పడనున్న విద్యుత్తు డిమాండ్ అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రజాభవన్లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, జెన్కో డైరెక్టర్లతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023లో మార్చిలో వచ్చిన 15,497 మెగావాట్ల పీక్ డిమాండ్, 2025 మార్చిలో వచ్చిన 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ ను దృష్టిలో పెట్టుకొని 2029-30 నాటికి ఎంత మేరకు డిమాండ్ పెరుగుతుంది, అదే పద్ధతిలో 2030-35, 2047 సంవత్సరాలకు ఏర్పడే విద్యుత్తు డిమాండ్ అందుకు అనుగుణంగా వివిధ మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలపై ప్రణాళికలను సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ, మూసి పునర్జీవనం, పెరుగుతున్న పరిశ్రమలు, వ్యవసాయ వినియోగం, మారిన మిగతా 2లో..



## పురపాలక ఎన్నికలు ఎందుకు నిర్వహించట్లేదు?

### ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

### విచారణ 11వ తేదీకి వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):** పురపాలక ఎన్నికలపై హైకోర్టులో పిటిషన్ - సకాలంలో ఎన్నికలు ఎందుకు నిర్వహించట్లేదో కారణం తెలపాలని నోటీసులు - విచారణ వచ్చే నెల 11వ తేదీకి వాయిదా పురపాలక ఎన్నికలపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నిర్మల్‌కు చెందిన ఎస్.రాజేందర్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. నిర్మల్ పురపాలక ఎన్నికలు సకాలంలో నిర్వహించడం లేదని, మార్చి 25వ తేదీనే మిగతా 2లో..



## జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి

### అదుపుతప్పిన గజరాజులు

### పలువురు భక్తులకు గాయాలు

**పూరీ(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా జగన్నాథుడి ఆలయాల్లో రథయాత్రకు సంబంధించిన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఓ ఆలయంలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తుండగా అపశ్రుతి చోటుచేసుకొంది.రథయాత్రలో ఊరేగింపుగా వచ్చిన 3 ఏనుగులు ఒక్కసారిగా అదుపుతప్పి భక్తుల పైకి దూసుకురావడంతో తోపులాట జరిగింది. ఏనుగులు తమ పైకి రావడంతో తీవ్ర భయాందోళనకు గురైన భక్తులు వాటినుంచి తప్పించుకోవడానికి మిగతా 2లో..

## చైనాతో భారత్ దోస్తానా

### సరిహద్దు ఉద్రిక్తతల పరిష్కారానికి 4-పాయింట్ ఫార్ములా

### ఇరు దేశాల ద్వైపాక్షిక భేటిలో రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదన

**బీజింగ్(జనంసాక్షి):** భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చైనాలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆ దేశ రక్షణ మంత్రి అడ్మిరల్ డాంగ్‌జున్‌తో ఆయన భేటీ అయ్యారు.ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడటం, కొత్త సంక్షిష్టతలు రాకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలపై వీరిద్దరూ చర్చలు జరిపారు. ఈసందర్భంగా సరిహద్దు ఉద్రిక్తతల పరిష్కారానికి నాలుగు అంశాల ఫార్ములాను రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.2024లో కుదిరిన బలగాల ఉపసంహరణకు కట్టుబడి ఉండటం, ఉద్రిక్తతలను తగ్గించేందుకు నిరంతర ప్రయత్నాలు, సరిహద్దుల గుర్తింపు-నిర్ధరణ లక్ష్యాలను సాధించేందుకు చర్యలు, విభేదాలను తొలగించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా ప్రత్యేక ప్రతినిధుల వ్యవస్థను కొనసాగించడం వంటి నాలుగు అంశాలతో రాజ్‌నాథ్ ఈ ప్రణాళికను సూచించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ



సందర్భంగా పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం అంశాన్ని కూడా రాజ్‌నాథ్ లేవనెత్తారు. ఉగ్రవాదాన్ని అడ్డుకునేందుకు తాము ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టినట్లు చైనా మంత్రి వద్ద ఆయన పునరుద్ఘాటించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను రాజ్‌నాథ్ 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ సమావేశం ఫలప్రదమైనట్లు వెల్లడించారు. ఆరేళ్ల తర్వాత కైలాస మానససరోవర యాత్రను చైనా మిగతా 9లో..

## కేసీఆర్, కేటీఆర్‌కు శిక్షపడితేనే మళ్లీ ఫోన్ ట్యాపింగ్ జరగదు

### సిట్ ఎదుట ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వాంగ్మూలం

### అనవసర నేతలను విచారిస్తున్న అధికారులు

### ఫిర్యాదు చేసిన నన్ను మాత్రం దూరం పెట్టారు : ఎంపి రఘునందన్ రావు



**హైదరాబాద్(జనంసాక్షి):** ఫోన్ ట్యాపింగ్‌పై ఫిర్యాదు చేసినందుకే తనపై తప్పుడు కేసులు పెట్టారని భాజపా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసినందుకు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ జైలుకు వెళ్లాలన్నారు.ఈ కేసు విచారణలో భాగంగా శుక్రవారం ఆయన సిట్ ఎదుట హాజరయ్యారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఆయన్ని అధికారులు ప్రశ్నించారు. వాంగ్మూలం నమోదు చేసుకున్నారు.అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ నిరూపించేందుకు అవసరమైతే కేంద్రం సాయం తీసుకోవాలన్నారు. " ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతాం. మిగతా 2లో..

## అమెరికాతో ఎలాంటి అణు చర్చల్లేవు

### స్పష్టం చేసిన ఇరాన్

- ఇరాన్‌కు రూ.2.5 లక్షల కోట్లు
- ప్రతిపాదనను పరిశీలిస్తున్న ట్రంప్ కార్యవర్గం
- ఆ 400 కేజీల యురేనియం.. తరలించే అవకాశమే లేదన్న అమెరికా అధ్యక్షుడు



**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికాతో ఎలాంటి అణుచర్చలు జరిపే ఉద్దేశం తమకు లేదని ఇరాన్ పేర్కొంది. వచ్చేవారం టెహ్రాన్‌తో అణుచర్చలు జరగనున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే, తాజాగా ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చారు.అమెరికాతో అణు ఒప్పందానికి సంబంధించి సమావేశమయ్యే ఆలోచన తమకు లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల తమపై జరిగిన దాడులు గణనీయమైన నష్టాన్ని కలిగించాయన్నారు. ఇరాన్ అణు కార్యక్రమం పునరుద్ధరణపై అధికారులు అధ్యయనం చేస్తున్నారని వెల్లడించారు. ఈ చర్చలపై వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ స్పందిస్తూ.. ప్రస్తుతానికి అలాంది ఏమీ లేదన్నారు. అయితే, ఒప్పందానికి సంబంధించిన చర్చలు పునఃప్రారంభించేందుకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్‌తో మాట్లాడుతున్నామన్నారు. హేగ్‌లో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. వచ్చేవారం టెహ్రాన్‌తో అణుచర్చలు జరుపుతామన్నారు. అణ్వాయుధాలు తయారుచేయాలన్న ఆశయాన్ని వదిలేసేలా ఇరాన్‌తో ఒప్పందం చేసుకొనే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలు మిగతా 2లో..

## అంతర్జాతీయ ఆర్బిట్రేషన్‌కు భూ కేటాయింపులు రద్దు

జస్టిస్ కె.సుజనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్లపై జనవరిలో వాదనలు ముగిశాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ సంస్థకు భూకేటాయింపు చేశారని న్యాయవాది రఘునాథ్ రావు కోర్టుకు తెలిపారు. ఐటీ కారిడార్‌లో రూ.350 కోట్ల విలువ చేసే భూమిని సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా కేటాయించారని వాదించారు. అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే పలు అంతర్జాతీయ సంస్థల మధ్య వివాదాల పరిష్కారానికి దోహదపడుతుందని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. వివాదాలు కేవలం న్యాయస్థానాల్లోనే కాకుండా.. బయట కూడా పరిష్కరించుకోవచ్చని న్యాయస్థానాలే చెబుతున్నాయన్నారు. ఐఏఎంసీ వల్ల వివాదాలు పరిష్కారమైతే కోర్టులపై కూడా భారం తగ్గుతుందన్నారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో జనవరిలో తీర్పును రిజర్వు చేసిన హైకోర్టు శుక్రవారం వెలువరించింది. ఐఏఎంసీ భూకేటాయింపుతో పాటు, ప్రస్తుత భవనం నిర్వహణ కోసం జారీ చేసిన జీఓలను కూడా హైకోర్టు కొట్టేసింది.

## తెలంగాణ 'పది' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షల ఫలితాలను అధికారులు శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 42,832 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 38,741 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల్లో 24,415మంది (73.35 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేసి ఫలితాలు పొందొచ్చు.

## కేసీఆర్, కేటీఆర్‌కు శిక్షపడితేనే మళ్లీ ఫోన్ ట్యాపింగ్ జరగదు

మళ్లీ ఫోన్ ట్యాపింగ్ జరగకుండా ఉండాలంటే కేసీఆర్, కేటీఆర్‌కు శిక్షపడాలి. గతంలో నా ఫోన్ చాలాసార్లు ట్యాప్ అయ్యింది. దీనిపై గతంలోనూ నేను ఫిర్యాదు చేశాను" అని విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ విశ్వేశ్వర్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయినట్లు అధికారులు కూడా గుర్తించారు. సీడీఆర్ లిస్టులో ఆయన నంబర్ ఉన్నట్లు సిట్ తెలిపింది.

అనవసర నేతలను విచారిస్తున్న సిట్

దుబ్బాక ఉప ఎన్నికలతోనే ఫోన్ ట్యాపింగ్ ప్రారంభమైందని.. మొట్ట మొదటిసారిగా తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని డీజీపీకి అనేక సార్లు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధంలేని కాంగ్రెస్ నాయకులను సిట్ పిలుస్తోందని.. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ అయ్యింది తనదన్నారు. మమ్మల్ని అడిగితే అన్ని వివరాలు ఇచ్చే వాళ్ళమన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో గాడిదగుడ్డు తప్ప చర్యలు ఉండవని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మూలాఖత్ అయ్యాయని విమర్శించారు. ఫిర్యాదు చేసిన తమను సిట్ ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. రోజుకు ఒక్కరిని మాత్రమే విచారణ చేయడానికి ఇదేమైనా డైలీ సీరియలా అని ప్రశ్నించారు. ఆధారాలు ఇచ్చే వాళ్లను పక్కన పెట్టి డైలీ సీరియల్ నడుపుతున్నారని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రచార ఆర్భాటాలు తప్ప మరొక్కటి లేదని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. బెదిరింపు కాల్స్‌పై విచారణ జరుగుతుందని పోలీస్ ఉన్నతాధికారులు చెప్పారని తెలిపారు. నియోజకవర్గానికి వెళ్లినప్పుడు సమాచారం ఇస్తే ఎస్కార్ట్, ముగ్గురు సిబ్బందిని ఇస్తామన్నారన్నారు. కాంగ్రెస్ 18 మాసాల పాలనపై సమీక్షించు కోకుండా రోజుకొక కొత్త కథతో ముందుకు వస్తోందని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ మేయర్ ఐదు రూపాయల భోజనం పేరు మారుస్తున్నట్లు ప్రకటించారని.. అన్నపూర్ణ క్యాంటీన్ పేర్లను ఇందిరమ్మ పేరు పెట్టడం దౌర్భాగ్యమన్నారు. ఇందిరమ్మ పేరు చెబితే ఎమ్జర్గ÷న్సీ గుర్తుకు వస్తుందనే ఇంగిత జ్ఞానం లేకుండా ఇందిరమ్మ పేరు పెడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. మేయర్ దృష్టి పెట్టాల్సింది కుక్కల బెడద, సమస్యలపైన కానీ పేర్ల మార్పు మీద కాదు అంటూ హితవుపలికారు. పథకాల పేర్లు మార్చడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు తప్పితే ఇళ్ళు లేని వాళ్లకు ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలకు సవాల్ విసురుతున్న.. ఇళ్లులేని వాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని నిరూపించాలన్నారు. రేవంత్ రెడ్డి నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామానికైనా వెళ్లి పరిశీలించాలన్నారు. 'కవిత ఎవ్వరూ.. కవిత బీసీనా. అధికారంలో ఉన్న పదేళ్లు ఎందుకు బీసీలు గుర్తుకురాలేదు. బీసీలకు అధ్యక్ష పదవి, ఎల్పీనేత పదవులు ఇవ్వకుండా బీసీ ఉద్యమం చేస్తామంటే ఎట్లా? మతపరమైన రిజర్వేషన్లు తొలగిస్తే.. రాజ్యాంగ సవరణ చేస్తాం' అని ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు.

సిట్ ముందు వివరణ ఇచ్చిన కామారెడ్డి కాంగ్రెస్ నేత

ఫోన్ ట్యాపింగ్ కేసులో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు దేవరాజు గౌడ్ సిట్‌కు వాంగ్మూలం ఇచ్చారు. 2023 ఎన్నికల సమయంలో దేవరాజు గౌడ్ ఫోన్ ట్యాప్ అయ్యింది. దీంతో సిట్ అధికారుల నుంచి సమాచారం అందడంతో వాంగ్మూలం ఇచ్చేందుకు శుక్రవారం జూబ్లీహిల్స్ సిట్ కార్యాలయనికి దేవరాజు వచ్చారు. కాంగ్రెస్ నేత నుంచి సిట్ అధికారులు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. సిట్‌కు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం దేవరాజు మీడియాతో మాట్లాడారు. సిట్ పిలుపు మేరకు వాంగ్మూలం ఇవ్వడానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. 2023 ఎలక్షన్ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి జిల్లా నుంచి పోటీ చేశారని... అదే సమయంలో తాను కూడా ఆ జిల్లా గెలుపు బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. తమ ప్రణాళికలు తెలుసుకునేందుకే ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని చెప్పారు. చట్టానికి వ్యతిరేకంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో తన ఇంటిలో అక్రమంగా సోదాలు చేశారని అన్నారు. ఎలక్షన్ టైమ్‌లో తన ఫోన్ ట్యాప్ అయినట్టు అనుమానం వచ్చిందని చెప్పుకొచ్చారు. ఆ టైంలో తనతో పాటు కుటుంబ సభ్యులు, అనుచరుల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేసి ఇబ్బందులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న అసలు వ్యక్తుల్ని గుర్తించి శిక్షించాలని దేవరాజు గౌడ్ డిమాండ్ చేశారు. మరోవైపు చేవెళ్ల ఎంపీ, బీజేపీ నేత కొండ విశ్వేశ్వర్ రెడ్డి కూడా సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చారు. 2023 నవంబర్‌లో ఎంపీ ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తించిన సిట్ అధికారులు.. వాంగ్మూలం ఇవ్వాల్సిందిగా సమాచారం అందజేశారు. ఉదయం ఎంపీ.. సిట్ కార్యాలయానికి రాగా.. ఆయన స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులకు స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు ఈ సందర్భంగా ఎంపీ తెలిపారు. మునుగోడు, దుబ్బాక, హుజురాబాద్ ఎన్నికల సందర్భంలో తన ఫోన్ ట్యాప్ అయినట్టు సిట్ అధికారులు చూపించారని.. దీంతో బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చాక తన ఫోన్‌ట్యాప్ అయినట్లు కన్ఫామ్ అయ్యిందని వెల్లడించారు.

## నాణ్యమైన విద్య, ప్రపంచంతో పోటీపడే ప్రమాణాలే లక్ష్యం

ఆయా కళాశాలల్లోని వసతులు, ల్యాబ్‌లు, లెక్చరర్లకు ఆ సంస్థ ఇచ్చే వేతనాలు, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల భవిష్యత్ ప్రణాళికలు, కళాశాల ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపాదిక చేసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫీజుల నిర్ణయంలో సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంజినీరింగ్ కళాశాలల్లో వసతులు, బోధన సిబ్బంది.. ఇతర వ్యవహారాలపై గత ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో తనిఖీలు చేయించింది. ఆ శాఖ క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి నివేదిక రూపొందించింది. కానీ గత ప్రభుత్వం ఆ నివేదికపై ఎటువంటి చర్య తీసుకోలేదు. కానీ తమకు నచ్చిన కళాశాలలకు ఫీజులు పెంచుకునే అవకాశాన్ని కల్పించి.. మరికొన్ని కళాశాలలకు మాత్రం పక్షపాత వైఖరితో మొండి చేయి చూపింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ నివేదిక పరిశీలనతో పాటు ఇంజినీరింగ్ కళాశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలను మదింపు చేసి ఫీజులపై నిర్ణయం తీసుకునేందుకు ఒక కమిటీని తీసుకునేందుకు ఒక కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్దేశిత సమయంలోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## సంస్కరణల పితామహుడు

హైదరాబాద్(జనంసాక్షి):మాజీ ప్రధానమంత్రి, బహుభాషా కోవిదుడు, రచయిత, ఆర్థిక సంస్కరణల పితామహుడు, భారతరత్న పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనను రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ప్రధానిగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకు వచ్చి దేశాన్ని ప్రగతి పథంలో నడిపిం చడం లోనూ, అన్ని రంగాల్లో ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత పి.వి.నరసింహారావుకు దక్కుతుందని ముఖ్య మంత్రి కొనియాడారు. నాడు పీవీ చేపట్టిన ఆర్థిక సంస్కరణలే నేడు భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు దోహదపడు తున్నాయని అన్నా రు. నవోదయ విద్యాలయాలు పీవీ హయాంలోనే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## సాగునీటి ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకం

అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నీటి రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి, సాగును బాగు చేసిన ఘనత కేసీఆర్‌ది అయితే, ప్రాజెక్టులను పడావు పెట్టి, నిర్వహణ గాలికి వదిలి ఏపీకి నీళ్లు వదులుతున్న ఘనత రేవంత్ రెడ్డిది అని ధ్వజమెత్తారు. బనకచర్లపై పీపీటీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు. డైవర్షన్ కోసమే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని మండిపడ్డారు. 2016 ఎజెండా మినిట్స్‌పై రేవంత్ రెడ్డితో చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇరు రాష్ట్రా కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని.. తెలంగాణకు ఆమోదయోగ్యం లేకుంటే ఒప్పుకునేది లేదని 2016 మీటింగ్‌లో ఆయన చెప్పారని గుర్తుచేశారు. బనకచర్లపై కేంద్ర జలశక్తి మీటింగ్‌లో ప్రభుత్వం తెలంగాణ వాదనను గట్టిగా వినిపించాలని డిమాండ్ చేశారు. విషయం లేకనే.. సీఎం రేవంత్ రెడ్డి బూతులు ఎత్తుకున్నారని వ్యాఖ్యలు చేశారు. బేసిన్‌కు బాసిన్‌కు తేడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ఎంపీల మీటింగ్ ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బనకచర్ల కార్పొరేషన్ ఏర్పడలేదని, టెండర్లు పిలవలేదని చెప్పుకొచ్చారు. చేతులు కాలినాక.. ఆకులు పట్టుకున్న చందంగా బీజేపీ తీరుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు నష్టం జరగకముందే బనకచర్లను ఆపేలా.. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బనకచర్లపై రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. మంజీర డ్యాం ఆప్రాన్ వరద దాటికి కొట్టుకుపోగా, పియ్యర్స్‌ల్లో పగులు వచ్చాయి. పాలన వైఫల్యం, కాంగ్రెస్ చేతగాని తనం వల్లే ఇన్ని ప్రమాదాలు జరిగాయి. ఇవేవి ఎన్డీఎస్ఏకు కనిపించవు, వినిపించవు. మేడిగడ్డ కుంగిన వెంటనే ఎన్డీఎస్ఏకు లేఖ రాసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న ప్రాజెక్టుల ప్రమాదాలు ఎందుకు కనిపించడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. మేడిగడ్డలో 85 పియ్యర్స్ ఉంటే అందులో ఒక పియ్యర్ కుంగిపోతే మొత్తం ప్రాజెక్టే కుప్ప కూలిందని ప్రచారం చేసిన రేవంత్ రెడ్డి, ఏడాదిన్నరలో జరిగిన ఘటనలకు ఎవరు బాధ్యులు.. కాళేశ్వరంపై ఏడుస్తూ కాలం వెల్లదీయడం తప్ప, ఏడాదిన్నరగా మీరు చేసిందేం ఉంది రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. ఒక చెరువు తవ్వింది లేదు, ఒక్క చెక్ డ్యాం కట్టింది లేదు, ఒక్క ఎకరాలకు కొత్తగా నీరు ఇచ్చింది లేదు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే కొత్తగా ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తామని చెప్పి, ఆరు వేల ఎకరాలకు కూడా ఇవ్వలేదు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో సాధించిన తెలంగాణలో మళ్లా నీళ్ల కోసం, నిధుల కోసం, నియామకాల కోసం కొట్లాడాల్సిన పరిస్థితి తెచ్చావు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి! ఇప్పటికైనా కళ్లు తెరువు. ప్రాణాధారం అయిన సాగునీటి రంగాన్ని నీ రాజకీయ అజెండాలకు బలి చేయకు. మేడిగడ్డపై దుష్ప్రచారం ఆపేసి, ఇకనైనా ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టు. అన్నారు

## డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా

జీవన ప్రమాణాలకు అనుగుణంగా పెరగనున్న విద్యుత్ వినియోగం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు అంచనాలు రూపొందించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల పాటు ఉచిత విద్యుత్ ను అందిస్తుంది ఇ 0దుకు గాను ఆర్థిక శాఖ ద్వారా విద్యుత్ సంస్థలకు సంవత్సరానికి 12,500 కోట్లు చెల్లింపులు జరుగుతున్నాయి అన్నారు. నిరుపేదలకు ఆర్థిక చేయూతను అందించేందుకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం ప్రస్తుతం వీటి విలువ2 వేల కోట్ల వరకు ఉంది అది భవిష్యత్తులో పెరిగి మూడు వేల కోట్ల వరకు చేరుకునే అవకాశం ఉంది మొత్తంగా ఉచిత విద్యుత్ పథకాలకు భవిష్యత్తులో 17 వేల కోట్ల వరకు ఆర్థిక శాఖ నుంచి విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుందని వివరించారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని గ్రీన్ ఎనర్జీని పెద ఎత్తున ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేసుకుని వేగంగా కార్యాచరణ చేపట్టాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. గిరిజనులు తలెత్తుకొని బతికేలా ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చింది ఈ పథకం ద్వారా 6.70 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురానున్నాం, మొత్తం సోలార్ పంపు సెట్లు వినియోగిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. 2030-31, 2035 నాటికి థర్మల్ విద్యుత్తు కు ఉండే డిమాండ్ దృష్టిలో పెట్టుకొని 50 సంవత్సరాల క్రితం నిర్మించిన రామగుండం, కేటీపీఎస్ థర్మల్ పవర్ స్టేషన్ల స్థానంలో కొత్తవి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ ఏర్పాటుచేసి 50 సంవత్సరాలు పూర్తి కావడంతో 2019 లోనే మూసి వేసాం. అక్కడ 500 ఎకరాల స్థలం, బొగ్గు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఎనిమిది వందల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అక్కడ అవకాశం ఉందని డిప్యూటీ సీఎం సూచించారు. 62.5 మెగావాట్ల సామర్థ్యంతో నిజాం కాలంలో ఏర్పాటుచేసిన రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కాలం చెల్లిపోవడంతో మూసి వేసాం. అక్కడే 800 మెగావాట్ల సామర్థ్యంతో థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం తెలిపారు. జెన్కో ఆధ్వర్యంలో థర్మల్ పవర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో డైరెక్టర్లు అందుకు తగిన విధంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని రావాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అందరి దృష్టి ప్రస్తుతం తెలంగాణ రెడ్ కో పైనే ఉంది, తెలంగాణ రెడ్ కో దేశానికి రోల్ మోడల్ గా నిలవాలని డిప్యూటీ సీఎం సమావేశంలో ఆకాంక్షించారు. ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా పనిచేసేందుకు రెడ్కోకు కావలసిన సిబ్బంది, ఏ స్థాయి సిబ్బంది కావాలో సవివరంగా ఓ నివేదిక సమర్పించాలని ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి మద్దతు రెడ్ కో కు ఉంటుందని సమావేశంలో డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. డైరెక్టర్లు అందరికీ కావలసినంత స్వేచ్ఛను ఇస్తున్నాం, ప్రభుత్వం ఆశిస్తున్న లక్ష్యాలను పూర్తి చేయండి, విద్యుత్ శాఖ అభివృద్ధికి కావాల్సిన ఆలోచనలు చేయండని డిప్యూటీ సీఎం కొత్తగా నియామకమైన డైరెక్టర్లను కోరారు. దావోస్లో, హైదరాబాదులో, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో చేసుకున్న విద్యుత్ ఉత్పత్తి ఒప్పందలపై రోజువారి సమీక్ష చేయాలని దావోస్లో, హైదరాబాదులో, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో చేసుకున్న విద్యుత్ ఉత్పత్తి ఒప్పందలపై రోజువారి సమీక్ష చేయాలని డిప్యూటీ సీఎం ఉన్నతాధికారులను ఆదేశించారు. గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహాలపై సోలార్ పవర్ ప్యానల్స్ ఏర్పాటు చేసి ఆయా వర్గాలకు ఆదాయంతో పాటు, సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన ప్రణాళికలను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఫ్లోటింగ్ సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి నీటిపారుదల శాఖ, జెన్కో రెండు శాఖలను సమన్వయం చేసుకునేందుకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్, జెన్కో సి.ఎం.డి హరీష్, రెడ్కో అనిలా తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి...

పరుగులు తీయడంతో ఆ ప్రాంతంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో పలువురు భక్తులు గాయపడినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అయితే కొంతసేపటికి పరిస్థితిని అదుపు చేయడంతో రథయాత్రను తిరిగి కొనసాగించినట్లు తెలిపారు. ఉదయం 10:15 గంటల సమయంలో జగన్నాథ రథయాత్ర ఊరేగింపు అహ్మదాబాద్‌లోని ఖాదియా ప్రాంతం గుండా వెళ్తుండగా ఒక్కసారిగా ఏనుగులు అదుపు తప్పాయన్నారు. ఈ వేడుకల్లో ఎటువంటి అసాధారణ ఘటనలు జరగకుండా ఉండేందుకు నగరం అంతా దాదాపు 23,800 మంది భద్రతా సిబ్బందిని మోహరించినట్లు అధికారులు పేర్కొన్నారు..

**పూరీ జగన్నాథుడి రథయాత్రకు సర్వం సిద్ధం.. తరలివచ్చిన భక్తులు**

పూరీ: ఒడిశాలోని పూరీలో జగన్నాథుడి రథయాత్రకు సర్వం సిద్ధం చేశారు. పూరీ నగర వీధులు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రథయాత్రను చూసేందుకు దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ వేడుక కోసం ఒడిశా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. రథయాత్రకు 12 లక్షల మందికిపైగా భక్తులు వస్తారని అంచనా. ప్రస్తుతం పూరీలో జగన్నాథుని పోహండి ప్రారంభమైంది.

## పురపాలక ఎన్నికలు ఎందుకు నిర్వహించట్లేదు?

పురపాలక గడువు ముగిసినా ఎన్నికలు నిర్వహించలేదని పిటిషనర్ పేర్కొన్నారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు.. ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. సకాలంలో ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదో కారణం తెలపాలన్న హైకోర్టు, విచారణను వచ్చే నెల 11వ తేదీకి వాయిదా వేసింది. 3 నెలల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి : తెలంగాణ హైకోర్టులో స్థానిక సంస్థల ఎన్నికలపై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన తుది తీర్పును ఈ నెల 25న న్యాయస్థానం వెలువరించింది. గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 నెలల్లో నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీలైనంత త్వరగా 30 రోజుల్లో వార్డుల విభజన పూర్తిచేసి, ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించిన విషయం తెలిసిందే

## మా నీళ్లు మాకే..



వస్తుందని ఆయన చెప్పారు. శుక్రవారం ఉదయం హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలోని పాలకీడు మండలం జానపహాడ్,బెట్టే తండా ఎత్తిపోతల పథకాలను ఆయన పరిశీలించారు. నీటిపారుదల రంగాన్ని అప్పటి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఆయన విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందే తడవుగా కృష్ణా నది పరివాహక ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో పాటు ఆయకట్టు,జనాభా ఆధారంగా నీటి కేటాయింపుల కోసం పోరాడుతున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 38 వేల కోట్ల అంచనా వ్యయంతో తుమ్మిడిహట్టి వద్ద డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ చేవెళ్ల-ప్రాణహిత పేరుతో ప్రాజెక్టును నిర్మిస్తే కమిషన్ల కక్కుర్తితో లక్ష కోట్లు వెచ్చించి బి.ఆర్.ఎస్ పాలకులు లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం కుప్ప కూలి పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టును అదే తుమ్మిడిహట్టి వద్ద నిర్మిస్తే 62 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి మిగిలి ఉండేవని ఆయన తెలిపారు. అవే డబ్బులతో ఎస్.ఎల్.బి.సి,పాలమూరు రంగారెడ్డి, భీమా,నెట్టెంపాడు, కోయిలసాగర్,దేవాదుల,సీతారామ,గౌరెల్లి వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణా ప్రాంతాన్ని సస్యశ్యామలం అయ్యేదని ఆయన అన్నారు. వీటన్నింటినీ తోసి రాజని బి.ఆర్.ఎస్ పాలకులు చేసిన తప్పిదాలతో నేడు రాష్ట్ర ప్రభుత్వంపై సంవత్సరానికి 16 వేల కోట్ల రూపాయలు వడ్డీ భారం పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పైగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 27,500 కోట్లు,సీతారామ ప్రాజెక్టు మీద 10 వేల కోట్లు ఖర్చు చేసి కొత్తగా ఒక్క ఎకరా కొత్త ఆయకట్టును సేద్యంలోకి తీసుకు రాలేక పోయారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖామంత్రిగా తాను గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దుకుంటు రావడం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారినా ఖరీఫ్ ,రబీ సీజన్ లను కలిపి రికార్డు స్థాయిలో 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించామన్నారు. ఇది యావత్ భారత దేశంలోనే ఆల్ టైం రికార్డ్ గా ఆయన అభివర్ణించారు. రైతుభరోసా పథకంతో రైతాంగం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. తొమ్మిది రోజుల వ్యవధిలో 9 వేల కోట్లను రైతుల ఖాతాలలో జమ చేశామని ఆయన వెల్లడించారు.

కాంట్రాక్టర్ పై గరం...గరం

జవహర్ జానపహాడ్ ఎత్తిపోతల పథకం పనులు వేగవంతంగా జరగడం లేదంటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధించిన ఏజెన్సీ నిర్వాహకుల పై మండి పడ్డారు. స్వయంగా తాను మూడు సార్లు స్వయంగా తనిఖీలు నిర్వహించినా పనులు ముందుకు సాగడం లేదంటూ ఆయన తీవ్రంగా మందలించారు. డిజైన్ లో మార్పులు అవసరం అయితే సి.డి.ఓ (సర్క్యులర్ డీజైన్ ఆపరేషన్ ) ద్వారా చేసుకోవచ్చని ఆయన సూచించారు.

## కోల్‌కతా లాకాలేజీలో మరో ఘోరం

అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఈ నేపథ్యంలో ఆ మృగాళ్ల నుంచి తనకు ఎదురైన భయానక పరిస్థితులను బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మోనోజిత్ మిశ్రా (31)ను కాళ్లు పట్టుకొని బతిమిలాడినా తనను వదిలిపెట్టలేదని.. పైగా ఈ దుశ్చర్యను వారు ఫోన్లలో రికార్డు చేశారని ఆమె వాపోయారు. మోనోజిత్ ప్రస్తుతం తృణమూల్ కాంగ్రెస్ విద్యార్థి విభాగమైన తృణమూల్ కాంగ్రెస్ ఛత్ర పరిషత్ దక్షిణ కోల్‌కతా జిల్లా యూనిట్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని అతడు ప్రతిపాదించగా.. తనకు బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడంటూ ఆమె నిరాకరించడం వల్లే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. బాయ్‌ఫ్రెండ్‌కు హాని చేస్తానని, తన తల్లిదండ్రులను తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని బెదిరిస్తూ కళాశాలలో బంధించాడని బాధితురాలు ఆరోపించారు. మరో ఇద్దరు విద్యార్థులు జుబీర్ అహ్మద్ (19), ప్రామిత్ ముఖర్జీ (20)లతో కలిసి తనపై దాడి చేయగా ప్రతిఘటించేందుకు ప్రయత్నించానని బాధితురాలు పేర్కొన్నారు.

వీడియోలు తీశారు.. హాకీ స్టిక్‌తో కొట్టారు..

"లైంగిక చర్య జరిపే ఉద్దేశంతో నన్ను బలవంతం చేయడానికి ప్రయత్నించారు. నేను నిరాకరిస్తూ.. దగ్గరికి రాకుండా ప్రతిఘటించి మోనోజిత్‌ని వెనక్కి నెట్టేశాను. ఏడుస్తూ వదిలిపెట్టాలని వేడుకున్నాను. బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడు.. అతడిని ప్రేమిస్తున్నాను అని చెప్పినా అంగీకరించలేదు. మోనోజిత్ కాళ్లు పట్టుకొని వదిలేయాలని ప్రాధాయపడినా.. వదల్లేదు. ఆ తర్వాత నన్ను సెక్యూరిటీ గార్డు రూమ్‌లోకి బలవంతంగా లాక్కెళ్లి అత్యాచారానికి ఒడిగట్టారు. నాకు న్యాయం చేయండి" అని బాధితురాలు పోలీసులను కోరారు.

నిందితుల అరెస్టు.. ఫోన్‌లు సీజ్

ఈ ఘటనకు ముందు తనను, మరో ఏడుగురిని క్యాంపస్ లోపల ఉన్న యూనియన్ గదిలోకి పిలిపించారని, అక్కడ మనోజిత్ మిశ్రా వ్యక్తిగత జీవితం, అతడికున్న పలుకుబడి గురించి మాట్లాడినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ యూనియన్ పట్ల విధేయతతో ఉండాలని కోరగా.. అందుకు తానూ అంగీకరించానన్నారు. పరీక్షలకు సంబంధించిన ఫారంలను నింపేందుకు విద్యార్థిని బుధవారం మధ్యాహ్నం కాలేజీకి వెళ్లగా.. ఆమెను బంధించి రాత్రివేళ ఈ దుశ్చర్యకు ఒడిగట్టారు. ఆ తర్వాత రాత్రి 10.50 గంటల సమయంలో ఆమెను వదిలిపెట్టగా.. బాధితురాలి ఫిర్యాదు మేరకు కస్బా పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

## నిన్న జూరాల..నేడు మంజీర

క్షమించరాని నేరం. మేడిగడ్డ బ్యారేజీ వద్ద కూడా చరిత్రలో లేనంత వరద రావడంతో రెండు పిల్లర్లకు పగుళ్లు వచ్చిన తరహాలోనే, ఇప్పుడు మంజీరాపై కూడా వరద ఒత్తిడి పెరిగి దిగువ భాగంలో పిల్లర్లకు పగుళ్లు రావడం, ఆప్రాన్ కొట్టుకుపోవడం, స్పెల్ వేలోని భాగాలు కూడా దెబ్బతిన్నట్టు ఎన్డీఎస్ఏ నివేదిక గుర్తించినా ముఖ్యమంత్రి మొద్దునిద్ర వీడకపోవడం మరో దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు. నిన్నటిదాకా ఎన్డీఎస్ఏ నివేదిక చెప్పినా మేడిగడ్డ బ్యారేజీని రిపేర్ చేయక పోవడం, నేడు ఎన్డీఎస్ఓ నివేదిక అందినప్పటికీ మంజీరా బ్యారేజీ మరమ్మత్తులు చేపట్టకపోవడం.. ఈ కాంగ్రెస్ సర్కారు అలసత్వానికే కాదు.. దుర్మార్గపు వైఖరికి ప్రత్యక్ష నిదర్శనం అని నిప్పులు చెరిగారు కేటీఆర్. రానున్న రోజుల్లో పైనుంచి మంజీరాలో వరద ఉధృతి పెరిగితే మరింత కోతకు గురై చివరికి డ్యామ్‌ను కూడా ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి తలెత్తవచ్చని నిపుణులు అంచనా వేస్తున్న క్రమంలో ఇకనైనా ఈ చిల్లర రాజకీయాలు మాని అటు మేడిగడ్డ బ్యారేజీని, ఇటు మంజీరా బ్యారేజీని వెంటనే రిపేర్ చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై, కాంగ్రెస్ సర్కారుపై ఉందని కేటీఆర్ అన్నారు. బ్యారేజీల సామర్థ్యానికి మించిన వరద వచ్చిన సందర్భాల్లో ఆ ఒత్తిడిని తట్టుకోలేకే పిల్లర్లకు పగుళ్లు వచ్చినట్టు ఎన్డీఎస్ఓ గుర్తించింది. సరిగ్గా మేడిగడ్డ వద్ద కూడా ఊహించని వరద పోటెత్తడం వల్ల అక్కడ కూడా ఇదే తరహాలో పగుళ్లు ఏర్పడ్డాయి. కానీ దీన్ని అసెంబ్లీ ఎన్నికల వేళ భూతద్దంలో చూపించి అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ కుమ్మక్కై బీఆర్ఎస్‌పై బురదజల్లాయి. మేడిగడ్డ బ్యారేజీలోని రెండు పియర్స్‌కు వచ్చిన పగుళ్లపై నానాయాగీ చేసిన కాంగ్రెస్-బీజేపీ నేతలు మంజీరా బ్యారేజీ పిల్లర్లకు వచ్చిన పగుళ్లపై కనీసం స్పందించకపోవడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు, బ్యారేజీల్లో స్వల్ప రిపేర్లు వస్తే, అప్పటికప్పుడు వాటిని మరమ్మత్తు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారే తప్ప కాళేశ్వరంపై కక్షగట్టాయన్నారు

## అమెరికాతో ఎలాంటి అణు చర్చల్లేవు

సడలించే అవకాశాలున్నట్లు కూడా ట్రంప్ సంకేతాలిచ్చారు. ప్రస్తుతం ఇరాన్ పునర్ నిర్మాణానికి నగదు వనరులు కావాలని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఈక్రమంలోనే ఆ దేశం కోలుకోవడానికి మద్దతు ఇవ్వడం కోసం కొన్ని ఆంక్షలను సడలించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ఇరాన్‌కు రూ.2.5 లక్షల కోట్లు

పౌరుల అవసరాల కోసం అణు విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు ఇరాన్‌కు సహకరించే అంశాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కార్యవర్గం పరిశీలిస్తోంది. దీనికింద టెహ్రాన్‌కు 30 బిలియన్ డాలర్లు(దాదాపు రూ.2.5 లక్షల కోట్లు) సాయం చేసేలా ప్రతిపాదన ఉన్నట్లు సీఎన్ఎన్ పత్రిక కథనంలో పేర్కొంది. టెహ్రాన్‌ను ఎలాగైనా చర్చలకు టేబుల్ పైకి తీసుకువచ్చేలా అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఇరాన్‌లోని మూడు అణుకేంద్రాలపై అమెరికా దాడులు నిర్వహించిన మర్నాడు ట్రంప్ పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్, గల్ఫ్ దేశాల ప్రతినిధులతోను శ్వేతసౌధంలో కొన్ని గంటల పాటు సమావేశం అయ్యారు. అదే సమయంలో కొందరు అమెరికా, పశ్చిమాసియా ప్రతినిధులు ఇరాన్‌కు చెందిన కీలక నాయకులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఈ చర్చలు కొనసాగుతున్నట్లు సీఎన్ఎన్ వెల్లడించింది. కాకపోతే ఇరాన్ అణుశుద్ధి చేపట్టకూడదన్న తమ విధానంలో మాత్రం ఎటువంటి రాజీ పడకూడదని అమెరికా భావిస్తోంది. ప్రాథమికంగా పౌర అణు కార్యక్రమానికి 20 నుంచి 30 బిలియన్ డాలర్లు ఖర్చు కావచ్చని అంచనాకు వచ్చింది. అరబ్ భాగస్వాములు కూడా ఈ ఖర్చులో కొంత పంచుకోవాలని ఆశిస్తోంది.

**ఆ 400 కేజీల యురేనియం.. తరలించే అవకాశమే లేదు: ట్రంప్**

ఇరాన్ అణుకేంద్రాలపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు ఇటీవల పెద్దఎత్తున దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడుల నేపథ్యంలో 60 శాతం శుద్ధి చేసిన 400 కిలోల యురేనియంను ముందుగానే అక్కడినుంచి తరలించినట్లు టెహ్రాన్ చెబుతోంది. తాజాగా దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ.. దాన్ని ఫోర్డో అణుకేంద్రం నుంచి తీసుకెళ్లలేదని పేర్కొన్నారు. 'ఆ ప్రాంతంలో ఉన్న కార్లు, చిన్నపాటి ట్రక్కులు అక్కడి పరికరాలను కప్పి ఉంచడానికి ప్రయత్నిస్తున్న కార్మికులవి. దాన్ని అక్కడినుంచి తీసుకెళ్లలేదు. అంత మొత్తాన్ని తరలించడం చాలా కష్టం. ప్రమాదకరం కూడా' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ఇరాన్‌కు చెందిన నిల్వలు చెక్కుచెదరకుండా బయటకు తరలిపోయాయని యూరోపియన్ అధికారులను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది.

# దేశానికి సెక్యూలరిజం అవసరం లేదా?

- ఆర్ఎస్ఎస్‌కు డాక్టర్ జీ. చిన్నారెడ్డి సూటి ప్రశ్న



హైదరాబాద్ (జనంసాక్షి) : భారతదేశ సార్వభౌమత్వానికి, అన్ని కులాలు, మతాలు, అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగంలోని ప్రియాంబుల్ రక్షణగా నిలుస్తోందని, అందులోని కీలకమైన సెక్యులరిజం, సోషలిజం అంశాలను తొలగించేందుకు ఆర్ఎస్ఎస్ పెద్దలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి ఆరోపించారు. భారత దేశానికి సెక్యులరిజం అవసరం లేదా..?? అని చిన్నారెడ్డి ఆర్ఎస్ఎస్ పెద్దలకు సూటిగా ప్రశ్నించారు. ప్రియాంబుల్లోని సెక్యులరిజం, సోషలిజం అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పార్లమెంటు ఆమోదంతో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ చేర్చారని, అది దేశంలోని అన్ని కులాలు, మతాల వారికి రక్షణగా ఉందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు రక్షణ కవచంగా నిలిచిన ప్రియాంబుల్ లోని సెక్యులరిజం, సోషలిజం అంశాలను తొలగించేందుకు ఆర్ఎస్ఎస్ పెద్దలు కుట్రలు పన్నుతున్నారని చిన్నారెడ్డి ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ పెద్దలకు దేశ ప్రజల క్షేమం అవసరం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, కేవలం మతపరమైన రాజకీయాలే వారికి అవసరమని చిన్నారెడ్డి విమర్శించారు. దేశంలో అన్ని కులాలు, మతాల కుటుంబీకులలో నిరుపేదలు ఉన్నారని, మధ్యతరగతి వర్గాలతో పాటు అపర కుబేరులకు సహితం ప్రియాంబుల్ రక్షణగా ఉందన్న వాస్తవాన్ని ఆర్ఎస్ఎస్ పెద్దలు గ్రహించాలని చిన్నారెడ్డి సూచించారు. భారత రాజ్యాంగంలో ప్రియాంబుల్ అత్యంత కీలకమైందని, ప్రియాంబుల్ లో సెక్యులరిజం, సోషలిజం అనే ప్రాధాన్యత అంశాలు 1976లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ గారు చేర్చారనే ఒకే ఒక అక్కసుతోనే ఆర్ఎస్ఎస్ పెద్దలు ప్రియాంబుల్ లో కీలక అంశాలు తొలగించేందుకు విష పన్నాగం పన్నుతున్నారని చిన్నారెడ్డి ఆరోపించారు. మత తత్వ రాజకీయాలకు ఆర్ఎస్ఎస్ స్వస్తి పలకాలని, ప్రియాంబుల్ లోని సెక్యులరిజం, సోషలిజం అంశాల జోలికి వెళ్ళవద్దని చిన్నారెడ్డి ఆర్ ఎస్ ఎస్ పెద్దలకు ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# ఆర్ అండ్‌బి శాఖ బలోపేతంపై ప్రత్యేక దృష్టి

- శాఖను పటిష్ట పరిచేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్న మంత్రి





హైదరాబాద్/హుస్నాబాద్ (జనంసాక్షి) : ఆర్అండ్‌బీ శాఖ బలోపేతంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శాఖను పటిష్ట పరిచేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టారు. ఒక్క రోజే 64 మంది డిప్యూటీ ఇంజనీర్లు కు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గా ప్రమోషన్ తో పాటు పోస్టింగ్ ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. శాఖ బలోపేతం కోసం ఇంజనీర్లు అత్యంత కీలకంగా పనిచేయాలని సూచించారు. ప్రజల్లో ఆర్ అండ్ బి శాఖకు మంచి పేరు తెచ్చేలా వ్యవహరించాలని కొత్తగా ప్రమోషన్, పోస్టింగ్ వచ్చిన వారిని ఆదేశించారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని,సడలింపులు ఇచ్చి మరి ప్రమోషన్స్,బదిలీలు చేశారని ఆర్ అండ్ బి ఇంజనీర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం నల్గొండ పర్యటన బిజి షెడ్యూల్ ఉన్నా కానీ పర్యటన పూర్తి చేసుకుని వచ్చి.. అలసటను లెక్క చేయకుండా ఈ.ఈ ల ప్రమోషన్స్ పోస్టింగ్ పై అధికారులతో చర్చించి ఆదేశాలు జారీ చేశారు. కోడ్ వస్తుందేమో అని ఆందోళన వ్యక్తం చేసిన ఇంజనీర్లకు తీపి కబురు చెప్పారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నాయకత్వంలో రోడ్లు భవనాలు శాఖ బలోపేతానికి కష్టపడతామని ఇంజనీర్లు తెలిపారు. మంత్రి సూచనల మేరకు ప్రజల్లో మన్ననలు పొందేలా పని చేస్తామని మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రులతో కలిసి ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో నిర్మిస్తున్న (ఆయిల్ సీడ్) ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నీ రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అదనపు జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ తయారీ విధానాన్ని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సాగుబాటు చేస్తున్న ఆయిల్ ఫామ్ రైతులకు చేరువ అయ్యేలా ఈ ఫామ్ ఫ్యాక్టరీని త్వరలో రైతులకు అందుబాటులో కీ వచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

## హుస్నాబాద్ అభివృద్ధిలో పొన్నంది కీలక పాత్ర

ఎన్ఎస్‌యూఐ నుండి మంత్రిగా అంచెలంచెలుగా ఎదిగిన నా తోటి తెలంగాణ ఉద్యమ కారుడు పొన్నం ప్రభాకర్ అని, హుస్నాబాద్ అభివృద్ధిలో ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. హుస్నాబాద్ లో మాత శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం 250 పడకల ఆసుపత్రి, కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు నాలుగు లైన్ ల రోడ్డు కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ వస్తె గౌరవెల్లి ప్రాజెక్ట్ వస్తది హుస్నాబాద్ అభివృద్ధి జరుగుతుందని ఆనాడే పొన్నం ప్రభాకర్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశారని, 77 కోట్ల తో హుస్నాబాద్ నుండి సుందరగిరి వరకు ఫేజ్ 2 కింద రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సుందరగిరి నుండి కొత్తపల్లి వరకు 80 కోట్లతో నాలుగు వరుసల రహదారి కి వారం రోజుల్లో మంజూరు అవుతుంది..దానికి పది రోజుల్లో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పొన్నం ప్రభాకర్ లక్ష ఓట్ల మెజారిటీ రావాలని, గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేయడం కోసం ముఖ్యమంత్రి గారితో మాట్లాడామని, ఫారెస్ట్ అనుమతులు ఐపోయాయని, కాలువల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

# ఢిల్లీకి తక్షణమే అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి

- బిజెపి, కాంగ్రెస్ పార్టీలు చిత్తశుద్ధి చూపించాలి
- బిజెపి నిర్లక్ష్యం వహిస్తోంది
- బీసీలను బిఆర్ఎస్ మోసం చేసింది
- బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు ఐఏఎస్ (రిటైర్డ్)



హైదరాబాద్ (జనంసాక్షి) : 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బిల్లు ఆమోదింప చేయాలని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టీ చిరంజీవులు అన్నారు. లేని పక్షంలోబీసీలం పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం నాడు మధ్యాహ్నం ప్రెస్ క్లబ్ లో పలు బీసీ సంఘాల నేతలతో కలిసి సంయుక్తంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీలు బీసీల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, బిజెపిలకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రంలో బిల్లు ఆమోదింప చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వము బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్ పాస్ చేసి కేంద్రానికి పంపి ఇప్పటికీ మూడు నెలల సమయం కావస్తున్నా కేంద్రంలో కదలిక లేదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి బిల్లు పంపిన అనంతరం ఏడుసార్లు క్యాబినెట్ మీటింగ్ జరిగిందని ఈ బిల్లును మాత్రం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి వేగంగా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని లేని పక్షంలో బీసీలు అంతా కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు .ప్రధాని నరేంద్ర మోడీ అపాయింట్మెంట్స్ ఇవ్వకపోతే ధర్నా చేయాలని సూచించారు. 42 శాతం రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పోరాటం చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కేంద్రంలో బిజెపి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తేవడంలో కేవలం ఎనిమిది రోజుల్లోనే చట్టం చేసి దేశవ్యాప్తంగా అమలు చేసిందని అదే బీసీల బిల్లు విషయంపై పూర్తిగా నిర్లక్ష్యగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. బీసీ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకు బిజెపి కాంగ్రెస్ లు కలిసి కృషి చేయాలని కోరారు. కోర్టు తీర్పులు కూడా బీసీలకు ప్రతికూలంగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల పరిరక్షణ 9వ షెడ్యూల్ లో చేర్చడం ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే రిజర్వేషన్ల జీవోలు కోర్టులో నిలబడవని తెలిపారు. భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లు మౌలిక సూత్రాలకు అనుకూలమే కాబట్టి 9వ షెడ్యూల్లో పెడితే కోర్టులు సమీక్షించమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి లో ఇచ్చిన హామీ మేరకు కచ్చితంగా 42% రిజర్వేషన్లు అమలు చేయాలని అందుకు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షులు బాలరాజ్ గౌడ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోర్ కమిటీ సభ్యులు చామకూర రాజు, కె వి గౌడ్, పాలకురి అశోక్, చెన్న శ్రీకాంత్ ఒంటెద్దు నరేందర్, ఘోర శ్యామ్, శ్రీనివాస్, దుర్గయ్య గౌడ్, అవ్వారు వేణు, కొండల్ గౌడ్, నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్, బైరు శేఖర్, ఆయిలి వెంకన్న గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్, ఎర్ర మాద వెంకన్న, రాపోలు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌కు రేపు అమిత్ షా



హైదరాబాద్, జూన్27 (జనంసాక్షి) : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారు. నిజామాబాద్‌కు అమిత్ షా రానున్నారు. ఆదివారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి ఆయన చేరుకోనున్నారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు బయల్దేరతారు. అక్కడ జరిగే వివిధ కార్యక్రమాల్లో అమిత్ షా పాల్గొననున్నారు. నిజామాబాద్ లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అలాగే, బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ తండ్రి, దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డి శ్రీనివాస్ విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించనున్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగ జేఏసీ



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ రియంబర్స్మెంట్ బిల్లు ల మొత్తం 180.38 కోట్లు విడుదల చేసిన సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుకు ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ప్రజాభవన్ లో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. రోజుల వ్యవధిలోనే డీఏ, జీవో విడుదల చేయడం, మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్రణాళిక శాఖలో క్యాడర్ స్ట్రెంత్ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం, ఉద్యోగులు, పెన్షనర్ల హెల్త్ ఇన్సూరెన్స్ పథకం, ప్రమోషన్లకు సంబంధించి వివిధ శాఖల్లో డీపీసీ కమిటీలు వేగంగా పనిచేయడంపై ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, జేఏసీ వైస్ చైర్మన్ దేవరకొండ సైదులు,నాయకులు చావా రవి, సదానంద గౌడ్, సైదులు, ముజీబ్, కస్తూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య

- తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టు



హైదరాబాద్, జూన్ 27 (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య చేసుకుంది. ప్రస్తుతం టీ న్యూస్‌లో పనిచేస్తున్న ఆమె.. ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. తన తల్లి శ్రీదేవితో కలిసి రాంనగర్‌లో ఉంటున్న స్వేచ్ఛ.. ఇంట్లో సూసైడ్ చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న చిక్కడపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పూర్తివివరాలు సేకరిస్తున్నారు. ఆమె మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. స్వేచ్ఛ ఆత్మహత్య విషయాన్ని తెలుసుకున్న జర్నలిస్టులు దిగ్భ్రాంతి చెందారు. చురుగ్గా ఉండే స్వేచ్ఛ ఆత్మహత్యకు గల కారణాలేంటనే విషయాలను ఆరాతీస్తున్నారు. పోలీసులు కూడా పలుకోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు.

# క్యాంటీన్ పేరు మార్చే అధికారమెవరిచ్చారు?

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్



హైదరాబాద్ (జనంసాక్షి) : అన్నపూర్ణ అనే ఈ పేరు కోట్లాదిమందికి పవిత్రమైనదని, భక్తితో నిండి ఉందని, అన్నం పెట్టే అమ్మ అన్నపూర్ణ, అలాంటి పేరు మీద ముద్ర పడిన అన్నపూర్ణ క్యాంటీన్లను మూసివేసిన ప్రభుత్వానికి, వాటిని మరమ్మతు చేయలేని చేతకానితనం, అలసత్వం ఉన్న ప్రభుత్వానికి, అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చే నైతిక అధికారం ఎవరు ఇచ్చారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ ప్రశ్నించారు. 373 క్యాంటీన్లలో 53 కేంద్రాలు పూర్తిగా మూతబడ్డాయని, అధికారికంగా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ నివేదికలో బయటపడిందని, ఇంకా 320 కేంద్రాల్లో ఇన్ఫ్రాస్ట్రక్చర్ నాణ్యత లోపాలు ఉన్నట్లు బయటపడిందని తెలిపారు. ఇన్ని కేంద్రాలు మూసి వేసి, భోజనం లేక తల్లడిల్లుతున్న వేలాది మందికి జవాబుదారీతనం చూపని ప్రభుత్వం, ఇప్పుడు అదే పేదవారి పాలిట దేవత అయిన అన్నపూర్ణ తల్లి పేరును తొలగించి, కొత్త పేరు పెట్టాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తలపెట్టడం ఘోర అపరాధం, సామాజిక నేరమని చెప్పారు. అనాథలు, అన్నార్తులు, పేదలు, భిక్షాటనలో ఉన్నవారి ఆకలి తీరుస్తూ ఒక మానవతా మూర్తిగా నిలిచిన "అన్నపూర్ణ క్యాంటీన్"పై ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూపిస్తున్న దాష్టీకాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మనందరి నమ్మకం విశ్వాసంతో ముడి పెట్టబడి ఉన్న అన్నపూర్ణ పేరు తొలగించవద్దని సూచించారు.

# అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తాం

- ములుగు ప్రజల రుణం తీర్చుకుంటాం
- అభివృద్ధి చేయడమే మా లక్ష్యం
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



ములుగు ప్రతినిధి, జూన్ 27(జనంసాక్షి) : ములుగు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటామని, అర్హులందరికీ కచ్చితంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మండల కేంద్రం నుండి జీవింతరావు పల్లి గ్రామం మీదుగా గణేష్ పల్లి వరకు మూడు కోట్ల యాభై లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న రోడ్డు విస్తరణ పనులు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచంద్రలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఉద్దేశంతో మొదటి దఫాగా ప్రతి నియోజకవర్గానికి ఐదువేల ఇండ్లను కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని, ములుగు నియోజకవర్గానికి సంబంధిత మంత్రి మరో వెయ్యి ఇండ్లను అదనంగా కేటాయించనున్నారని వివరించారు. ఎక్కడ అభివృద్ధి చెందని ప్రాంతాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి రోడ్లు వేయడం, రోడ్లు విస్తరణ పనులు చేపట్టడం ముఖ్యమంత్రి ఆదేశాలతో జరుగుతున్నాయని తెలిపారు. తాము ఇచ్చిన హామీ మేరకు ములుగును మున్సిపాలిటీగా, మల్లంపల్లి గ్రామాన్ని జేడి మల్లంపల్లిగా మండలం గా ఏర్పాటు చేశామని అన్నారు. తాము అధికారికంగా ఆమోదం పొంది ఇచ్చిన హామీలను చూపిస్తున్నామని అన్నారు. తాను ఎంపీ బలరాం నాయక్ కలిసి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటామని, జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక నిధులను కేటాయించడం జరిగిందని అన్నారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ తాను గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, నేడు మంత్రి సీతక్కతో కలిసి అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎడారి ఖర్జూర తోటలో వలసజీవి స్వదేశం చేరాలని ఏడేళ్లుగా ఆరాటం

- స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- తియ్యటి ఖర్జూరాలను పండించే కూలీ జీవితం చేదు




హైదరాబాద్ (జనంసాక్షి) : ఎడారిలో శ్వాస తీసుకోవడం కూడా కష్టం అయ్యే పరిస్థితుల్లో... ఖర్జూర చెట్ల మధ్య వడగాలిలో నిలబడి, స్వదేశంలోని కుటుంబాన్ని చేరాలని ఏడేళ్లుగా తపన పడుతున్న ఒక వలస జీవి మానవీయ గాథ ఇది. సౌదీ అరేబియాలోని ఎడారిలో తియ్యటి ఖర్జూరాలను పండించే ఒక తోటలో వ్యవసాయ కూలీగా పనిచేసే ఒక గల్ఫ్ కార్మికుడి జీవితం చేదుగా మారిన సంఘటన జరిగింది. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాళ్లపల్లి ఈశ్వర్ తన ఇద్దరు చిన్నారి కూతుళ్ళ భవిష్యత్ కోసం 2017 మే నెలలో సౌదీ అరేబియాకు వెళ్ళాడు. మొదట హౌస్ డ్రైవర్‌గా పనిచేశాడు. కొద్ది నెలల్లోనే పని కోల్పోయి నిరాశ్రయుడయ్యాడు. మండే ఎండల్లో.. ఆశలు చల్లారిపోకుండా తన బిడ్డల భవిష్యత్ కోసం ఖర్జూర తోటలో కూలీగా చేరి అక్కడే చిక్కుకుపోయాడు. ఈశ్వర్ భార్య లత, ఇద్దరు కూతుళ్లతో కలిసి హైదరాబాద్ ప్రజాభవన్ లో 'ప్రవాసీ ప్రజావాణి' కౌంటర్ లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి , మంత్రి పొన్నం ప్రభాకర్ లను వేడుకుంటూ వినతిపత్రం సమర్పించారు. ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి స్వయంగా వారి వెంట ఉండి మార్గదర్శనం చేశారు. విషయం తెలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్ జిఏడి ఎన్నారై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అఖామా, వీసా గడువు ముగిసిపోయి, పాస్ పోర్ట్ సౌదీ అధికారులవద్ద జమ చేయబడినందున ఈశ్వర్‌ను స్వదేశానికి పంపించడంలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడానికి కరీంగర్ కు చెందిన సామాజిక కార్యకర్త మొహమ్మద్ జబ్బార్ సహాయాన్ని అర్థించామని లత తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రియాద్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదించి ఈశ్వర్‌ను స్వదేశానికి రప్పించాలని లత విజ్ఞప్తి చేశారు.

# ఇరాన్‌లో అయతుల్లా అలీ ఖమేనీ అదృశ్యంపై సర్వత్రా ఉత్కంఠ



ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఆచూకీపై వారం రోజులుగా కొనసాగుతున్న అనిశ్చితి, ఇజ్రాయెల్ పై అమెరికా దాడుల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ఇరాన్‌లో, ప్రజల్లో గణనీయమైన సంఖ్యలో ఆందోళ నతో పాటు ఊహాగానాలను రేకెత్తించింది. ఈ పరిస్థితి గురించి ప్రపంచవ్యాప్తంగా వివిధ సమాజాలు, మీడియా, మరియు రాజకీయ విశ్లేషకులు విభిన్న దృక్కోణాలతో స్పందిస్తున్నారు.

**ఇరాన్‌లో ప్రజల ఆందోళన:**
ఇరాన్ ప్రజలు, ముఖ్యంగా టెహ్రాన్‌లో, ఖమేనీ ఆచూకీపై స్పష్టత లేకపోవడం తో తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఆయన వారం రోజులుగా బహిరంగంగా కనిపించకపోవడం, ఎటువంటి అధికారిక ప్రకటనలు లేకపోవడం ప్రజల్లో భయాందోళనలను పెంచింది. ఇరాన్ స్టేట్ టెలివిజన్‌లో సీనియర్ అధికారి మెహదీ ఫజేలీ ఖమేనీ ఆరోగ్యం లేదా ఆచూకీ గురించి స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం ఈ ఆందోళ నలను మరింత తీవ్రతరం చేసింది. ఇరాన్‌లోని సామాన్య ప్రజలు మరియు మీడియా వర్గాలు ఖమేనీ రహస్య బంకర్‌లో ఉన్నారని, ఆయన భద్రత కోసం ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్‌లను నిలిపివేసిన ట్లు ఊహిస్తున్నాయి. కొందరు ప్రజలు ఆయన ప్రాణాలకు ప్రమా దం ఉందని భావిస్తుండగా, మరికొందరు ఆయన సురక్షితంగా ఉన్నారని, కానీ, ఇజ్రాయిల్ దాడుల దృష్ట్యా రహస్యంగా దాక్కున్నారని నమ్ముతున్నారు. ఖమేనీకి మద్దతుదారులు, ముఖ్యంగా ఇరాన్‌లో, ఆయన సాహసం, నాయకత్వ పటిమను కొనియాడుతూ సోషల్ మీడియాలో సమర్థిస్తున్నారు. కొందరు ఆయనను "ఆధునిక హిట్లర్"గా విమర్శిస్తున్న ఇజ్రాయెల్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ర్యాలీలు కూడా నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు, "ఏ అక్కిశెరా" అనే యూజర్ ఖమేనీకి మద్దతుగా మహిళలు సహా లక్షలాది మంది రోడ్లపై ఉన్నారని పోస్ట్ చేశారు.

**ప్రపంచవ్యాప్త స్పందనలు:**
ఇజ్రాయెల్ –అమెరికా నుండి వచ్చిన అధికారిక వ్యాఖ్యలు ఖమేనీని లక్ష్యంగా చేసుకున్న దాడుల గురించి స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ఖమేనీని "ఆధునిక హిట్లర్"గా అభివర్ణించి, ఆయన బతికి ఉండటానికి అర్హత లేదని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఖమేనీ ఆచూకీ తమకు తెలుసనని, కానీ ఆయనను హత్య చేయడం ఉద్దేశం లేదని, ఆయన బేషరతుగా లొంగిపోవాలని హెచ్చరించారు. పశ్చిమ దేశాల మీడియా ఖమేనీ ఆచూకీపై ఊహాగానాలను విస్తృతంగా చర్చిస్తోంది. కొన్ని నివేదికలు ఆయన రహస్య బంకర్‌లో ఉన్నారని, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్ జీసీ) యొక్క ప్రత్యేక యూనిట్ వలీ-యే అమర్ ఆయనకు రక్షణ కల్పిస్తోందని పేర్కొన్నాయి. ఈ యూనిట్ గురించి ఐఆర్ జీసీ సీనియర్ అధికారులకు కూడా తెలియదని, ఇది ఖమేనీ భద్రత కోసం ఏర్పాటు చేసిన అత్యంత రహస్య విభాగమని సమాచారం.

ఖతార్, సౌదీ అరేబియా, ఒమన్ వంటి పశ్చిమాసియా దేశాలు ఇజ్రాయెల్ దాడులను ఖండించాయి, ఇవి అంతర్జాతీయ శాంతి భద్రతలకు హానికరమని పేర్కొన్నాయి. ఈ దాడులు ప్రాంతీయ స్థిరత్వంపై ప్రభావం చూపుతాయని, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మరియు రాజకీయ పరిణామాలను ప్రభావితం చేస్తాయని అవి ఆందోళన వ్యక్తం చేశాయి. భారత్, ఇజ్రాయెల్ మరియు ఇరాన్‌తో సమతుల్య సంబంధాలను కొనసాగిస్తోంది. ఇరాన్‌తో చమురు సరఫరా మరియు చారిత్రక సంబంధాలు, ఇజ్రాయెల్‌తో రక్షణ సంబంధాలు కీలకమైనవి. ఈ ఘర్షణ తీవ్రమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ముఖ్యంగా భారత్ పై ప్రభావం చూపుతుందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. కాల్పుల విరమణ కోసం భారత్ కోరుకుంటోంది.

**రాజకీయ - వ్యూహాత్మక దృక్కోణం:**
ఖమేనీని టెహ్రాన్‌లోని ఈశాన్య ప్రాంతంలో లేదా ఇరాన్‌లోని పర్వత ప్రాంతంలో అత్యంత సురక్షితమైన బంకర్‌లో ఉంచారని నివేదికలు సూచిస్తున్నాయి. ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్‌లను పూర్తిగా నిలిపివేయడం ద్వారా ఆయన ఆచూకీ గుర్తించకుండా చేసే ప్రయత్నం జరుగుతోంది. ఆయనతో కేవలం ముగ్గురు సన్నిహితులు మాత్రమే సంప్రదింపులు జరుపుతున్నారని, ఇరాన్ ప్రతి దాడుల వ్యూహాలను రూపొందిస్తున్నారని తెలుస్తోంది.
ఖమేనీ ప్రాణాలకు ప్రమాదం ఉందనే భయంతో, ఆయన తన వారసులుగా ముగ్గురిని ఎంపిక చేసినట్లు న్యూయార్క్ టైమ్స్ నివేదించింది. అలీరేజా అరాఫీ, అలీ అస్గర్ హెజాజీ, హాషీం హుస్సేని బుషారీలలో ఒకరు సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించవచ్చని సమాచారం. ఆశ్చర్యకరంగా, ఖమేనీ కుమారుడు మొజతాబా ఈ జాబితాలో లేకపోవడం చర్చనీయాంశమైంది.

**యుద్ధ పరిణామాలు:**
ఇజ్రాయెల్ దాడులు ఇరాన్ అణు కార్యక్రమాలను లక్ష్యంగా చేసుకున్నాయని, ఖమేనీ హత్య ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వీటో చేసినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. అయితే, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఖమేనీ లేకుండా చేయడమే యుద్ధాన్ని ముగించే మార్గమని స్పష్టం చేశారు, ఇది ఖమేనీపై ఒత్తిడిని మరింత పెంచింది.

**ప్రపంచవ్యాప్త చర్చలు, ఊహాగానాలు:**
X ప్లాట్‌ఫామ్‌లో ఖమేనీ ఆచూకీపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆయన రహస్య బంకర్‌లో సురక్షితంగా ఉన్నారని, ఇరాన్ శక్తిమంతంగా ప్రతిస్పందిస్తుందని పోస్ట్ చేస్తున్నారు (ఏసబాబిస్పీక్) మరికొందరు, ఖమేనీ అజ్ఞాతంలోకి వెళ్లడం ఇరాన్‌లో అస్థిరతకు సంకేతమని, ఇజ్రాయెల్ ఆధిపత్యం సాధిస్తోందని వాదిస్తున్నారు.
అమెరికా దాడులు, ఇజ్రాయెల్ యొక్క ఆపరేషన్ రైజింగ్ లయన్, మరియు ఇరాన్ ప్రతిదాడుల నేపథ్యంలో, మూడో ప్రపంచ యుద్ధం గురించిన ఊహాగానాలు సోషల్ మీడియాలో, అంతర్జాతీయ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ ఘర్షణ ప్రాంతీయ యుద్ధంగా మారి, రష్యా, పాకిస్తాన్ వంటి దేశాలను కూడా ఈ యుద్ధం లోకి ఇరుక్కోవచ్చని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖమేనీ ఆచూకీ అనిశ్చితితో, ఆయన వారసత్వం గురించి చర్చలు ప్రపంచ రాజకీయ విశ్లేషకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆయన మరణిస్తే, ఇరాన్ రాజకీయ వ్యవస్థలో స్థిరత్వం ప్రశ్నార్థకంగా మారవచ్చని, ఇది ప్రపంచ రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
ఖమేనీ ఆచూకీపై అనిశ్చితి, ఇరాన్–ఇజ్రాయెల్–అమెరికా మధ్య కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో, ఇరాన్ ప్రజల్లో భయాందోళనలు, ప్రపంచ వ్యాప్తంగా ఊహాగానాలను రేకెత్తించింది. ఇరాన్ అధికార వర్గాలు ఆయన సురక్షిత బంకర్‌లో ఉన్నారని, ప్రత్యేక భద్రతా దళాలు రక్షణ కల్పిస్తున్నాయని చెబుతున్నప్పటికీ, ఆయన బహిరంగంగా కనిపించకపోవడం ఆందోళనలను తగ్గించలేకపోయింది. ఇజ్రాయెల్ – అమెరికా యొక్క దూకుడు వైఖరి, ఖమేనీ వారసత్వ చర్చలు,మూడో ప్రపంచ యుద్ధ భయాలు ఈ సంక్షోభాన్ని ప్రపంచ దృష్టిలో కేంద్రబిందువుగా నిలిపాయి. ఈ పరిస్థితి రాజకీయ, ఆర్థిక, సైనిక రంగాలలో దీర్ఘకాలికంగా పరిణామాలను కలిగి ఉండవచ్చు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.



## నేస్తమా

ఆకురాలు కాలమని
అదిరిపోకు వచ్చేది వసంతకాలం
శత్రువు బలహీనుడు
యుద్ధనీతి లేనివాడు
డ్రోన్ దాడులు
అన్నంలో విషం
గాలిలో మత్తుస్ప్రేలు,
నీళ్లల్లో విషం చల్లుతున్నాడు.
దొరకపట్టి కొట్టి చంపుతూ
మీడియా ముందు హంగామా
చేస్తు
ఎన్కౌంటర్ కథ అల్లుతున్నాడు.
అమెరికా సామ్రాజ్యవాద
ఆపరేషన్లు సల్వాజుడుం ,గ్రీన్
హాంట్,సమాధాన్1,2,3
కుట్రలను ప్రజలు ఓడించింద్రు
ఆపరేషన్ కగార్, మోడీ,
అమిత్ షాలు
దండకారణ్యం మాడ్ కొండల్లోని
సంపదను తరలించేందుకు
ఆదాని, అంబానిలకు దోచి
పెట్టేందుకు
అన్న నిజం దేశమంత తెలుసు.
ఆకలి బాధ తెలువనోళ్లు
పేదరికం పట్టించుకోనోళ్లు
పెద్దరికం చేసేటోళ్లు
పెట్టుబడుదారులు,కిరాయిమూఠ
గాళ్ళు
పాసిస్టులు,రౌడీ ముఠాగాళ్ళు,
లంపెళ్లు, దొంగదాడులు చేస్తూ
ఆదివాసీలను,ఉద్యమకారులను
ఇంద్రావతి,శబరి,తాలు పేరు
నదుల కళ్ల ముందు కాల్చి
చంపుతున్నారు.
నగ్జల్బరీ,శ్రీకాకుళం,ఇంద్రవెల్లి
దండకారణ్య%శీ%కు దారులు
వేసిందని,
ప్రజలు చరిత్ర నిర్మాతలని
చరిత్ర చాటింది.
అంతిమ విజయం ప్రజలదేనని
తూర్పు కనుమలు నిలబడి
అమరులకు సలాం చేస్తూ
విప్లవం అంతరించదని
చరిత్ర సవాల్ విసురు తున్నది...

బాలసాని రాజయ్య
9866102315

## రాక్షసులు!



చేసిందంతా చేసి
ఏమీ ఎరగనట్టు
పత్తిత్తు ప్రవచనాలు!

ఎక్కడి నుంచి వచ్చార్రా
మీరు నా దేశాన్ని
సర్వ నాశనం చేసారు!

మూడొంతుల జనాన్ని
సూద్రులపేరుతో
నిరక్షరుల్ని చేసారు!

సహగననం పేరుతో
బతికున్న స్త్రీలను
'చితి' పెట్టి చంపారు!

దళితులపేరుతో
మరికొందరిని
అస్పృస్యుల్ని చేసారు!

ఒళ్ళు కొవ్వెక్కి
వాళ్ళను ఇష్టారాజ్యం
వాడుకున్నారు!

'బసివిని' పేరుతో
దళిత బిడ్డల్నివాడకంతా
'వదిన'ల్ని'చేస్తారా!

నవ వధువులతో
మూడు రాత్రులు
పూజారిగడపటమా?

భవన పునాదుల్లో
సూద్ర బాలుర బలి!
చరక్ పూజా అది!

ఎన్నెన్ని దుర్మార్గాలు!
తెల్లోడు చట్టంఅడ్డేసి
మమ్మల్ని కాపాడాడు!
అవి అప్పటి సంగతులు

ఇప్పటికీ పశ్చత్తాపంలేని
దుష్టనికృష్టులుమీరంతా!

దళిత బిడ్డల్ని
కట్టేసి కొట్టటం!
వాళ్లపై అత్యాచారం!

దళిత ప్రొఫెసర్‌కు
ఆఫీస్ లో కుర్చీతీసేసి
నేలమీద కూర్చోవాలా?


అత్యాచారం గాళ్ళకు
సన్మానాలు పూలదండలా
మీరసలు మనుషులేనా?

ఇలాంటి అమానుష
కార్యనిర్వహణకు
గంధర్వులు మీరేకదా!

ఇదామనుస్మృతి!అది
రేపటి రాజ్యాంగమా?
ఎంతటి రాక్షసత్వం?

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# నీహారిక



"అక్కా" అంటూ విశాల పలకరించడంతో మంచిది అంటూ కదిలింది నీహారిక.
" విశాలీ! ఏదో విన వద్దది. ఏం సంగతి. జాగ్రత్తగ ఉండు. మంది కంట్లో పడితే మంచిది కాదు " మెల్లిగా అంది నీహారిక.
"అన్ని పుట్టిస్తరు అక్కా!మంచిగ బతుకుతున్నమని ఏదో ఒకటి అంటరు. నరం లేని నాలిక. మొన్న మా చిన్నమ్మ కొడుకు గల్ఫ్ కు పోయి వచ్చిండు. అక్కనినుంచి బట్టలు , ఫోన్ పంపిస్తె తెచ్చిండు. మల్ల పోవట్టె అని భోజనం చేసిన. కొన్ని అప్పాలు చేసిన పిల్లగాన్లు తింటరని! " అంది అనుమానాలు పటాపంచలు చేస్తూ.
" లోకులు కాకులు. బట్ట కాల్చి మీదేత్తరు జాగ్రత్తగ ఉండాలె. ఒంటిగ ఉన్నవు. రెండేండ్లయినట్టుంది పోయి! "
అంటూ ముందుకు కదిలింది నీహారిక.
నాలుగడుగులు వేసేసరికి పది మంది ఆడవాళ్లు కనిపించారు. నీహారిక అక్కడే ఆగిపోయింది. బీడీల కంపెనీ దగ్గర బీడీలు తీసుకుంటున్నాడు శివ శంకర్. ఎవరి చాటలో వారు బీడీల కట్టలు పేర్చుకుంటున్నారు. బీడీలు లెక్క చూసుకొని గంపలో వేసి వారి కార్డు మీద రాస్తున్నాడు . బీడీల ఆకు తంబాకు తూకం వేసి ఇస్తున్నాడు శివ శంకర్.
" నీహారిక అక్క వచ్చింది." అంటూ పలకరింపుగా నవ్వారందరు. ఒకరు ఒక రేకు ఫోల్డర్ కుర్చీ వేసారు కూర్చొమ్మని.
నీహారిక కూర్చీపై కూర్చుంది.
"ఆసరా పథకం రెండువేలు అందరికి జమైనయా? " పలకరింపుగా అడిగింది నీహారిక.
" మాకు వస్తలేవు అక్కా!" అంటూ ఇద్దరు ఫిర్యాదు చేసారు.
" వాల్లకు కార్డు పుట్ట లేదు. పి ఎఫ్ ఖాతా లేదు. కంపెనీ కొత్తకార్డులు ఇస్త లేదు " అన్నాడు బీడీల కంపెనీ శివశంకర్.
అంతలో ఎవరో సైకిల్ మీద బట్టల మూట తీసుకొని వచ్చారు.
" పరంధాములన్న బట్టలు తెచ్చిండు " అంటూ అందరు అతనికి దారి ఇచ్చారు.
నీహారికను చూసి పరంధాములు పలకరించాడు.
"మీ పిల్లలు ఎక్కడ చదువుకుంటున్నరు అక్కా?" చిన్న పెద్ద అనే తేడా లేకుండా అక్కాఅని అన్నా పిలవడం అందరికీ అలవాటైపోయింది.
" మా పిల్లలను గురుకుల పాఠశాలలో వేసిన. నాతోటి వుంటే వాల్ల చదువులు పాడైతై. మీ కొడుకు కాంట్రాక్టులనుకుంట పార్టీ అనుకుంట తిరగవట్టె. ఇగ వాల్లను ఎవరు చూసుకోవాలె." అంది నీహారిక.
బట్టల మూట విప్పి నైలాన్ చాపలో పరిచాడు పరంధాములు.
ముచ్చట్లు మొదలయ్యాయి.
జాకెట్ పీసులు, రెడీ మేడ్ లంగాలు, పిల్లల బనీన్లు డ్రాయర్లు, ఫ్రాకులు కొన్ని చీరలు తువ్వాల్లు తెచ్చినట్టున్నాడు. తలా కొన్ని సెలెక్టు చేసుకుంటున్నారు. ఉద్దెర ఇచ్చి బీడీల పైసలు వచ్చినపుడు వచ్చి తీసుకుంటడు పరంధాములు. పరంధాములు వాల్లకు ఇంటి మనిషి లెక్క.
" మీకేంది ఇద్దరు రెండు చేతుల్ల సంపాదిస్తున్నరు" మెచ్చుకోలుగా అన్నాడు పరంధాములు నీహారికను.
ఆ మాటకు నీహారిక నొచ్చుకుంది.
"ఏంది మామా! చూస్త లేవా? నీ కొడుకు సంపాదన? నేను ఏం చేస్తున్నాని సంపాదన?" అంది నీహారిక.
" రోడ్డు పోయించినదాంట్ల పదివేలు మిగిలినయంట కద అక్కా! ఇంటర్ అయిపోయి బీడీలు చేస్తున్న జ్యోతి అడిగింది అమాయకంగా.
"రెడ్లు గట్లనే బదునాం జేస్తరు. యాడాది దాటిపాయె. అప్పు తెచ్చి కూలోల్లకిస్తిమి . ఇప్పటికీ బడ్జెట్ రాకపాయె. వడ్డీ పెరుగ వట్టె. కొందరు సర్పంచులు రాజీనామా చేసింది పేపర్లల్ల టీవీల చూస్త లేవా జ్యోతీ! అది సరేగని డిగ్రీలో ఈ ఏడన్న జాయిన్ కావా?"
అంది నీహారిక.
"నాయిన వద్దంటుండు అక్కా! బీడీలు చేసుకుంట చదువుకుంట అంటె గూడ వింట లేదు. పెండ్లి సంబంధాలు చూస్తన్నరు." అంది జ్యోతి.
" ఇపుడే పెళ్లేంది? మీ నాయిన తోటి మాట్లాడుత. నువ్వు డిగ్రీ పీజీలు చెయ్యాలె.. టీచరో , అడ్వకేటో. లెక్చరరో, సాఫ్టువేర్ ఇంజనీరో కావాలె.." నీహారిక మాటకు అందరు మెచ్చుకోలుగా నవ్వారు.
స్కూలు ఫస్ట్ బెల్ మోగింది.
" మీరందరు ఇక్కడ దొరుకుతరని ఒక మాట చెప్పుదామని వచ్చిన" అంది నీహారిక.
ముచ్చట్లు ఆగి పోయాయి. ఏం చెపుతుందో అని ఆసక్తిగా చూస్తున్నారు.
" వచ్చే ఆదివారం మనందరికీ వన భోజనం. ఊరందరం కల్సి భోజనం చేద్దాం. ఆ రోజు ఇంట్లో వంట బంద్. అందరం అన్ని కులాలోల్లం కలిసి ఒకటే పంక్తి భోజనం. ఆడోళ్లు వంట చేసేది లేదు. ఆ రోజు అన్ని పనులు మగ వాళ్లే చేస్తారు. మామిడి తోటలో సాయంత్రం దాక ఆటలు పాటలు."
జ్యోతి చప్పట్లతో అందరూ చప్పట్లు కొట్టారు.
" మరి ఇక వెల్తాను. మన మహిళా సంఘాలను కలిసి చెప్పాలె." అంటూ బయల్దేర బోయింది నీహారిక.
" అక్కా నాదొక మాట ! ఈ సారి మన మహిళకే పరిమితం చెయ్యాలె! "
" ఒకే. అట్లయితే మగవాల్లు ఆ రోజు వాల్లే సంతంగా వంట చేసుకోవాలె."
బాగుంది అనుకుంటూ కొందరు... అయ్యో ఎట్ల అనుకుంటూ ...కొందరు..
లంచ్ బాక్సులు తీసుకొని మహిళలు పొలం పనులకు పోతూ ముచ్చట్లాడుతున్నారు. నీహారిక ను చూసి క్షణం సేపు ఆగారు. ఆదివారం వన భోజనం గురించి వివరించింది నీహారిక.
' రోడ్డు పక్కన రెండిండ్లు కూలుతున్నాయి. మొండి గోడల మీద గడ్డి మొలిసింది. కోళ్లు ఏరుత తింటున్నాయి. రెండు ఊర కుక్కలు మొరుగుతున్నాయి. ఊరు ఎండి పోతున్నది . పనులు లేక ఎక్కడెక్కడికో వలసపోతున్నారు. ' నీహారిక మనసు క్షణం సేపు ఎటో పోయింది. అక్కడే ఆగింది.
" అక్కా! కొత్త జాబ్ కార్డులు ఎప్పుడిస్తరు" పెండ్లయి అత్తగారింటికి వచ్చిన అర్చన అడిగింది. అర్చన కాస్త చదువుకుంది గాని స్వంత వ్యవసాయం లేదు. కూలి పనికి పోతుంది.
కేంద్ర ప్రభుత్వం ఎపుడో ప్రవేశ పెట్టిన పథకం అది. అది పని దినాల కల్పన కోసం పనికి ఆహార పథకం . పని తక్కువ కూలి ఎక్కువ వస్తుంది.
" ఏమో! ఎపుడిస్తరో తెలువది. తెలుసుకుంట" అంటూ చెప్పి నీహారిక అక్కడినుంచి కదిలింది.
నీహారిక వారిని వీరిని అందరిని కలిసి వంట చేసుకొని తిని ఒక బాక్సులో విజయత్తకు ఇచ్చి వచ్చి విశ్రాంతిగా కూర్చుంది. అంతలో ఏదో పనిమీద ముగ్గురు వచ్చారు. వాల్లకు ఫ్లాస్కులోని టీ కప్పుల్లో పోసి ఇచ్చింది నీహారిక.. వారి విషయాలు మాట్లాడి వాల్లు వెళ్లి పోయే సరికి టైమై పోవట్టె అనుకుంటగబ గబా బయలుదేరి జిల్లాపరిషత్ మీటింగ్ కు చేరుకుంది నీహారిక. అప్పటికి మీటింగ్ ముగింపు కొచ్చినట్టుంది.
ఎవరో ఉచిత పథకాలు తొలగించాలని మాట్లాడుతున్నారు. నీహారికకు కోపం ముంచుకు వచ్చింది.
" ఏం మాట్లాడుతున్నారు? కాల్లు రెక్కలు ఉడిగే దాకా వాల్లు ఈ సమాజంకోసం పని చేసారు. ఎవరూ కూర్చుని తినలేదు. వారికి పి.యఫ్ ఇచ్చామా? పెన్షన్ ఇచ్చారా? మనకు మాత్రం అన్నీ కావాలి. ఆసరా పథకం దుర్వినియోగం అయితే అందుకు పరిష్కారాలున్నాయి. ప్రతి ఊరిలో ఆనందాశ్రమం ఉండాలి. ఉండేవాల్లు ఉంటారు. కనీసం 15 రోజులు అందులో తినాలి. అపుడే నిజంగా ఎవరికి అవసరమో తెలిసిపోతుంది. . వంట నుండి విముక్తం కావడం అంటే సగం జీవితం విముక్తం కావడం. వంట చేసే ప్రతి మహిళ శ్రామిక మహిళే. దానికి తోడు ఇల్లు, పిల్లలు, చాకిరీ. దీనికి అదనంగా వ్యవసాయం, బీడీలు, ఉద్యోగం. మహిళలకన్నా శ్రామిక వర్గం ఎవరుంటారు? వారికి ఆసరా పథకం వద్దా? ఏం మాట్లాడుతున్నారు? ఈ కాలంల కొడుకులు కోడండ్లు చూసుకునే టైముంటుందా? ఎక్కడెక్కడో పని చేసుకుంట బతుకుతున్నారు. సగం వూరు బయటనే బతుకుతున్నారు. ముసలోల్లకు ఇల్లిడిసి పోబుద్ధి కాదాయె! ఒంటరి మహిళలకు దిక్కేది? మనం సుఖంగ బతికితే చాలా?గల్ఫ్ లో కష్టపడి పని చేస్తూ తినీ తినక కడుపు కట్టుకొని మన దేశానికి వేల కోట్ల ఫారెన్ మనీ పంపుతున్నరు. వాల్లకోసం మనం ఒక్క స్కీమైనా పెట్టినమా? కలివెలి టూరిస్టు వీసా మీద పంపి ఉద్యోగం అని చెప్తే మోసపోయి జైలు పాలు కావట్టిరి. వాల్లు జైల్ల పడితే ఇక్కడ ఆడోల్లు పిల్లలను పట్టకొని ఎటని తిరుగుతరు. వాల్ల కోసం మనకంటూ ఒక పాలసీ వుందా? పృభుత్వమే బాద్యత తీసుకొని ప్రభుత్వం ద్వారా పంపి ఈ మోసాలు అరికట్ట వచ్చుగద. ఎని రోజుల నుంచో అడుగుతున్న. మా వూరిలో దోబీ ఘాట్ కట్టి బోరింగ్ వేసి కరెంటు మోటార్ పెట్టియ్యాలని. అతి లేదు గతి లేదు. మహిళా రజకుల కష్టాలు మీ చెవికి ఎక్కుతున్నాయా? గవర్నమెంటు స్కూల్లో స్టాఫ్ ఉండరు. పిల్లలు పొరుగూరు బాట వట్టవట్టిరి. ఊర్లె డ్రైనేజీ మోర్లకు బడ్జటు లేదంటరు. సకాలంలో విత్తనాలు , ఎరువులు రావు. ఊర్లె పనులు లేక సగం ఊరు ఖాలీ అయింది. ఉండెటోల్లు లేక పాత ఇండ్లు కూలి పోవట్టె. బెల్టు షాపులు వద్దంటే పట్టించుకున్నోల్లు లేరు. తాగి సంపాదనంతా వేస్టు చెయ్య వట్టిరి."
ఆవేశంగా నీహారిక మాట్లాడుతుంటే సభ విశ్శబ్దం. రెండు క్షణాల తరువాత సభ చప్పట్లతో మారు మోగిపోయింది.
" ఈ సారి మహిళల ఓట్లన్ని మీకే! ఎమ్మెల్లేగా పోటీ చేయాలె" ఎవరో ఆనందంగా అరిచారు.
నాకు అలాంటి కోరికలేం లేవు. నా పిల్లలను చూసుకోవాలె. వరంగల్లోని గంగ దేవి పల్లెలా , , అన్నా హజారే రాలేగాం తీర్చి దిద్దినట్టు మా వూరిని ఆదర్శంగా తీర్చి దిద్దితే చాలు. " " అంటూ నవ్వింది సర్ పంచ్ నీహారిక.



బి ఎస్ రాములు
8331966987

# స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు సాధ్యమయ్యేనా?



**(స్థానిక సంస్థల ఎలక్షన్‌పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో)**

తెలంగాణ రాష్ట్రం స్థానిక సంస్థల పోరుకు సిద్ధమవుతోంది. ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. సంవత్సరం దాటిన గ్రామాలలో సర్పంచులు లేక గ్రామ పరిపాలన కుంటుప డింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులు స్తంభించా యి. ఇటీవల తెలంగాణ హైకోర్టు సైతం సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎలక్షన్ నిర్వహించాలని నిర్దేశించినది. అధికార వికేంద్రీకరణకు కేంద్ర బిందువు అయిన స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగితేనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతు ంది. కానీ ఈ అధికార వికేంద్రీకరణలో అట్టడుగు వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ మొదలైనది. ఇప్పుడు రాజకీయ పార్టీలు సైతం ఆ దిశగా అడుగులు వేసే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ దేశంలో మొదట కులగణన అంశం తెరపైకి తెచ్చింది. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా చేర్చింది. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన ప్రక్రియ పూర్తిచేసి బీసీ వర్గాలకు స్థానిక సంస్థలు, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అసెంబ్లీలో బిల్లు ఆమోదించినది. ఈ బిల్లును కేంద్రానికి పంపినా... ఇప్పటికీ ఆమోదం పొందడం లేదు. దేశంలో రిజర్వేషన్లు 50 శాతం మించరదని కోర్టు నిర్దేశించిందని కేంద్ర ప్రభుత్వం దాటవే స్తున్నారు. మరోవైపు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సైతం జనగణనతో పాటు కులగణన చేయడానికి సిద్ధపడింది. ఇది ఒక ప్రజా డిమాండ్ గా ముందుకెళ్లడంతో కేంద్రం ఆ దిశగా అడుగులు వేయక తప్పలేదు. కాని తెలంగాణకు సంబంధించి న 42 శాతం స్థానిక సంస్థల ఎలక్షన్ రిజర్వేషన్ బిల్లును ఆమోదం సాధ్యం కానప్పుడు ఈ కులగణన చేయడం వృధా కాదా?. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2011 జనాభా లెక్కల్లో సామాజిక ఆర్థిక కులగణన చేయడం జరిగింది. అయినా అది రాజకీయ సంక్లిష్టత నేపథ్యంలో విడుదల చేయలేదు. మరి ఇప్పుడు ఈ సోషల్ జస్టిస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలవుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**రిజర్వేషన్లు ఇవ్వనప్పుడు కులగణన ఎందుకు?**
ఏళ్ల చరిత్ర గల ఈ రాజకీయ పార్టీల సామాజిక న్యాయ సూత్రం అమలు దిశగా అడుగులు వేస్తున్నట్టు ప్రకటనలు చేస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ లో రెడ్డి ఎమ్మెల్యేల ఆధిపత్యం ఉన్నప్పటికీ...బీసీ ,ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. ఇది మంచి పరిణామమే. కానీ రాజకీయాల్లో బడుగు బలహీన వర్గాలకు పదవులు లభించినా...అధికారాలు ఇస్తారా ? అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ధనస్వామ్య ప్రజాస్వామ్యంలో జనరల్ స్థానంలో ఒక నిరుపేద బిడ్డ గెలిచే అవకాశం లేదు. తెలంగాణలో మెజార్టీ నామినేటెడ్ పదవులను, ఉన్నత అధికారులలో తమకు అనుచరులుగా ఉండే అగ్రకులాలే వారినే ఇచ్చారు. ఒక శాతం లేని వెలమలు 10 సంవత్సరాలు రాష్ట్రాన్నీ పరిపాలిం చారు, ఇప్పుడు 5 శాతం ఉన్న రెడ్లు పాలిస్తున్నారు. మరి 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు పాలితులుగానే మిగిలిపో యారు. బిజెపిలో కూడా అగ్రకులాలకే ముఖ్య పదవులు ఇచ్చారు. మొత్తంగా అన్ని పార్టీలు ఒకటే. కింది కులాలకు పదవిలిచ్చినప్పటికీ అవి కీలుబొమ్మలాంటివే . రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ అసెంబ్లీలో ఆమోదించిన బీసీ రిజర్వేషన్స్ బిల్లు కేంద్ర ప్రభుత్వం పెండింగ్ లో పెట్టింది. వెనుకబడిన వర్గాలకు పదవుల్లో ప్రాధాన్యమిచ్చే ఈ బిల్లు ఎటు తేలికముందే రాష్ట్రం స్థానిక సంస్థల ఎలక్షన్లకు సిద్ధపమవుతుంది. ఈ రకంగా ముందుకు వెళితే వెనుకబడిన వర్గాలు నష్టపోక తప్పదు. కేవలం ప్రజలను మభ్య పెట్టడానికి మాత్రమే ఈ సాధ్యం కానీ బిల్లులు, ప్రకటనలు చేస్తున్నారా అనిపిస్తుంది. అంటే ఈ పార్టీలలో సామాజిక న్యాయం ఏముంది. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప. ఇప్పటికి గ్రామా రాజకీయాలు అగ్రకుల కబంధ హస్తాల కిందనే నడుస్తున్నాయి. గ్రామ పరిపాలనలో బీసీ ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్ల ద్వారా పదవులు ఇచ్చినా...వారిని అగ్రకులాలు పావులుగా వాడుకుంటున్నారు. ఈ వ్యవస్థ మారాలంటే అణగారిన వర్గాల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉంది. దేశం, రాష్ట్రాలు కుల గణన చేయడమంటే సామాజిక న్యాయం, వనరుల సమాన పంపిణీకి విధాన రూపకల్పనగా చెప్పవచ్చు. ఎవరి వాటా ప్రకారం వారికి అన్నింటిలో అవకాశాలు, అధికారాలు ఇవ్వాలి. అప్పుడే కులగణన సిద్ధాంతానికి అర్థం. ఈ దేశ నిర్మాణంలో తన రక్త మాంసాలు దార పోసిన బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలు అధికారంలోకి రావడమే నిజమైన సామాజిక న్యాయం. ఇది జరగాలంటే బడుగు బలహీన వర్గాలు ఓటు చైతన్యంతో ముందుకెళ్లాలి. గ్రామ పరిపాలన బడుగు బలహీన వర్గాల చేతిలోకి వచ్చినప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యమైతుంది. ఇది ఈ స్థానిక సంస్థల ఎలక్షన్ నుంచి ఆరంభం కావాలి.

సంపతి రమేష్ మహరాజ్
సామాజిక విశ్లేషకులు
7989578428

# నేటి నుండి అందుబాటులోకి రానున్న పీజేఆర్ ఫ్లై ఓవర్

- ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- ఇక ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు

**హైదరాబాద్ సిటీ, జూన్ 27 (జనంసాక్షి) :** ఔటర్ రింగ్ రోడ్డు నుండి కొండాపూర్ వరకు చేపట్టిన పి జె ఆర్ ఫ్లై ఓవర్ శనివారం ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే, హైదరాబాద్ ప్రజలకు, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఔటర్ రింగ్ రోడ్ నుండి కొండాపూర్ వరకు అత్యాధునిక మల్టీ-లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి అయిన నేపథ్యంలో జూన్ 28న రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే, గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది మరియు ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది.



### ప్రాజెక్ట్ వివరాలు

ఈ ఫ్లైఓవర్‌ను వ్యూహాత్మక రహదారి అభివృద్ధి కార్యక్రమం కింద రూ. 182.72 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఇది 1.2 కి.మీ పొడవు మరియు 24 మీటర్ల వెడల్పుతో ఆరు లేన్‌లతో ఉంటుంది. దీని ప్రత్యేకత ఏమిటంటే ఇది ఇప్పటికే ఉన్న రెండు ఫ్లైఓవర్లపై నిర్మించిన మూడవ-స్థాయి నిర్మాణం. క్రింద గచ్చిబౌలి జంక్షన్ ఫ్లైఓవర్ ఉంది, దాని పైన శిల్పా లేఅవుట్ ఫేజ్ 1 ఫ్లైఓవర్ ఉంది మరియు ఇప్పుడు దాని పైన ఫేజ్ 2 ఫ్లైఓవర్ నిర్మించబడింది.

ప్రయాణికుల ట్రాఫిక్ కష్టాలు పరిష్కారమవుతాయి. ఈ ఫ్లైఓవర్ గచ్చిబౌలి జంక్షన్ వద్ద తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను చాలా వరకు తగ్గిస్తుంది.

### మెరుగైన కనెక్టివిటీ

ఓఆర్ఆర్ నుండి కొండాపూర్ మరియు హఫీజ్‌పేట్ మార్గాలకు వెళ్లే వాహనాలకు ఇది చాలా అనుకూలంగా ఉంటుంది. ఇది హైటెక్ సిటీ మరియు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. ప్రయాణ సమయాన్ని ఆదా చేయడంతో పాటు, మీరు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా చేరవలసిన గమ్యస్థానాలను వేగంగా చేరుకోవచ్చు. కొండాపూర్ ప్రాంతం నుండి, శంషాబాద్ విమానాశ్రయం అక్కడి నుండి కొండాపూర్ ప్రాంతాలకు గచ్చిబౌలి వద్ద ఎటువంటి ట్రాఫిక్ జామ్‌లు లేకుండా నేరుగా చేరుకోవచ్చు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభం హైదరాబాద్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక ముఖ్యమైన అడుగు అవుతుంది. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్ఆర్‌డిపి పెద్ద పునాది వేసిన నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్ ద్వారా 23వ ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది. ఎస్ ఆర్ డి పి ద్వారా ఫ్లైఓవర్లు చేపట్టినా, నగరంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా నిర్ణీత సమయంలో నేరుగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు.

ఎస్ఆర్‌డిపి ద్వారా చేపట్టిన మొత్తం 42 పనులలో 37 పనులు ఈ ఫ్లైఓవర్‌తో పూర్తయ్యాయి. ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి మరియు శాస్త్రిపురం ఆర్‌ఓబి పనుల రైల్వే భాగాన్ని రెండు మూడు నెలల్లో పూర్తి చేయాలని కమిషనర్ ఆర్ వి కర్ణన్ లక్ష్యంగా పెట్టుకుని రైల్వే అధికారులను కోరారు. జూలై చివరి నాటికి ఫలక్‌నుమా ఆర్ ఓ బి పనులను, ఆగస్టు చివరి నాటికి శాస్త్రిపురం ఆర్‌ఓబి పనులను పూర్తి చేయాలని కమిషనర్ వారికి లక్ష్యంగా నిర్దేశించారు. ఈ రెండు ఆర్ ఓ బి లు పూర్తయితే, 39 ఎస్ ఆర్‌డిపి పనులు పూర్తవుతాయి. వాహనదారులు ఈ ప్రాంతంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రయాణించవచ్చు.

### హెచ్‌సిటీ

నగర అభివృద్ధి కోసం రూ. 7032 కోట్ల వ్యయంతో 58 పనులను హెచ్ సిటీ ద్వారా చేపట్టనుంది. వీటిలో 28 ఫ్లైఓవర్లు, 13 అండర్‌పాస్‌లు, 4 ఆర్ ఓ బి లు, 03 రైల్వే అండర్‌బ్రిడ్జిలు మరియు 10 రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రతిపాదించబడ్డాయి. ఈ పనులు టెండర్ దశలో పూర్తయ్యాయి. ఒప్పంద దశలో ఉన్నాయి. ఈ పనులలో కొన్ని త్వరలో ప్రారంభం కానున్నాయి.

## గంజాయి విక్రేత పట్టివేత 1.2 కిలోల గంజాయి స్వాధీనం

- డిఎస్పి బాలకృష్ణారెడ్డి



**తాండూరు, జూన్ 27 (జనంసాక్షి) :** గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకొని 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని డిఎస్పి బాలకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణ సిఐ సంతోష్ కుమార్ తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎస్పి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీ నిర్వహించారు. ఒక వ్యక్తి హ్యాండ్ బ్యాగ్‌తో అనుమానాస్పదంగా నడుచుకుంటూ వస్తున్నాడని, వెంటనే ఆ వ్యక్తినీ అదుపులోకి తీసుకొని విచారించగా తన పేరు లాల్ మహమ్మద్ తండ్రి అబ్దుల్ గని వయసు 21 సంవత్సరాలు, వృతి కూలి, నివాసం రాస్న%శీ% గ్రామము యాలాల మండలం అని తెలిపారు. అతని వద్ద ఉన్న హ్యాండ్ బ్యాగ్ తనిఖీ చేయగా అందులో 1.2 కిలోల ఎండు గంజాయి లభ్యమైందన్నారు. వెంటనే అతన్ని పోలీసు స్టేషన్ తరలించి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచామని తెలిపారు. నిందితుడి నుండి సుమారు 30,000 రూపాయల విలువ గల 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్న పోలీస్ అధికారులకు సమాచారం అందజేయాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ అంజాద్, శివ కుమార్, కానిస్టేబుల్స్ సాయప్ప, షబ్బీర్ తదితరులు ఉన్నారు.

# త్వరగా బ్రిడ్జీ పనులను పూర్తి చేయాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సివల్ సెక్రటరీ శ్రీధర్
- చిన్నమంగళారం బ్రిడ్జీని పరిశీలించిన అధికారులు



**మొయినాబాద్, జూన్ 27 (జనం సాక్షి) :** మొయినాబాద్- శంకర్ పల్లి మండలాలను కలుపుతూ చిన్నమంగళారం సమీపంలో ఈసీ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జీ పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సివల్ సెక్రటరీ శ్రీధర్ అన్నారు. శుక్రవారం చిన్నమంగళారం సమీపంలో మూసీవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జీ పనులను అధికారులతో సందర్శించి పరిశీలించారు. మూసీ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు సీఆర్ఆర్ నిధులు మొదట ఐదు కోట్లు మంజూరు కాగా అనంతరం అడిషనల్గా రెండు కోట్లు మంజూరైయ్యాయి. మొత్తం ఏడు కోట్లతో ఈ బ్రిడ్జీ పనులు దాదాపు 85 శాతం పూర్తి కావస్తున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ అధికారులతో బ్రిడ్జీ నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జీ పూర్తి అయినప్పటికి అటూ మహరాజ్ పేట్, చిన్నమంగళారం వైపు రెండు వైపుల రోడ్లను మూడు నెలల్లో పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. ఈ బ్రిడ్జీ నిర్మాణంతో ఎంతో మందికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఇన్ ఛీఫ్ కనకరత్నం, ఎస్సీ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ శ్రీరాములు, చేవెళ్ల డిప్యూటీ లీలాగణేష్, మొయినాబాద్ డిప్యూటీ విజయ్ కుమార్, ఏఈ ప్రభాకర్, చిన్నమంగళారం మాజీ సర్పంచ్ సుకన్యహరిశంకర్ గౌడ్, గ్రామస్తులు విష్ణు గౌడ్, అంజనేయులు గౌడ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# వంద పడకల ఆసుపత్రి స్థలం అప్పగింత

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతికి స్పందించిన నూతన కలెక్టర్ మను చౌదరి

**కూకట్‌పల్లి, జూన్ 27 (జనంసాక్షి) :** కేపీహెచ్‌బీ కాలనీలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ఎట్టకేలకు ఆరోగ్య శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం నుంచి హౌసింగ్ బోర్డు పరిధిలోని ఆసుపత్రి స్థలాల్ని స్వాధీనం చేసుకోవాలని, ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని స్థానిక కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పలుమార్లు ఆరోగ్య శాఖ అధికారులను, జిల్లా కలెక్టర్ ను కలిసి విన్నవించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మను చౌదరిని గత గురువారం కూకట్పల్లి నియోజకవర్గం కార్పొరేటర్లతో మాధవరం కృష్ణారావు కలిశారు. నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. హౌసింగ్ బోర్డుకు చెందిన ఒక ఎకరం 17 గుంటల విలువైన స్థలాన్ని వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించినప్పటికీ ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, కనీసం స్థలాన్ని స్వాధీనం కూడా చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం మల్కాజ్గిరి ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ తో పాటు పలువురు అధికారులు వచ్చి ఆసుపత్రికి కేటాయించిన స్థలాల్ని స్వాధీనం చేసుకున్నట్లు హౌసింగ్ బోర్డు వెస్ట్రన్ డివిజన్ ఈ ఈ కిరణ్ బాబు తెలిపారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం కృషి చేయడమే కాకుండా స్థలాన్ని స్వాధీనం చేసే విషయంలో చొరవ తీసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ను హౌసింగ్ బోర్డు వాసులు అభినందించారు. త్వరలోనే ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకొనున్నారు. ఆసుపత్రి స్థలం స్వాధీనం విషయంలో అడిగిన వెంటనే స్పందించి వారం రోజుల్లోనే స్థలాల్ని స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకున్న కలెక్టర్ మను చౌదరికీ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.



# అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి




**శామీర్‌పేట్, జూన్ 27 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ఉద్దెమర్రి మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేష్ అన్నారు. ఉద్దెమర్రిలో అర్హులైన నిరుపేదల కుటుంబాలకు అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయ్యాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్దెమర్రి గ్రామానికి మొదటి విడతలో 22 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని ఆ ఇండ్లకు ముగ్గులు పోసి నిర్మాణం పనులు చేపట్టారని తెలిపారు. గ్రామంలో అదనంగా మరో 82మంది ఇండ్లు లేనివారు ఉన్నా రని వారికి రెండవ విడతలో ఇండ్లు మంజూరు చేయ్యాలని టిపిసిసిని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ పట్ట బాలనర్సిహా, నల్ల ప్రభాకర్ రెడ్డి, పెద్దిరెడ్డి వెంకట్ రెడ్డి, వెంకటగిరి ప్రసాద్, దుర్గం ప్రవీన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

**చేవెళ్ల, జూన్ 27 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. చేవెళ్ల నూతన మున్సిపల్ కమిషనర్ వెంకటేశంను తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలిసి శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ...కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నూతన కమిషనర్ కోరడం జరిగిందన్నారు. కార్మికులకు ఏసమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తామని నూతన కమిషనర్ వెంకటేశం హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, సిఐటియు చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షులు ముంజగళ్ళ ప్రభుదాస్, చేవెళ్ల మున్సిపల్ యూనియన్ నాయకులు నరసింహ, జనార్ధన్, దస్తగిరి, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.




# పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు




**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 27 (జనం సాక్షి) :** పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలె క్టర్ సంచిత్ గంగ్వార్ హెచ్చ రించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్ ఆధ్వర్యంలో ఆపరే షన్ ముస్కాన్-11కి సంబంధించి కన్వర్జెన్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్ లో అదనపు కలెక్టర్ మాట్లా డుతూ పోలీస్ డిపార్ట్మెంట్, జిల్లా బాలల సంరక్షణ విభాగం లేబర్ డిపార్ట్మెం ట్ ,ఎడ్యుకేషనల్ డిపార్ట్మెం ట్,మెడికల్ డిపార్ట్మెంట్, బాలల సంక్షేమ సమితి మొదలైన లైన్ డిపార్ట్మెంట్స్ తో చైల్డ్ అండ్ అడాలసెంట్ లేబర్ రెస్క్యూ ప్రోగ్రాంలో బాగంగా జూలై 1-2025 నుండి జూలై 31-2025 వరకు స్పెషల్ డ్రైవ్ లో ఎవరెవరు ఎలాంటి బాధ్యతలు నిర్వర్తించాలి అనే విషయాలపైన సంబంధిత డిపార్ట్మెంట్స్ కి దిశా నిర్దేశం చేశారు. అలాగే నెల స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం కి సంబంధించి యాక్షన్ ప్లాన్ ను తయారు చేయవలసిందిగా అలాగే పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కన్వర్జెన్స్ మీటింగ్‌లో డి.ఎస్.పి లింగయ్య, డిసిఆర్‌బి, లేబర్ ఆఫీసర్ మహేష్ కుమార్, మెడికల్ డిపార్ట్మెంట్ సిబ్బంది, బాలల సంక్షేమ సమితి మెంబర్ రాద మేడం, జిల్లా బాలల సంరక్షణ విభాగ సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది మరియు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠశాల, హెల్త్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 27 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, అర్బన్ హెల్త్ సెంటర్ ను శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9:15 గంటలకు కలెక్టర్ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లి ప్రార్థన లో పాల్గొన్నారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. నిర్ణీత సమయానికి ఎంత మంది ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చారని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గల అర్బన్ హెల్త్ సెంటర్ ను తనిఖీ చేశారు. హెల్త్ సెంటర్ లో మొత్తం ఎంతమంది వైద్య సిబ్బంది పనిచేస్తున్నారని..? ప్రస్తుతం ఎంతమంది ఉన్నారని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్‌ను చూసి ఇద్దరు మెడికల్ ఆఫీసర్లతోపాటు మరో ఐదుగురు స్టాఫ్ రాలేదని నిర్ధారించారు.

# పెన్షన్ల అమలును మరింత సమర్ధవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, జూన్ 27 (జనం సాక్షి) :** పెన్షన్‌లు ప్రజలకు సామాజిక భద్రత కలిగిస్తాయన్న దృష్టితో,వాటి అమలును మరింత సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశం హాల్ లో చేయూత పథకంపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రత పెన్షన్ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన పెన్షన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రజావాణిలో పెన్షన్‌పై ఎక్కువ ఫిర్యాదులు రావడంతో, ఈ అంశంపై పూర్తిగా దృష్టి సారించి అన్ని సమస్యలు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో కనీసం 20 అర్హులైన కుటుంబాలను గుర్తించి,వారికి నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించాచేల చర్యలు తీసుకోవాలని అన్నారు. చనిపోయిన పింఛనుదారుల వివరాలు సేకరిస్తే వారి స్థానంలో కుటుంబ సభ్యులలో అర్హులైన వారికి పెన్షన్ మంజూరుపై పరిశీలన జరిపి ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైనదని, ప్రతి పథకంలో వారి భాగస్వామ్యం చాలా అవసరమని అన్నారు.



### ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతంగా చేపట్టాలి

ఇందిరమ్మ ఇండ్లు మార్క్ అవుట్ నుంచి బేస్‌మెంట్ వరకు ప్రతి దశను వేగవంతంగా, నాణ్యంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని, ప్రతి మంగళవారం చీఫ్ సెక్రటరీ ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పురోగతిలో గత వారం జిల్లా స్థానం 30వ స్థానంలో ఉండగా, ప్రస్తుతం 15వ స్థానానికి చేరుకోవడం సంతోషకరమని అన్నారు. ఈ దశలో మంచి పురోగతి సాధించిన అధికారులను కలెక్టర్ అభినందించారు. ఇక ముందు కూడా సమన్వయంతో పనిచేస్తూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,రాష్ట్ర సెర్ప్ కార్యాలయ సోషల్ సెక్యూరిటీ పెన్షన్ల పంపిణీ సంచాలకులు గోపాలరావు, డిపిఓ నాగేంద్రం, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
28 జూన్ 2025

# ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యాన్ని కాలరాశాయి

- మాజీ శాసనమండలి సభ్యులు ఎన్.రామచంద్ర రావు



**వనపర్తి బ్యూరో, జూన్ 27 (జనంసాక్షి) :** భారతదేశంలో 1975 ఇందిరా గాంధీ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితిలో ప్రజాస్వామ్యాన్ని కాలరాశారని, మాజీ శాసనమండలి సభ్యులు ఎన్.రామచంద్ర రావు విమర్శించారు. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అధ్యక్షతన ఎమర్జెన్సీ వ్యతిరేక దినంను వనపర్తి జిల్లా కేంద్రంలో శ్రీలక్ష్మి కృష్ణ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనమండలి సభ్యులు ఎన్.రామచంద్ర రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ రోజుల్లో వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్లిన వ్యక్తులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్, అనంతప్ప, లక్ష్మన్‌ని సన్మానించారు. ఈ సందర్భంగా రామచంద్ర రావు మాట్లాడుతూ ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం అనేది భారతదేశంలో ప్రతి సంవత్సరం జూన్ 25, 1975లో ఇందిరా గాంధీ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితిని వ్యతిరేకిస్తూ ఈ రోజును జరుపుకుంటారని, ఆ సమయంలో ప్రజాస్వామ్య హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛలను కాలరాశారని, దానిని వ్యతిరేకిస్తూ నేటికీ 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు. 1975 జూన్ 25 నుండి 1977 మార్చి వరకు దాదాపుగా 21 నెలలు అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో అత్యవసర పరిస్థితిని విధించారని, ఈ సమయంలో, పౌరుల ప్రాథమిక హక్కులను, స్వేచ్ఛలను ప్రభుత్వం హరించివేసిందన్నారు. ప్రజాస్వామ్యం,భావ ప్రకటన స్వేచ్ఛ యొక్క ప్రాముఖ్యతను, ఎమర్జెన్సీ సమయంలో జరిగిన అక్రమాలను, అణచివేతలను ఈ సందర్భంగా ప్రజలకు గుర్తు చేస్తూ, ప్రజాస్వామ్యం, భావ ప్రకటన స్వేచ్ఛల ప్రాముఖ్యతను నొక్కి చెబుతాయని, ఎమెర్జెన్సీ సమయంలో నియంత ఇందిరాగాంధీ తన ప్రత్యర్థులను జైలు పాలు చేయడంతోపాటు ప్రజాస్వామ్య హక్కులను హరించి వేసిందన్నారు. రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు హరించివేయబడ్డాయని, ప్రచార, ప్రసార మాధ్యమాలపై ఆంక్షలు అమలయ్యాయని, పత్రికలపై ముందస్తు సెన్సార్ షిప్ ప్రవేశపెట్టారు. ఏ వార్త అయినా సంబంధిత ప్రభుత్వ అధికారి ఆమోదిస్తే తప్ప ప్రచురణకు నోచుకోని పరిస్థితి నెలకొంది. ఆర్ఎస్ఎస్‌తో సహా అనేక సంస్థలను నిషేధించారని గుర్తు చేశారు. క్రమశిక్షణ పేరుతో ప్రభుత్వ ఉద్యోగులపై ఆంక్షలు, నిఘా మొదలైందని,నియంత ఇందిరాగాంధీ, ఆమె పాలనకు వ్యతిరేకంగా ఏ చిన్న వ్యాఖ్య చేసినా అరెస్ట్ చేసి జైలులో పెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇందిర కుమారుడు సంజయ్ గాంధీ పెత్తనం నడిచి,నిర్బంధ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిగాయని, రహదారుల విస్తరణ పేరుతో ముందస్తు నోటీసులు లేకుండా ఇళ్లను కూల్చివేశారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నారాయణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సబి రెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి బి శ్రీశైలం, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర మహిళ జాయింట్ ట్రెజరర్ జ్యోతి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు ఏ సీతారాములు, బండారు కుమారస్వామి, రామన్న గారి వెంకటేశ్వర రెడ్డి, సుమిత్రమా చిత్తారి ప్రభాకర్ గోపీనాథ్ కదిరే మధు మాది మహిళా జిల్లా అధ్యక్షురాలు వారణాసి కల్పన పట్టణ అలివేలమ్మ సూగురు లక్ష్మి కవిత పట్టణ అధ్యక్షులు ఏ రాజశేఖర్ గౌడ్ ప్రధాన కార్యదర్శులు దంతోజు నవీన్ చారి నల్లవోతుల అరవింద్, వనపర్తి నియోజకవర్గం వివిధ మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, జిల్లా రాష్ట్ర నాయకులు కార్యకర్తలు విద్యార్థులు మహిళలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## గద్వాల జిల్లాలో ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**గద్వాల నడిగడ్డ, జూన్ 27 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న సర్వేయర్ తేజేశ్వర్ హత్య, గంగనపల్లిలో మహిళ హత్య.. ఈ కేసులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు గద్వాల జిల్లాలో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గద్వాల పట్టణంలో హత్యకు గురైన తేజేశ్వర్ స్వగృహానికి వెళ్లి తేజేశ్వర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరావిమర్శించారు.బాధిత కుటుంబాలకు తక్షణ న్యాయం అందించేందుకు ఈ నేరాలపై విచారణ జాప్యం బాధితులను మరోసారి మనసు దుఃఖింప చేస్తోందని జిల్లాకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందించనున్నట్లు ఆయన తెలియజేశారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసులను బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అభినందించారు.

## పేదోడికి సొంతింటి కలను సహకారం చేసేది కాంగ్రెస్సే..



**శివ్వంపేట, జూన్ 27 (జనంసాక్షి) :** పేదోడికి సొంత ఇంటి కలను సహకారం చేసేది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఆయన మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, శ్రేణులతో కలిసి శుక్రవారం మండల పరిధిలోని పిల్లుట్ల, కొంతాన్ పల్లి గ్రామాల్లో పర్యటించి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికీ స్థానిక పాక్స్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు మాధవరెడ్డి, నవీన్ గుప్తా వేణుగోపాల్ రెడ్డి, కమల పూల్ సింగ్, సొసైటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీవీఆర్ యూత్ సభ్యులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



**వెల్దండ, జూన్ 27 (జనంసాక్షి) :** ప్రతి నెలా రేషన్ బియ్యం ఇచ్చే క్రమంలో దుమ్ము, ధూళితో డీలర్లు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యం బారిన పడుతున్నారని, అనారోగ్యం కారణాలతో మృతి చెందిన రేషన్ డీలర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వెల్దండ మండల అధ్యక్షుడు జంగయ్య కోరారు. ఇటీవల వెల్దండ మండలం పోచమ్మ గడ్డ తాండ రేషన్ డీలర్ గమ్లి భర్త తావుర్యా నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో శుక్రవారం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని రేషన్ డీలర్ గమ్లికి అందజేశారు.కుటుంబ సభ్యులను ఓదార్చారు.రేషన్ డీలర్ గమ్లి భర్త తావుర్యా నాయక్ మృతి చెందడం ఎంతో బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు నరసింహ, బాలరాజు, చంద్రశేఖర్, వెంకటయ్య,జగదీశ్వర్, ఆర్కే గౌడ్, మల్లేష్, గణపతి, శ్రీనివాసులు, గోపాల్, తదితరులు ఉన్నారు.

## కాలేజీల్లో మూత్రశాలలు లేకపోవడం సిగ్గుచేటు

**వనపర్తి, జూన్ 27 (జనంసాక్షి) :** ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడం సిగ్గుచేటని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీని ఐద్వా నేతలు సందర్శించి అందులో గల మౌళిక వసతులను పరిశీలించారు. పలువురు విద్యార్థినులు తమ సమస్యలను నేతలకు తెలియజేశారు. కాలేజీలో సుమారు 650 మంది విద్యార్థినులు ఉన్నా, కేవలం మూడు మూత్రశాలలు మాత్రమే ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని, ఇది విద్యార్థినుల ఆరోగ్యం ,ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని ఐద్వా నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల మాట్లాడుతూ ఒక్కో విద్యార్థిని ప్రాథమిక హక్కులు కలిగి ఉండాలి. కానీ ఇక్కడ కాలేజీలో పరిస్థితి చూస్తే ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో స్పష్టంగా తెలుస్తోందని, 650 మందికి కేవలం మూడు మూత్రశాలలు ఉండడం సిగ్గుచేటని, తక్షణమే కొత్త బాత్‌రూములు నిర్మించాలని, విద్యార్థినుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. కాలేజీ లోని ల్యాబ్ బిల్డింగ్ లు పూర్తిగా పాత బడిపోవడం వల్ల గోడల నుంచి పెచ్చులు రాలిపడుతున్నాయని, విద్యార్థులు తరగతుల్లో భయంతో కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా టీచర్లు కాలకృత్యాలు తీర్చుకోవడానికి




రాజీవ్ చౌక్ లో ఉన్న సులబ్ కాంప్లెక్స్ కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని అన్నారు. భవనాలు కళాశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వెంటనే మరమ్మత్తులు చేపట్టకపోతే ఇది విద్యార్థుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా శాఖ, ఇంటర్మీడియట్ బోర్డు, జిల్లా కలెక్టర్ తక్షణంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. తగిన చర్యలు తీసుకోకపోతే ఐద్వా ఆధ్వర్యంలో బాలికల భద్రత మరియు హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సాయిలీల హెచ్చరించారు. ఈ పరిశీలనలో ఐద్వా నాయకులు, కోశాధికారి కవిత, సహాయ కార్యదర్శి రేణుక, కమిటీ సభ్యురాలు శ్యామల కార్యకర్తలు, విద్యార్థినులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## పంచాయతీకి 5000 మొక్కలు నాటాలి



**చిలప్‌చేడ్, జూన్ 27 (జనంసాక్షి) :** మండలంలోని సోమక్కపేట గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న ఉపాధి హామీ పంట పొలాల కాలువల పనులను పరిశీలించిన డిఆర్డివో శ్రీనివాస్ అనంతరం జగ్గంపేట గ్రామంలో నిర్మిస్తున్నటువంటి పౌల్ట్రీ షెడ్ లను పరిశీలన చేసి అధికారులకు పలు సూచనలు చేసినారు. రైతులు ఇంకా ఎవరైనా పౌల్ట్రీ షెడ్లను నిర్మించుకునే వారు ఉంటే నిర్మించుకోవాలని రైతులు పౌల్ట్రీ షెడ్యూల్ నిర్మిస్తున్నటువంటి వాటికి త్వరగా బిల్లులు చెల్లించే విధంగా ప్రయత్నించాలని అధికారులకు సూచించారు. అలాగే ఉపాధి హామీ పనుల గురించి ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించారు. అనంతరం అంతారం,జగ్గంపేట, రహీం గూడా,తండాలను సందర్శించినారు అనంతరం మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధి హామీలు జరుగుతున్నటువంటి పాలను అడిగి తెలుసుకున్నారు గ్రామాలలో ఎవరైనా రైతులు పౌల్ట్రీ షెడ్యూల్ నిర్మించుకునే వారిని గుర్తించి వారికి త్వరగా నిర్మించుకునేందుకు సహకరించాలని పనులు చేపట్టినటువంటి వాటికి త్వరగా బిల్లులు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు అలాగే ఐకెపి మహిళా సమైక్య సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో వనమహోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీకి 5000 మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేసినారు ఈ కార్యక్రమంలో డిఎల్పివో సాయిబాబా, ఎంపీడీవో ఆనంద్,ఎంపివో తిరుపతి, ఏపివో శ్యామ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించిన రాష్ట్ర మంత్రులు

- త్వరితగతిన పనులు కంప్లీట్ చేయాలి
- ఆగస్టు నెల మొదటి వారంలో ఫ్యాక్టరీ ప్రారంభం కావాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే పూర్తిస్థాయిలో ఫ్యాక్టరీ నిర్మాణం

**నంగునూరు, జూన్ 27 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం లోని నర్మట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని శుక్రవారం రోజు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ మంత్రులు అధికారులతో కలిసి నిర్మాణంలో ఉన్న ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయిల్ ఫెడ్, ఏజెన్సీ అధికారులతో పనుల పురోగతిపై అరా తీసి ఆగస్టు మొదటి వారం లోపల పూర్తిస్థాయిలో పనులు కంప్లీట్ కావాలని అన్నారు. అనంతరం



ఫ్యాక్టరీ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ నర్మేట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే నిర్మాణం చేయడం జరిగిందని, బిఆర్ఎస్ ఆయంలో ఫ్యాక్టరీకి కావలసిన ల్యాండ్ మాత్రమే సెలెక్ట్ చేశారని అన్నారు. తెలంగాణలోనే నర్మట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ అన్ని వసతులతో రిఫైనరీ, ప్యాకింగ్ యూనిట్, కూడా ఫ్యాక్టరీలో ఉంటాయన్నారు. దేశంలోని బిజెపి ప్రభుత్వం పామ్ ఆయిల్ రైతుల నడ్డివిరుస్తుందని, మనదేశంలో ప్రతి ఏడాదికి లక్ష కోట్ల ఆయిల్ దిగుమతి చేసుకుంటుందని దిగుమతి సుంకం 27 శాతం నుంచి 17 శాతం కు తగ్గడం వల్ల ఆయిల్ ఫామ్ రేటు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు రాబోయే రోజుల్లో ప్రతి 31 జిల్లాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతుందని ఫ్యాక్టరీలు నిర్మాణం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్లు గరీమ అగర్వాల్, అబ్దుల్ హమీద్, జిల్లా అగ్రికల్చర్ హార్టికల్చర్ అధికారులు, ఎమ్మార్వో సరిత, కాంగ్రెస్ నాయకులు దేవులపల్లి యాదగిరి, రంగ అశోక్ గౌడ్, మండలం కాంగ్రెస్ నాయకులు, ఆయిల్ ఫెడ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత పోరాడాలి



**శివ్వంపేట, జూన్ 27 (జనంసాక్షి) :** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుకు వచ్చి పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామ శివారులో గల గ్లాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుకు వచ్చి ఉద్యమించాలని, నేటి యువత రేపటి భావి భారత పౌరులని, కొంతమంది డ్రగ్స్ కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందని దీనిని మొదలే గుర్తించి, దీని వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకొని యువత వాటికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. డ్రగ్స్ తో పాటు చెడు అలవాట్లను సైతం దూరంగా ఉండాలని, చెడు అలవాటుల వల్ల ఆలోచన శక్తి నశిస్తాయని, విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం క్రమశిక్షణ చాలా కీలకమన్నారు. ఆ తర్వాత కళాశాల ప్రిన్సిపల్ శివ సుబ్రహ్మణ్యం కార్యక్రమ ముఖ్య నిర్వాహకులు, విభాగ అధిపతి డాక్టర్ కల్లూరి సతీష్ కుమార్ విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. ప్రస్తుత యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత సమాజానికి ఎల్లప్పుడూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శివంపేట ప్యాక్స్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, మాధవరెడ్డి, కమల పూల్ సింగ్, కళాశాల ఏవో ఆనంద్, కాంగ్రెస్ నాయకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం..

- ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా..
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతుల భయాందోళనలు

**న్యాల్‌కల్, జూన్ 27 (జనం సాక్షి) :** పక్షం రోజుల క్రితం కురిసిన వర్షానికి అతి భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు తోడవడంతో విద్యుత్ స్తంభం, ఈగలు నేరుగా ట్రాన్స్ ఫార్మర్‌పై పడడంతో మంటలు ఏర్పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెను ప్రమాదకరంగా మారింది. విద్యుత్ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్న ఫలితం లేకపోవడంతో రైతులు పక్షం రోజులుగా తీవ్ర భయాందోళనకు గురవుతున్న ఘటన సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, రాఘవపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. లో వోల్టేజీ, తరచుగా విద్యుత్ స్థిరపరా నిలిచిపోవడం వంటి కారణాలతో గ్రామానికి చెందిన పలువురు రైతులు వారి సొంత డబ్బులను వెచ్చించి దాదాపు 30 ఎకరాల పత్తి, 10 ఎకరాల చెరుకు, ఇతర పంటలను సాగు చేసుకునేందుకు గతంలో ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేసుకున్నారు. గత పక్షం రోజుల క్రితం కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులతో విద్యుత్ స్తంభం, విద్యుత్తు తీగలు ట్రాన్స్ ఫార్మర్ పై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



గత పక్షం రోజులకు పైగా వర్షం కురువక పోవడంతో ప్రధానంగా పత్తి, చెరకు పంటలకు నీరు అందించలేని పరిస్థితి నెలకొంది. పంట పొలాలకు కూత వేటు దూరంలో మంజీరా నదిలో పుష్కలంగా నీరున్నప్పటికిని విద్యుత్ సరఫరా లేకపోవడంతో తుం పర, కాలువలు, పైపుల ద్వారా పంటలకు నీటిని అందించలేని పరిస్థితి నెలకొందని అధిక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించిన దృష్టి సారించడం లేదని బాధిత రైతులు శ్రీనివాస్ రెడ్డి, సంగప్ప, శ్రీనివాస్, బస్వంత్, కట్టప్ప, కిష్టయ్య, సంగయ్య, తదితర రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రూ:16 వేలు చెల్లిస్తేనే పెను ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, తీగలకు మరమ్మత్తులు చేపడతామని స్థానిక విద్యుత్ అధికారి పదేపదే డిమాండ్ చేస్తున్నాడని బాధిత రైతులు వాపోయారు. విద్యుత్ ఉన్నతాధికారులు దృష్టి సాధించి వెంటనే మరమ్మత్తులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

### అతి త్వరలో మరమ్మత్తులు చేపడతాం

వర్షం, ఈదురు గాలుల కారణంగా విద్యుత్ స్తంభం, తీగలు ఓ ట్రాన్స్ ఫార్మర్ పై ఒరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెను ప్రమాదకరంగా మారింది. ఈ సమస్య ఈ పాటికే విద్యుత్ అధికారులకు సమాచారం అందింది. విద్యుత్ శాఖ నిధులతోనే త్వరితగతిన మరమ్మతులు చేపడతాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దృష్టి సారిస్తాం.

**అర్జున్, మండల విద్యుత్ అధికారి**

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తాం

- ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**కాటారం, జూన్ 27 (జనంసాక్షి) :** ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తామని రాష్ట్ర, ఐటీ పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం కాటారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభించారు. సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల ప్రాథమిక పాఠశాలలకు సిఎస్ఆర్ నిధుల ద్వారా విద్యార్థుల కోసం 600 డ్యూయల్ డెస్క్ బెంచీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలకు కావలసిన అవసరాలు గురించి మంత్రి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తయారు చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా రెండు జతల బట్టలు, పుస్తకాలు, అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెంచేందుకు మొట్టమొదటి సారిగా కాటారం మండలం నుండి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను, ఉపాధ్యాయులను సంక్రాంతి, దసరా సెలవుల్లో హైదరాబాద్, ఢిల్లీ లాంటి నగరాలకు తీసుకువెళ్ళే కార్యక్రమం చేపడతామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలను తలదన్నేలా విద్యార్థులు విద్యను అభ్యసించాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క విద్యార్థి ఇంగ్లీషులో మాట్లాడాలని చక్కగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. జిల్లా, మండల స్థాయివిద్యా శాఖ అధికారులు ప్రతి పాఠశాలను పరిశీలించాలని ఆదేశించారు. పాఠశాలలకు కావలసిన సౌకర్యాలు, అవసరాలు గురించి తెలుసుకొని నివేదికలు అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అధునాతంగా తీర్చి దిద్దడానికి సహకరించాలని ఆదేశించారు. కాటారాం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల అధ్యాపకులు కోరిన విధంగా ప్రహరీ గోడ పునర్నిర్మాణం, సైన్స్ ల్యాబ్ కెమికల్స్ ను అందిస్తామని అన్నారు. లైబ్రరీ లో పుస్తకాలు, బెంచీలు, కంప్యూటర్ లను సమకురుస్తామని మంత్రి తెలిపారు. హై స్కూల్ లలో కూడా డ్యూయల్ డెస్క్ బెంచీలు అందించడానికి విద్యాశాఖ అధికారులు నివేదిక ఇవ్వాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలు చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం కాటారం మండల కేంద్రం లో అయ్యప్ప ఆలయ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మండల సంస్థాగత ఎన్నికల సన్నాహాక సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా డీసీసీ అధ్యక్షులు, ట్రేడ్ ప్రమోషన్ కమిషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామి రెడ్డి, జిల్లా పరిశీలకులు లింగాజిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాటారం మండలనికి చెందిన మండల అధ్యక్షుల గ్రామ శాఖ అధ్యక్షుల మరియు నామినేటెడ్ పదవుల ఆశావాహుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వేమునూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమయ్య, బెల్లంకొండ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు



## కార్మికుడి సంక్షేమం ప్రభుత్వ ప్రధాన బాధ్యత

- మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి

**చెన్నూర్, జూన్ 27 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కార్మిక శాఖ విస్తృత స్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల సంక్షేమం, భద్రత,హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా ఆన్ ఆర్గనైజ్డ్ వర్కర్స్, కాంటాక్ట్ కార్మికులు, గనుల కార్మికుల జీవన ప్రమాణాలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి కార్మికుడి సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత వారి హక్కులు,భద్రత కోసం సమగ్ర చర్యలు చేపట్టాలని ఆయా శాఖల మధ్య సమన్వయం తో త్వరితగతిన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల కార్యదర్శులు ప్రిన్సిపాల్ లేబర్ కమిషనర్ ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాల, బోధనా ఆస్పత్రి, ఎంసిహెచ్‌లను సందర్శించిన ఎంసీఏంసి బృందం



**నిర్మల్ రూరల్, జూన్ 27 (జనం సాక్షి) :** ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాలు తదితర వాటిని పరిష్కరించడానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ వైద్య కళాశాల మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వం నియమించిన పర్యవేక్షణ కమిటీ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల, జిల్లా ప్రధానఆస్పత్రి,మాత శిశు సంరక్షణ ఆస్పత్రులను శుక్రవారం ఎంసీఎంసీ బృందం పరిశీలించారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ ఆయేషా మషరత్ ఖానం,రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్ నేతృత్వంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఓరుగంటి శ్రీనివాస్,ఎంసీఏంసి సభ్యులు వైద్య కళాశాల తో పాటు బోధన ఆసుపత్రి,ఎం సి హెచ్ ఆస్పత్రులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులు,బ్లడ్ బ్యాంక్, ఐసీయూ, విద్యార్థుల తరగతి గదులు,ల్యాబ్ లు హాస్టల్ గదులను పరిశీలించారు. వివిధ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని వారు తెలిపారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటుతోపాటు విద్యార్థులకు రవాణా కోసం బస్సు ఏర్పాటు,బోధనా ఆస్పత్రి, వైద్య కళాశాలలో భద్రత చర్యలు చేపట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. అనంతరం కళాశాల నిర్వహణ తీరు, తదితర విషయాలపై ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ఉప ప్రిన్సిపల్ డాక్టర్ మనోజ్ కుమార్,ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ గోపాల్ సింగ్,అదనపు సూపరింటెంట్ డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ విశ్వనాథ్,ప్రసూతి ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ సరోజ,ఆర్ఎంఓ డాక్టర్ సమత,వైద్యులు డాక్టర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలి



**భూపాలపల్లి, జూన్ 27 (జనం సాక్షి):** భూపాలపల్లి ఏరియా సింగరేణి లో ఆర్జి రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ మధుసూదన్ భూపాలపల్లి ఏరియాకు మొదటిసారిగా పర్యటించి సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి వారికి శాలువా కప్పి మొక్కను బహుకరించారు. అనంతరం జిఎం తో కలిసి కేటీకే ఓసి 2, ఓసి 3ను సందర్శించారు. మొదటగా వ్యూ పాయింట్ వద్దకు చేరుకొని ఉపరితల గని ప్లాన్ లను పరిశీలించి ఉపరితల గనులలో జరుగుతున్న పని విధానాలను స్థితి గతులను యంత్రాల పని తీరును పరిశీలించారు. భూపాలపల్లి ఏరియాలో సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి తగు ప్రణాళికలు సిద్ధం చేసుకొని రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి ఎస్ఓపిని తప్పక పాటించాలని ఉద్యోగులందరు రక్షణ తో కూడిన సమిష్టిగా కృషి చేసి ఉత్పత్తి శాతాన్ని పెంచి కంపెనీ మనుగడకు తోడ్పడాలని అన్నారు. రాబోయే వర్షాకాల వాతావరణానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తికి గానీ రవాణాకు గానీ ఎటువంటి ఆటంకం కలుగకుండా ముందస్తు ప్రణాళికలు ఇప్పటి నుండే సిద్ధం చేసుకొని ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం కవీంద్ర, ఏరియా సేఫ్టీ అధికారి ప్రసాద్, ఓసి–2 పిఓ శ్యాంసుంధర్, మేనేజర్ రమాకాంత్, ప్రాజెక్ట్ ఇంజనీర్ క్రిష్ణయ్య, ఓసి–3 పిఓ భిక్షమయ్య, మేనేజర్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రాజరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## మంచినీటి కోసం మహిళల రాస్తారోకో

- సమస్యకు తక్షణమే పరిష్కారం : ఎంపీడీవో కోట ప్రసాద్



**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 27 (జనం సాక్షి) :** మంచినీటి కోసం మహిళలు రోడ్డు ఎక్కారు. ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని బట్టుపల్లి గ్రామంలో మహిళలు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి మంచినీరు రప్పించాలని డిమాండ్ చేశారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన కాగజ్నగర్ మండల ఎంపీడీవో కోట ప్రసాద్ అక్కడికి చేరుకున్నారు. ఎంపీడీవోతోపాటు మిషన్ భగీరథ డి ఈ ( గ్రిడ్) పృథ్వీరాజ్, ఏఈ రవీందర్లు సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కోట ప్రసాద్ వెంటనే గ్రామంలో గల మిషన్ భగీరథ ప్రధానపైప్లైన్ కు చెడిపోయిన వాల్ ను బిగించి మంచి నీటి సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ మంచినీటి నిలిచిపోయి కేవలం 2 రోజులు మాత్రమే అయిందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని, మహిళలకు ఎంపీడీవో తెలిపినప్పటికీ.. వారు వినలేదని వివరించారు. దీంతో వెంటనే ఆదిలాబాద్ నుండి కొత్త వాల్ ను తెప్పించి, మరమ్మతు చేయించినట్లు వివరించారు.



## దశాబ్దాల సింగరేణి సూపర్ బజార్ కనుమరుగు

- ముల్లె మూట సర్దిన నిర్వాహకులు

**రామకృష్ణాపూర్, జూన్ 27 (జనంసాక్షి) :** మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సింగరేణి సూపర్ బజార్ కార్మికులకు నాలుగున్నర దశాబ్దాల కాలంగా అందించిన సేవలు నేటితో కనుమరుగైంది. ఉన్న సామానుతో ముల్లె మూట కట్టి సర్దుకు పోయారు సూపర్ బజార్ నిర్వాహకులు. రామకృష్ణాపూర్ లో ఉన్న బొగ్గు గనులు, ఉపరితల గని మూతపడటంతో కార్మికుల సంఖ్య తగ్గిన కారణంగానే సూపర్ బజార్ మూతపడినట్లు తెలుస్తోంది. ఉన్న కార్మికులు మంచిర్యాలలో ఉన్న మార్ట్ లను ఆశ్రయిస్తున్నారని, ఉన్న కొద్ది మందిలో కార్మికులు విధులకు హాజరు కాని కార్మికులే కిరాణా సామాను విక్రయిస్తే బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో, ఉన్నటువంటి సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంటుందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల రెండు లక్షల రూపాయల నష్టంతో నిర్వహణ జరపలేమని, కార్మికులు అధిక సంఖ్యలో లేకపోవడంతో ఈ ప్రాంతంలోని సూపర్ బజార్ ను మందమర్రిలో విలీనం చేస్తామని కార్మికులు సహకరించాలని సంబంధిత అధికారులు కోరారు.

## అమిత్ షా సభాస్థలిని పరిశీలించిన బీజేఎల్పీ నేత



**నిర్మల్ రూరల్, జూన్ 27 (జనంసాక్షి) :** కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా శనివారం నిజామాబాద్ పర్యట నకు వస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నటువంటి బహిరంగ సభ స్థలాన్ని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి,నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, నిజామాబాద్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కేంద్ర మంత్రి అమిత్ షా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు మహేశ్వర్ రెడ్డి తెలిపారు. నిర్వహిస్తున్నటువంటి బహిరంగ సభకు బిజెపి నాయకులతో పాటు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు

## పీఎంఎఫ్ఎంఈ పథకాన్ని వినియోగించుకోవాలి

- రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ మేనేజర్ నవీన్ కుమార్



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 27 (జనం సాక్షి) :** ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పథకం (పీఎంఎఫ్ఎంఈ) ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలని పిఎమ్ఎఫ్ఎంఈ రాష్ట్ర మేనేజర్ నవీన్ కుమార్ కోరారు. శుక్రవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ పథకం కింద మహిళలకు 35 శాతం సబ్సిడీతో రు.10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. దీంతో మహిళలు వ్యాపార పరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ జాడి మోతిరా, రిసోర్స్ పర్సన్లు శివ సాయి ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజన రైతులకు ఉచితంగా వరి విత్తనాల పంపిణీ

- రైతులకు నాసిరెడ్డి సాంబశివరెడ్డి సేవలు మరువలేనివి
- వివేక రైతు సంఘం బలోపేతానికి కృషి చేస్తా : మంత్రి సీతక్క



**మంగపేట జూన్ 27(జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి రైతులకు చేసేటటువంటి సేవలు మరువలేనివని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం మండలంలోని అకినేపల్లి మల్లారం గ్రామంలో వివేకా ఎఫ్పిఒ, వికాస్ అగ్రి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన గిరిజన రైతులకు ఉచిత వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై గిరిజన రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎంత చేసినా స్వచ్ఛంద సంస్థలు కూడా రైతు ఉత్పత్తిదారుల సహకారం అందించాలని ఇలా చేయడం సమాజానికి కూడా ఎంతో అవసరమని సీతక్క అన్నారు. గత దశాబ్ద కాలంగా వ్యవసాయ రంగంలో విశేష సేవలు చేస్తున్న నాసిరెడ్డి సాంబశివరెడ్డి, పచ్చిపులుసు నరేష్ లను సేవలను మంత్రి కొనియాడారు. అలాగే నాసిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి గ్రామంలో వైకుంఠధామం నిర్మాణానికి సుమారు 20 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించగా మంత్రి సీతక్క శాలువాతో వారిని ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి మాట్లాడుతూ ములుగు జిల్లాలో ఐదు వందల మంది గిరిజన రైతులకు వెయ్యి ఎకరాలకు విత్తన కిట్లులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోతు రవి చందర్ లతో మండలంలోని తిమ్మాపురం, తక్కెళ్ళగూడెం కేశవాపూర్ గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు విత్తన కిట్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి సీతక్క గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు అకినపల్లి మల్లారం గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, పశువుల ఆసుపత్రి అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, గ్రామంలో సిమెంటు రోడ్లు, పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 27 (జనంసాక్షి) :** ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలలో అన్ని రకాల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి మండల కేంద్రంలో గల ఆశ్రమ పాఠశాలను మండల తహశీల్దార్ సంధ్యారాణి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమారస్వామి లతో కలిసి సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలు, ఆహారం వివరాలు తెలుసుకున్నారు. తహశీల్దార్, మండల పరిషత్ అభిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, వివిధ రకాల ధృవపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా నిబంధనల ప్రకారం పరిశీలించి జారీ చేయాలని తెలిపారు. మండల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రజలకు నిరంతరంగా త్రాగునీటిని అందించాలని, పారిశుధ్య పనులు పకడ్బంధీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వినోద్

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ కలిసి నీల్వాయి గ్రామంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో 66 లక్షల రూపాయల సమగ్ర శిక్ష అంచనా నిధులతో అదనపు వసతి గృహ గదులు, మరమ్మత్తు పనులకు శంఖుస్థాపన చేసి నూతనంగా ఇంటర్మీడియట్ తరగతుల నిర్వహణను ప్రారంభించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. 2047 రైజింగ్ తెలంగాణలో ఇప్పుడున్న విద్యార్థులు ప్రయోజకులై ఉద్యోగంలో, వ్యాపారంలో ఎదిగి సమాజంలో ఉన్నత స్థాయిలో నిలుస్తారని, జిల్లాతో పాటు రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో ఉంటుందని ఆకాంక్షించారు. సదుపాయాలు, కుటుంబం, సమాజ సంబంధిత ఏ సమస్యలు ఉన్నా తెలియజేయవచ్చని పరిష్కరించేందుకు కృషి చేస్తామ తెలిపారు. 1 సంవత్సరం నుండి దాదాపు 150 కోట్ల రూపాయల నిధులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ క్రింద అభివృద్ధి చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో 2 కోట్ల 48 లక్షల రూపాయల రాష్ట్ర విద్యుత్ అభివృద్ధి నిధులతో నిర్మించిన 33/11 విద్యుత్ ఉప కేంద్రాన్ని బెల్లంపల్లి శాసనసభ్యులతో కలిసి ప్రారంభించారు. ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా నాణ్యమైన విద్యుత్ను అందించేందుకు విద్యుత్ ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆనాటి ప్రజల జీవన శైలిని కనబరిచేవే పాండవుల గుట్టలు

- జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట డైరెక్టర్ డా. ఎస్ మంజు
- పాండవుల గుట్ట జియోటూరిజం సైట్‌లో జియో-హెరిటేజ్ ఇన్ఫర్మేషన్ ప్యానెల్ బోర్డు ప్రారంభం



**రేగొండ, జూన్ 27 (జనంసాక్షి):** మండలంలోని పాండవుల గుట్టలను శుక్రవారం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు పరిశీలించారు.గుట్ట రాళ్ల నిర్మాణాల భౌగోళిక ప్రాముఖ్యత, వయస్సు,పురాతన శిలా చిత్రాలు వంటి అంశాలను హైలైట్ చేస్తూ ఏర్పాటు చేసిన సమాచారం ప్యానెల్ బోర్డును నేడు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జి ఎస్ ఐ), తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ డా. మంజు ఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదేశానికి భౌగోళిక ప్రాముఖ్యత ఉండటానికి కారణం అనన్యమైన రాళ్ల నిర్మాణాలు, గుహలు, శిలా తావులు ఉండటమే కాక, ఇవి భారతదేశ భౌగోళిక చరిత్రకు వెలుగులిచ్చే విశేషాలను అందించడమే పాండవుల గుట్ట పాఖల్ సూపర్‌గ్రూప్‌లోని ములుగు గ్రూప్‌కు చెందిన జాకారం ఫార్మేషన్ లోని మోటే ధాన్యాల శిలలు కలిగి ఉంది. దీనికి చరిత్రలో విశేష ప్రాధాన్యత ఉందన్నారు.పల్లెటూరి ప్రజల జీవన శైలిని ప్రతిబింబించే ప్యాలియోలిథిక్ శిలాచిత్రాలు, మేసోలిథిక్ నుంచి మధ్యయుగాల వరకు నివాస స్థానాల ఆధారాలు కూడా ఇక్కడ కనిపిస్తాయనీ వారు తెలిపారు.ఈ శిలా చిత్రాల్లో ప్రధానంగా బైసన్, కృష్ణజింక, పులులు, చిరుతపులులు వంటి పెద్ద జంతువుల బొమ్మలు కనిపిస్తాయి. ఈ శిలా చిత్రాలకూ తోడు, రష్ట్రకూటుల కాలానికి చెందిన శాసనాలు, మధ్యయుగాంతంలోని ఫ్రెస్కో చిత్రాలు కూడా ఈ కొండలపై గుర్తించపడ్డట్లు వారు పేర్కొన్నారు.ఈ చిత్రాలు పూర్వాధికాళ ప్రజల జీవన శైలి, విశ్వాసాలను తెలియజేస్తూ ముఖ్య ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ చిత్రాలు నివాస స్థలాల ఉనికి ఈ ప్రాంతంలో ప్రాచీనకాలం నుండే మానవ వ్యవసాయాన్ని సూచించడమే కాక, ఈ ప్రదేశ భౌగోళిక ప్రాధాన్యాన్ని మరింతగా వివరిస్తున్నాయి. పండవులగుట్టలో కనిపించే భౌగోళిక లక్షణాలు,ప్యాలియోలిథిక్ జీవన చరిత్ర ఆధారాలను సందర్శకులు అర్థం చేసుకునేందుకు పై సమాచారం ఎంతో ఉపయోగకరమని శాస్త్రవేత్తలు తెలిపారు. అలాగే ఈ రాష్ట్రానికి ఏకైక జియో–హెరిటేజ్ ప్రదేశంగా ఉన్న పండవులగుట్టను ప్రజలు తప్పకుండా సందర్శించి, దాని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ చారిత్రక ప్రాధాన్యతను అనుభవించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సీనియర్ శాస్త్రవేత్తలు డా. రమేష్ సామల, రమేష్ గుండా, తుషార్ చంద్ర పటేల్,

## అక్షర్యాస్యులుగా తీర్చిదిద్దాలి

- ఓపెన్ స్కూల్ తెలంగాణ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి



**పాలకుర్తి, జూన్ 27(జనంసాక్షి)** నిరక్షరాస్యులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలను సందర్శించారు. ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్లో ఎంత మంది అడ్మిషన్ తీసుకున్నారు. మండలంలో నిరక్షరాస్యులు ఎంత మంది ఉన్నారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు. నిరక్షరాస్యులందరిని గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర బాలిక విద్యాధికారి నితిన్, అడల్ట్ విద్యాధికారి విజయ్ కుమార్ రెడ్డి, టాసో కోఅరినేటర్ శంకర్రావు, రవి, ప్రదానోపాద్యాయురాలు శోభరాణి. రమేష్, నర్సింహమూర్తి, అశోక్, బలరాం, వెంకటయ్య మాలతి, అన్నపూర్ణ, సుమతి, జయశ్రీ, మధు, రామకృష్ణ ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
28 జూన్ 2025

# విద్య ద్వారానే సమాజాభివృద్ధి

- ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల టాపర్లకి గోల్డ్ మెడల్
- 7.25 కోట్లతో జూనియర్ కళాశాల, 4.65 కోట్లతో డిగ్రీ కళాశాలలకి శంకుస్థాపన
- రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హుజూర్‌నగర్, చింతలపాలెం, జూన్ 27 (జనంసాక్షి) :** నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు మౌలిక వసతులు కల్పిస్తానని, హుజూర్ నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందు వరుసలో ఉంచుతానని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్ నగర్ పట్టణంలో 7.25 కోట్లతో నిర్మాణ చేయనున్న నూతన జూనియర్ కాలేజీ, 4.65 కోట్లతో నిర్మాణం చేయనున్న డిగ్రీ కాలేజీ భవనాలకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హుజూర్ నగర్ నియోజకవర్గంలో ఉన్నత వర్గాల పిల్లలు ఉన్నత విద్యలు ఎలా అభ్యసిస్తారో, నిరుపేదల పిల్లలకు కూడా అదేవిధంగా ఉన్నత విద్య అభ్యసించడానికి మౌలిక వసతులు కల్పించేందుకు జూనియర్, డిగ్రీ కళాశాలలకు నూతన భవనాలను మంజూరు చేయడం జరిగిందని అందుకుగాను రూ.,11.90 కోట్లు కేటాయించడం జరిగినదని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, వ్యవసాయ మార్కెట్



కమిటీ చైర్మన్ రాధికఅరుణ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, ఇ డబ్ల్యు ఐ డి సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి. శైలజ, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డిప్యూటీ ఇంజనీర్ రమేష్, జూనియర్ కాలేజ్ ఇంచార్జ్ ప్రిన్సిపల్ జి. శ్రీనివాస్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ రామారావు, మైనారిటీ రిజిస్ట్రేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ రెహన బేగం, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పనులు త్వరిగతిన పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద నిర్మాణంలో ఉన్న ఎంబిసి లిఫ్ట్ పనులను, నక్కగూడెం లిఫ్ట్



ఇరిగేషన్ పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి రాష్ట్ర నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పనులు ఆలస్యం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. పంప్ హౌజ్ నిర్మాణం,రైతుల నుండి భూసేకరణ త్వరగా చేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకి నష్ట పరిహారం విషయంలో మానవతా ధృక్పదం కోణంలో ఆలోచించి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్ కు సూచించారు. ప్రాజెక్టు ఆలస్యంపై సెంట్రల్ ఇరిగేషన్ డిజైనింగ్ ఆఫీసర్(సిసిడిఓ)ఎంఎస్ రెడ్డి తో మాట్లాడారు. 45 మీటర్ల లోతు తర్వాత లైమ్ స్టోన్ వచ్చే అవకాశం ఉందని సిసిడీఓ మంత్రికి వివరించారు. కార్యక్రమం లో ఇరిగేషన్ సిఈ రమేష్ బాబు, డిఈ శివ ధర్మ తేజ,సత్యనారాయణ ఆర్‌బిఎస్ ఈ సీతారామయ, డిఈ రమేష్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ్ ఆర్గనైజేషన్ చేస్తున్న సేవలు అభినందనీయం

- రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావు
- నిర్మాణ్ ఆర్గనైజేషన్ గ్లోబల్ హెడ్ ఆఫ్ ఇంజనీరింగ్ రాజ వర్ధన్ నల్లూరి



**తలకొండపల్లి, జూన్ 27 (జనంసాక్షి) :** నేటి ఆధునిక సమాజంలో ఆర్థికంగా ఎదిగిన వ్యక్తులు సమూహంగా ఏర్పడి నవ సమాజ అభివృద్ధికి కొంతైనా సేవ చేయాలనే దృక్పథంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ టీం సభ్యులు ముందుకు వచ్చి పేద విద్యార్థులు విద్యను అభ్యసించడానికి కావాల్సిన అవసరాలను తీర్చడం అభినందనీయమని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావు అన్నారు. శుక్రవారం తలకొండపల్లి మండల కేంద్రంలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోరే డాట్ ఏఐ టీం సభ్యుల సహకారంతో సుమారు రూ. 20 లక్షలతో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మూడు అదనపు తరగతి గదులను,బాత్ రూములను నిర్మించారు. ఈ తరగతి గదులను కోరే డాట్ ఏఐ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థినీలు ఆటపాటలు,సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావు మాట్లాడుతూ..సమాజంలో ఉన్న ప్రతి వ్యక్తి జీవితంలో చదువు ద్వారానే గొప్ప మార్పు వస్తుందన్నారు. అంతకముందు కోరే డాట్ ఏఐ సంస్థ గ్లోబల్ హెడ్ ఆఫ్ ఇంజినీరింగ్ రాజ వర్ధన్ నల్లూరి మాట్లాడుతూ..నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యా,నిరుద్యోగం,సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఈ పాఠశాలలో అదనపు తరగతులను నిర్మించి ప్రారంభించడం గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. అనంతరం పాఠశాల అదనపు తరగతి గదులను నిర్మించి ప్రారంభించిన శుభ సందర్భంగా జిల్లా విద్యాధికారి సుసింధర్ రావు,ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్మాణ్ ఆర్గనైజేషన్ ట్రస్ట్ సభ్యులందరినీ మెమెంటో శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిసిడివో సుజాత,మండల విద్యాధికారి చాంప్లా నాయక్,కస్తూరిబా గాంధీ ప్రధానోపాధ్యాయురాలు రేణుక,నిర్మాణ్ ఆర్గనైజేషన్,కోరే డాట్ ఏఐ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గిరీష్ అహంకారి,సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆకుల నర్సింగ్ రావు,వైస్ ప్రెసిడెంట్ ప్రణయ్ ఉపాధ్యాయ,సీనియర్ డైరెక్టర్ నిరంజన్ రెడ్డి,అసిస్టెంట్ డైరెక్టర్ శివ కోటేశ్వరరావు,మేనేజర్ రిక్రూట్మెంట్ ప్రదీప్ కుమార్,కన్సల్టెంట్ వెంకట సూర్య రాధాకృష్ణ,అనురాధ,కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ఉపాధ్యాయుల బృందం,సీఆర్పీలు, విద్యార్థినీలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠీ

**కనగల్లు, జూన్ 27 (జనం సాక్షి) :** కనగల్లు సబ్-మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులు చేపట్టేందుకుగాను ప్రతిపాదనలు వెంటనే తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలని జిల్లా కలెక్టర్ ఈలా త్రిపాఠి మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డ్ ను సందర్శించి ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతుల గురించి పరిశీలన చేశారు. గతంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మండల పర్యటన లో భాగంగా రైతుల కోరిక మేరకు మార్కెట్ యార్డ్ ను సందర్శించి నా సందర్భంలో అందులో ఏర్పాటు చేయవలసిన మౌలిక సదుపాయాల గురించి రైతులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు వెంటనే స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు కావలసిన నిధుల మంజూరుకై ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం ఆమె అధికారులతో మార్కెట్ యార్డ్ ను పరిశీలించిగా అధికారులు 1 కోటి 20 లక్షల రూపాయల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ దృష్టికి మార్కెటింగ్ శాఖ అధికారులు తీసుకెళ్లారు.

### విద్యార్థులు సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థులు ప్రతి సబ్జెక్టు పై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను



ఆకస్మిక తనిఖీ చేసి ఇంటర్ మొదటి సంవత్సరం సిఇసి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి ఆర్థిక శాస్త్రం (ఎకనామిక్స్) సబ్జెక్టు విషయాలపై పూర్తి పట్టు ఉన్నప్పుడే సరైన సమాధానాలు వ్రాయగలుగుతారని తెలిపారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై మేనేజర్ హరీష్, తహసీల్దార్ పద్మ, మండల వ్యవసాయ అధికారి బి అమరేందర్ గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, ఆర్ ఐ డి సునీత, ఎస్సై పీ విష్ణు మార్కెటింగ్ శాఖ సెక్రెటరీ శ్రీధర్ రాజు, మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, కనగల్ ఏఈఓ నవీన్ తదితరులు ఉన్నారు.

## నీతి ఆయోగ్ డెల్టా ర్యాంకింగ్ విడుదల



**గద్వాల నడిగడ్డ, జూన్ 27 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలోని గట్టు బ్లాక్ దేశవ్యాప్తంగా 5వ స్థానం, జోన్-3లో 2వ స్థానం సాధించిందిగా ఘనత అని జిల్లా కలెక్టర్ సంతోష్ అన్నారు. నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ 2024-25 క్యూ4 డెల్టా ర్యాంకింగ్ లో గట్టు బ్లాక్ దేశవ్యాప్తంగా 500 బ్లాక్‌లలో 5వ స్థానం, జోన్ 3లో 2వ స్థానం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు కలిపిన జోన్ సాధించిందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలియజేశారు. ఈ ప్రగతికి గుర్తింపుగా, త్వరలో నితి ఆయోగ్ తరపున గట్టు బ్లాక్‌కు ఒక కోటి రూపాయల పురస్కారం అందజేయ బడుతుందని తెలిపారు. ఈ ర్యాంకింగ్ నీతి ఆయోగ్ నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 500 ఆస్పిరేషనల్ బ్లాక్‌లు పాల్గొన్న సందర్భంలో ప్రకటించబడింది. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ప్రధాన కార్యాలయంలో ప్రారంభమైన 'వాల్ ఆఫ్ ఫేమ్' లో టాప్ ర్యాంక్ సాధించిన బ్లాక్‌ల విజయ గాథలు ప్రదర్శించబడతాయి. ఇది ఆస్పిరేషనల్ బ్లాక్స్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్‌లు దేశాన్ని వికసిత భారత్ 2047 లక్ష్యం వైపు నడిపించేందుకు ఎలా పని చేస్తున్నాయో చూపిస్తుంది. ఈ ర్యాంకింగ్‌ను 5 ప్రధాన అంశాలకుగాను ఉన్న 39 కీలక పనితీరు సూచికలు ఆధారంగా నిర్ణయించబడిందనీ, ఆరోగ్యం, పోషణ,విద్య, వ్యవసాయం అనుబంధ సేవలు,ప్రాథమిక మౌలిక సదుపాయాలు,సామాజిక అభివృద్ధి 2024 అక్టోబర్-డిసెంబరు త్రైమాసికం నుండి 2025 జనవరి-మార్చి త్రైమాసికం మధ్యలో గట్టు బ్లాక్ యొక్క కంపోజిట్ స్కోర్ 61.24 నుండి 69.43కు పెరిగి, 8.19% అభివృద్ధిని నమోదు చేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్, గట్టు మండలం అధికారులు, విభాగాధిపతులు, ఫ్రంట్ లైన్ వర్కర్లను అభినందిస్తూ ,ఇది అందరి సమిష్టి కృషి ఫలితంగా సాధ్యమైందని, 100 శాతం లక్ష్య సాధనకు అందరూ అంకితభావంతో పని చేస్తున్నారని జిల్లా కలెక్టర్ కొనియాడారు.

## వికలాంగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ఐటీ పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్ బాబు

**మంథని, జూన్ 27 (జనంసాక్షి) :** దివ్యాంగులకు ప్రభుత్వం ఎల్లపుడు అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం మంథని నియోజకవర్గం పరిధిలోని మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలీం కో సంస్థ ద్వారా అందిస్తున్న దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని దివ్యాంగులకు ట్రై సైకిళ్ళు, ఇతర ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. దివ్యాంగులు సమాజంలో అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దివ్యాన్గులకు అవసరమైన ఉపకరణాలను అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని దివ్యాంగుల సంక్షేమానికి అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. మహదేవ్ పూర్ మండలంలో సుమారు 200 మంది దివ్యాంగులను గుర్తించడం జరిగిందని వారిలో మొదటి విడతలో 50 మంది దివ్యాంగులకు వివిధ రకాలైన బ్యాటరీ ట్రై సైకిళ్ళు, సాధారణ ట్రై సైకిళ్ళు, వినికిడి పరికరాలు, చేతి కర్రలు, స్టాండ్ లు వారి వారి వైకల్యాన్ని బట్టి అందిస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామని ఇల్లు లేని దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అతి త్వరలో నూతన పెన్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి ఒకొక్క హామీని నెరవేరుస్తున్నామని తెలిపారు. అనంతరం మహదేవ్ పూర్ మండలానికి చెందిన 89 మంది లబ్ధిదారులకు సుమారు 90 లక్షల రూపాయల విలువగల కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 20 లక్షల



రూపాయల నిధులతో నిర్మించిన డా బి.ఆర్ అంబేద్కర్ చిల్డ్రన్ పార్క్ ను రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్ అయిత ప్రకాష్ రెడ్డి, కూడా చైర్మెన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి లతో కలిసి ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, సీడీపిఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

## మంజీరా డ్యాం సేఫ్.. ఎలాంటి పగుళ్ళు లేవు

- మరమ్మత్తుల కోసం మూడున్నర కోట్ల కేటాయించాం
- నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 27 (జనం సాక్షి) :** సంగారెడ్డి మండలంలోని మంజీరా డ్యాం సేఫ్‌గా ఉందని ఏలాంటి పగుళ్ళు ఏర్పడలేదని నీటిపారుల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ పేర్కొన్నారు. మంజీరా డ్యాం ను శుక్రవారం. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ లతో కలిసి మజీర డ్యాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో మాట్లాడారు. జంటనగరాల త్రాగు నీరు అందించే మంజీరా నది సేఫ్ గా ఉందన్నారు. డ్యాం ఎలాంటి పగుళ్ళ లేవన్నారు. మరమత్తులకోసం మూడున్నర కోట్ల రూపాయలు కేటాయించమన్నారు. డ్యాం పనులకోసం అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ రవీంద రెడ్డి హెచ్ఎం డబ్ల్యూ ఎస్ పటాన్ చెరువు డివిజన్-2 , జనరల్ మేనేజర్ మాణిక్యం, రాజం పేట్, కులబ్గూర్,డి జి ఎమ్ , ఏ. రామక్రిష్ణ , నీటిపారుదల శాఖ అధికారులు , అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల్లో ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం కలిగించాలి

- విద్యా, వైద్య రంగాలు ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివి
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, జూన్ 27 (జనం సాక్షి) :** ప్రభుత్వం పేద ప్రజలకు సేవ చేయడానికి ఉన్నదని,విద్యా, వైద్య రంగాలు ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతుందని ప్రజల్లో నమ్మకం కలిగేలా ప్రతి ప్రభుత్వ వైద్యుడు, ఆసుపత్రి సిబ్బంది బాధ్యతతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన గర్భిణీలను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయొద్దన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల ద్వారా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ, ప్రైవేట్ ఆసుపత్రులు ప్రజల జేబులకు భారీ భారం పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై వైద్య భారం తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వ డాక్టర్లపై ఉందని తెలిపారు. ప్రతీ పీహెచ్సీలో కనీసం 75 శాతం సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మునుగోడు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రజలకు సులభంగా వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునికంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో ఒక ఆరోగ్య కేంద్రం ఉండేలా చూస్తామన్నారు.



### చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యంపై అసహనం

చౌటుప్పల్ పట్టణ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్లు, సిబ్బంది పేషంట్లను నిర్లక్ష్యంగా చూసి, ప్రైవేట్ ఆసుపత్రులకు పంపిస్తున్నారని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగ, ఆయన వెంటనే యాదాద్రి డిసిహెచ్ఎస్ చిన్న నాయక్‌కు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఒక్క పేషంటును కూడా ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేయొద్దని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీఎంహెచ్ఓ డా. మనోహర్, నల్గొండ డిప్యూటీ డీఎంహెచ్వో వేణుగోపాల్ రెడ్డి, దేవరకొండ ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్వో కళ్యాణ్ చక్రవర్తి, చౌటుప్పల్ డిప్యూటీ డీఎంహెచ్వో యశోద, వివిధ మండలాల మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్హెచ్పీఎస్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడిన ఆరుగురు అరెస్ట్

- 33 బైక్‌లు స్వాధీనం
- కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 27 (జనంసాక్షి) :** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడిన ఆరుగురు దొంగలను అరెస్ట్ చేసి, వారి నుండి మొత్తం 33 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం రోజు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. కరీంనగర్ టూ టౌన్ పరిధిలోని పద్మనగర్‌లో టూ టౌన్ , సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా శుక్రవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు మోటార్ సైకిళ్ళపై ట్రిపుల్ రైడింగ్ లో వెళ్తున్న ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు కరీంనగర్ కమీషనరేట్ , సిరిసిల్ల జిల్లా పరిధిలో మొత్తం 12, 27,000 రూపాయల విలువగల, 33 మోటార్ సైకిళ్లను దొంగిలించినట్లు తేలింది. ఈ దొంగతనాలకు సంబంధించి మొత్తం ఆరు పోలీస్ స్టేషన్లలో 22 కేసులు నమోదు చేసినట్లు పోలీస్ కమీషనర్ వెల్లడించారు.

### పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న బైక్‌ల వివరాలు

కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో 06 కేసులలో 11 బైక్‌లు స్వాధీనం, కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో 08 కేసులలో 09 బైక్‌లు స్వాధీనం, కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో 01 కేసులో 01 బైక్ స్వాధీనం, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో 02 కేసులలో 02 బైక్‌లు స్వాధీనం, కరీంనగర్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ లో 03 కేసులలో 03 బైక్‌లు స్వాధీనం, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పోలీస్ స్టేషన్ లో 02 కేసులలో 02 బైక్‌లు , సరైన వివరాలు లేని 05 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.



### పట్టుబడిన నిందితుల వివరాలు

పంతుల నవీన్ (24) – మహబూబ్‌నగర్ జిల్లా, వెంకిచర్ల నివాసి, పెంటి బాలు (24) – కరీంనగర్ జిల్లా, గన్నేరువరం, చొక్కారావుపల్లె నివాసి, పెద్ది నాగరాజు (29) – సిరిసిల్ల జిల్లా, చందుర్తి, మల్యాల నివాసి, చిందం సాయి ప్రసాద్ (24) – ముత్తారం మంథని మండలం, కేశినపల్లి గ్రామ నివాసి, తోట మధు (28) – కరీంనగర్ జిల్లా, గంగాధర మండలం, లింగంపల్లి గ్రామ నివాసి, కుంబాల సురేష్ (35) – సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట నివాసి, ఈ అరెస్టులతో మోటార్ సైకిల్ దొంగతనాలకు అడ్డుకట్ట పడిందని, ప్రజలు తమ వాహనాల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమీషనర్ సూచించారు. ఈ నిందితులను పట్టుకుని, దొంగిలించబడిన 33 బైకులు స్వాధీనం చేయడంలో కృషి చేసిన కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి , టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి , సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కోటేశ్వర్ వన్ టౌన్, జాన్ రెడ్డి త్రీ టౌన్ , ఇతర సిబ్బందిని పోలీసు కమీషనర్ రివార్డు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.




## అమ్మో ఆ చెప్పులు..
# అంత ధరనా..!?

### రూ. 400 చెప్పుల్ని లక్షకు అమ్ముకుంటారా?
### ప్రాడాపై హర్ష్ గోయెంకా విమర్శలు



ఇటాలియన్ లగ్జరీ బ్రాండ్ ప్రాడా ఇటీవల ప్రదర్శించిన చెప్పులు, వాటి ధరపై భారతీయ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా స్పందించారు. అసలు కళాకారులకు క్రెడిట్ ఇవ్వకుండా భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని అంతర్జా తీయ బ్రాండ్లు లాభపడుతున్నాయంటూ ఆయన విమర్శించారు.ఇది చాలా విచారకరం అంటూ ట్వీట్ చేశారు. ప్రాడా పురుషుల పాదరక్షల స్ప్రింగ్ సమ్మర్ 2026 ఇటీవల ప్రదర్శించింది. వీటి డిజైన్ అచ్చం మన షోలాపూర్ చెప్పుల మాదిరిగానే రాజసాన్ని ఒలకబోస్తుట్టున్నాయి. కానీ వాటి ధరే 1.2 లక్షలు ఉండటం హాట్ టాపిక్‌గా మారింది. నెటిజన్లు దీనిపై తీవ్రంగా చర్చించారు.అటు బిలియనీర్ గోయెంకా కూడా దీనిపై స్పందించారు.ఈ చెప్పుల ఫోటోలు ట్వీట్ చేస్తూ, ఇవి భారతదేశపు ఐకానిక్ కొల్హాపురి చెప్పులను పోలి ఉన్నాయి, కానీ ధర లక్షకు పై మాటే!అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించారు. మన చేతివృత్తులు వారు వీటినే రూ.400 కు తయారు చేస్తారు. అంటే వారు ఎంత నష్టపోతున్నారు? ప్రపంచ బ్రాండ్లు మన సంస్కృతిని సొమ్ము చేసుకుంటున్నాయి. విచారకరం! అంటూ గోయెంకా రాసుకొచ్చారు.ఈ హై-ఎండ్ ఫ్యాషన్ చప్పల్స్‌ని ప్రీమియం మెటీరియల్స్, ఇండియన్ డిజైన్‌తో రూపొందించినట్టు ప్రాడా ప్రకటించింది. అయితే ఇండియాలో షోలాపూర్ చెప్పులను పోలి ఉన్న ఈ చెప్పుల ధర భారీ లగ్జరీగా ఉండటంతో నెటిజన్లు విస్తుపోయిన సంగతి తెలిసిందే.

## పుత్తడి ప్రియుల్లో కోటి ఆశలు..

### బంగారం తగ్గుముఖం



ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధర క్రమంగా తగ్గుముఖ పడుతోంది. మూడు రోజులుగా క్రమంగా పడిపోతున్న పుత్తడి ధరలు గురువారంతో పోలిస్తే శుక్రవారం కూడా తగ్గాయి. దేశంలోని ప్రధానం నగరాల్లో ఈరోజు బంగారం ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.

# లాభాల్లో స్టాక్‌మార్కెట్లు

### • సెన్సెక్స్ కొత్త మార్క్



బెంచ్ మార్క్ భారతీయ ఈక్విటీ సూచీలు వరుసగా నాలుగో సెషన్ లోనూ లాభాల బాటలో పయనించి, వారం చివరి ట్రేడింగ్ సెషన్ ను సానుకూలంగా ముగించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 303.03 పాయింట్లు లేదా 0.36 శాతం పెరిగి 84,058.90 వద్ద స్థిరపడింది. శుక్రవారం ఈ సూచీ 84,089.35 - 83,645.41 శ్రేణిలో ట్రేడ్ అయింది. నిఫ్టీ 50 కూడా 88.80 పాయింట్లు లేదా 0.35 శాతం లాభంతో 25,657.80 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.27 శాతం, 0.91 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ కన్జ్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, ఐటీ, ఎఫ్ఎంసీజీ సూచీలు మినహా ఎన్ఎస్ఈలోని ఇతర సెక్టోరల్ ఇండెక్స్‌లన్నీ లాభాల్లో ముగియగా, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ 1.19 శాతం లాభపడింది. ఎన్ఎస్ఈలో 2,986 షేర్లలో 1,681 షేర్లు లాభాల్లో, 1,229 షేర్లు నష్టాల్లో ముగియగా, 76 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. 86 స్టాక్స్ 52 వారాల గరిష్టాన్ని తాకగా, 24 స్టాక్స్ 52 వారాల కనిష్టాన్ని తాకాయి. అప్పర్ సర్క్యూట్ ను తాకిన స్టాక్స్ సంఖ్య 105కు పెరగ్గా, లోయర్ సర్క్యూట్ పరిమితులకు 40 పడిపోయాయి. ఎన్ఎస్ఈలో అన్ని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.32 లక్షల కోట్లుగా ఉంది. మార్కెట్ ఒడిదుడుకులను అంచనా వేసే ఇండియా వీఐఎక్స్ 1.60 శాతం క్షీణించి 12.39 పాయింట్ల వద్ద స్థిరపడింది.

**పీబీ ఫిన్‌టెక్‌లో వాటా విక్రయం**

ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా పీబీ ఫిన్‌టెక్‌లో కంపెనీ సహవ్యవస్థాపకులు యాషిష్ దహియా, అలోక్ బన్సల్ 1.09 శాతం వాటాను షేరుకి రూ. 1,821.5 సగటు ధరలో విక్రయించారు. ఇన్సూర్‌టెక్.. పాలసీబజార్, ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ పైసాబజార్ మాతృ సంస్థలో 50.5 లక్షల షేర్లను అమ్మివేయడం ద్వారా రూ. 920 కోట్లు సమకూర్చుకున్నారు. ఎన్ఎస్ఈ బల్క్‌డీల్ వివరా ల ప్రకారం సీఈవో దహియా 0.74 శాతం వాటాకు సమానమైన 34 లక్షల షేర్లు. వైస్‌చైర్మన్ బన్సల్ 0.36 శాతం వాటాకు సమానమైన 16.5 లక్షల షేర్లు విక్రయించారు. తాజా లావాదేవీల తదుపరి పీబీ ఫిన్‌టెక్‌లో దహియా వాటా 4.31 శాతం నుంచి 3.57 శాతానికి, బన్సల్ వాటా 1.4 శాతం నుంచి 1.04 శాతానికి క్షీణించింది. కాగా.. ఈ వాటాలను దేశీ ఎంఎఫ్, బీమా రంగ సంస్థలతోపాటు విదేశీ ఇన్వెస్టర్లు సొంతం చేసుకున్నాయి. ఈ జాబితాలో టాటా ఎంఎఫ్, ఎడిల్‌వీజ్ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రు లైఫ్‌సహా సిటీగ్రూప్ గ్లోబల్, గోల్డ్‌మన్ శాక్స్, మోర్గాన్ స్టాన్లీ ఏషియా సింగపూర్, సొసైటీ జనరాలి తదితరాలు చేరాయి.

డెల్హివరీలో వాటా కొనుగోలు

**జాబితాలో మోర్గాన్ స్టాన్లీ, సిటీగ్రూప్**

ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా లాజిస్టిక్స్ సర్వీసులందించే డెల్హివరీలో దేశ, విదేశీ దిగ్గజాలు వాటా కొనుగోలు చేశాయి. ఎన్ఎస్ఈ బల్క్‌డీల్ గణాంకాల ప్రకారం 1.6 శాతం వాటాకు సమానమైన 1.19 కోట్ల ఈక్విటీ షేర్లను సొంతం చేసుకున్నాయి. ఇందుకు షేరుకి రూ. 387 సగటు ధరలో రూ. 461 కోట్లు వెచ్చించాయి. షేర్లను కొనుగోలు చేసిన సంస్థల జాబితాలో మోర్గాన్ స్టాన్లీ, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ సింగపూర్, విరిడియన్ ఏఎంతోపాటు.. ఎంఎఫ్ సంస్థలు హెచ్‌డీఎఫ్ సీ, యాక్సిస్, టాటాతదితరాలు చేరాయి. అనుబంధ సంస్థలు నెక్సస్ అపార్చునిటీ ఫండ్, నెక్సస్ వెంచర్స్-3తో వీసీ కంపెనీ నెక్సస్ వెంచర్ పార్ట్‌నర్స్ తాజాగా డెల్హివరీలో వాటా విక్రయించింది. 2025 మార్చికల్లా డెల్హివరీలో 5.88 % వాటాను నెక్సస్ వెంచర్స్-3 కలిగి ఉంది. ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.


## ఒకే వేదికపై భారతీయ పాటలు, కళలు, వంటలు..మరెన్నో

### ఎన్ఎంఏసీసీ వీకెండ్



భారతీయ కళలు ఉట్టిపడేలా నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ (ఎన్ఎంఏసీసీ) ఇండియా వీకెండ్‌ను న్యూయార్క్ నగరంలోని లింకన్ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్నట్లు నీతా అంబానీ తెలిపారు.ఈ వేడుక 2025 సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు జరగనుందని చెప్పారు. ఈమేరకు 'ఎన్ఎంఏసీసీ.ఇండియావికెండ్' ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో వివరాలు వెల్లడించారు. భారతీయ కళల వారసత్వం, సంప్రదాయ నృత్యాలు, సంగీతం, ఫ్యాషన్, వంటకాలు.. వంటి ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు ఇందులో ఉండనున్నాయని తెలిపారు.ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లోని వివరాల ప్రకారం.. 'ది గ్రేట్ ఇండియన్ మ్యూజికల్: సివిలైజేషన్ టు నేషన్' ఈవెంట్‌లో భాగంగా సాంప్రదాయ నృత్యాలు ఉంటాయని నీతా అంబానీ తెలిపారు. ఈ ఈవెంట?కు సంబంధించిన టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నట్లు ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశారు.

**స్మార్ట్‌ఫోన్స్ బ్రాండ్ తాజాగా ఎఫ్-సిరీస్‌లో ఎఫ్7 ఫోన్‌ను ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.29,999 నుంచి రూ.31,999 వరకు ఉంటుంది. 7,550 ఎంఏహెచ్ బ్యాటరీ, 90 వాట్స్ టర్బో చార్జింగ్, స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 చిప్‌సెట్, 6.83 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్882 కెమెరా తదితర ఫీచర్లు ఇందులో ఉన్నాయని సంస్థ ప్రొడక్ట్ మార్కెటింగ్ మేనేజర్ సచిన్ దేవ్ తెలిపారు.**





## పిక్సెల్ స్మార్ట్‌పోన్ల నిషేధం



ప్రముఖ టెక్ దిగ్గజ కంపెనీ గూగుల్‌కు జపాన్ కోర్టులో చుక్కెదురైంది. గూగుల్ పేటెంట్ ఉల్లంఘించిందంటూ వేసిన దావాకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింది. జపాన్‌లో పిక్సెల్ 7, పిక్సెల్ 7 ప్రో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలను నిషేధించాలని పేర్కొంది. పేటెంట్ పొందిన ఎల్‌టీఈ టెక్నాలజీని అనుమతి లేకుండా గూగుల్ చట్టవిరుద్ధంగా ఉపయోగిస్తోందని ఆరోపిస్తూ ఇటీవల కోర్టులో వేసిన దావాకు అనుకూలంగా తీర్పు వెలువడింది. ఈటీన్యూస్ ప్రచురించిన తాజా నివేదిక ప్రకారం.. 4జీ నెట్‌వర్క్‌లో ఉపయోగించే నిర్దిష్ట కమ్యూనికేషన్ పద్ధతిపై వివాదం మొదలైంది. ఎల్‌టీఈ టెక్నాలజీపై జపాన్‌లో ఇప్పటికే పేటెంట్ తీసుకున్నట్లు పాన్‌టెక్ సంస్థ దావాలో పేర్కొంది. దేశ చట్టాలకు విరుద్ధంగా గూగుల్ పిక్సెల్ ఫోన్‌లో ఈ టెక్నాలజీని వాడుతున్నట్లు తెలిపింది. దాంతో విచారణ జరిపిన జపాన్ కోర్టు ఆ దేశంలో పిక్సెల్ సిరీస్ ఫోన్‌లను నిషేధిస్తున్నట్లు తీర్పు ఇచ్చింది. 'అక్నాలెడ్జ్‌మెంట్ సిగ్నల్' లేదా ఏసీకే అని పిలువబడే నియంత్రణ సిగ్నల్ పరికరాలు, బేస్ స్టేషన్ల మధ్య కమ్యునికేషన్ ఎలా ప్రసారం అవుతుందనే దానిపై కంపెనీ, దావా వేసిన వారిలో పరస్పరం భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. ఈ ఎల్‌టీఈ టెక్నాలజీ జపాన్ పేటెంట్ చట్టం కింద సంరక్షించబడుతుంది. దాంతో జపాన్ కోర్టు చర్యలు తీసుకుంది.కోర్టులో దావా వేసిన పాన్‌టెక్ కంపెనీ స్వయంగా స్మార్ట్ ఫోన్ వ్యాపారం నుంచి నిష్క్రమించినప్పటికీ, దాని మిగిలి ఉన్న పేటెంట్లు ఇప్పటికీ యాక్టివ్‌గానే ఉన్నట్లు తెలిపింది. గూగుల్ పిక్సెల్ 7, 7 ప్రో సరైన లైసెన్సింగ్ లేకుండా ఈ సాంకేతికతను ఉపయోగించాయని టోక్యో డిస్ట్రిక్ట్ కోర్టు తెలిపింది. దాంతో ఈ మోడళ్ల అమ్మకాలపై మాత్రమే కాకుండా దిగుమతులు, ప్రకటనలు, జపాన్‌లో ఈ మోడళ్ల ప్రదర్శనపై కూడా నిషేధాన్ని విధించింది. విచారణ సందర్భంగా కంపెనీ ప్రవర్తనపై కోర్టు తీవ్ర విమర్శలు చేసింది. గూగుల్‌ది 'చిత్తశుద్ధి లేని వైఖరి'గా అభివర్ణిం చింది.

# కుబేరుడి పెళ్లి సందడి షురూ

### అంగరంగవైభవంగా మూడు రోజుల ముచ్చట



ప్రపంచ కుబేరుడు అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ పెళ్లి సందడి మొదలైంది. 61 ఏళ్ల టెక్ బిలియనీర్, 55 ఏళ్ల ప్రేయసి లారెన్ సాంచెజ్‌తో వెడ్ లాక్ సంబరాలు అంగరంగ వైభవంగా ప్రాంభమైనాయి.గురువారం తమ మూడు రోజుల వివాహ వేడుకలు షురూ అయ్యాయి. ఈ వేడుకలకు కిమ్ చ ఖ్లో కర్దాషియాన్, ఓప్రా విన్‌ఫ్రే , ఓర్లాండో బ్లూమ్ వంటి టాప్ మోస్ట్ గెస్ట్‌లతో వేదిక కళకళలాడింది.బెజోస్, సాంచెజ్ 16వ శతాబ్దపు గ్రాండ్ కెనాల్ పై ఉన్న విలాసవంతమైన అమన్ హెూటల్ లో బస చేయగా, ప్రపంచంలోని పురాతన చలనచిత్రోత్సవానికి నిలయంగా ప్రసిద్ధి చెందిన శుక్రవారం వెనిస్ సరస్సులోని ఒక ద్వీపంలో ప్రముఖ అతిథులు హాజరయ్యే విలాసవంతమైన ప్రైవేట్ వేడుకలో వెనిస్, బెజోస్, సాంచెజ్‌తో వివాహం చేసుకోనున్నారు. శాన్ గియోవన్నీ ఎవాంజెలిస్టా అనే చిన్న ద్వీపంలో ఉన్న విల్లా బాస్లిని తోటలలో గురువారం అతిథులు విందారగించారు. వివాహ వేడుక శనివారం తుది పార్టీతో ముగుస్తుంది.ని ఒక పెద్ద బహిరంగ యాంఫిథియేటర్ లో వివాహం జరుగుతుంది. వేడుక తర్వాత, ఈ జంటకు ప్రముఖ ఒపెరా గాయని ఆండ్రియా బోసెల్లి కుమారుడు మాటియో బోసెల్లి సెరినేడ్ చేస్తారని సమాచారం. ఈ వివాహ వేడుకల కోసం సాంచెజ్ 27 విభిన్న దుస్తులను సిద్ధం చేసినట్లు నివేదికల ద్వారా తెలుస్తోంది. సగం మంది ఇటాలియన్ ఫ్యాషన్ డిజైనర్లు వీటిని రూపొందించారట. అంతేకాదుతమ వేడుకల్లో భాగంగా, బెజోస్ ,సాంచెజ్ నగరానికి 3.5 మిలియన్ల డాలర్లు (దాదాపు 30కోట్లు) విరాళంగా ఇస్తున్నారని వెనెటో ప్రాంతీయ అధ్యక్షుడు లూకా జైయా తెలిపారు. లవ్ బర్డ్స్ పెళ్లి సందడికోసం వెనిస్ చేరుకున్నామంటూ ఇవాంకా ట్రంప్ కొన్ని ఫోటోలను ఇన్‌స్టాలోపోస్ట్ చేసింది. భారతీయ దాతృత్వవేత్త , ఫ్యాషన్ ఐకాన్ నటాషా పూనవాలా ఈ వెడ్డింగ్ బాష్‌లో అద్భుతంగా కనిపించారు. ఆమె రూపానికి ఫ్యాన్స్‌మాత్రమే కాదు స్వయంగా వధువు సాంచెజ్ కూడాఫిదా అయినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోను నటాషా ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది సెలబ్రిటీలు, ప్రముఖ అతిథులతోపాటు, జోర్డాన్ క్వీన్ రానియా, స్టార్ టామ్ బ్రాడీ, అమెరికన్ డిజైనర్ స్పెన్సర్ ఆంట్లే, గాయని అష, ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ ఉన్నారు. వీరిని చేరవేసేందుకు మెగా యాచ్‌లు ,వెనిస్‌లోని మార్కో పోలో విమానాశ్రయంలో కనీసం 95 ప్రైవేట్ విమానాలు ల్యాండింగ్ అనుమతిని అభ్యర్థించాయి.అయితే, ఈ వేడుకపై పర్యావరణవేత్తలు స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'నో స్పేస్ ఫర్ బెజోస్' అనే నినాదాలతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. నగరంలోని ప్రధాన కాలువలు, సెంట్రల్ వెనిస్‌లోని పలు పర్యాటక ప్రాంతాలను దిగ్బంధించాలని నిరసనకారులు పిలుపునిచ్చారు.



## సముద్రం ఒడ్డున.. వానరంతో సీఎం..

కోల్‌కతా: 'సముద్ర తీరంలోని టీ చెప్పలేని బంధానికి దారితీసినప్పుడు' అనే క్యాప్షన్ జత చేస్తూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక ఆ ఫొటోల్లో దీదీ.. ఓ వానారానికి బిస్కెట్లు అందించారు. ఆ బిస్కెట్లు తీసుకున్న కోతి ప్రశాంతంగా అక్కడ కూర్చొని ఉండటానికి గమనించవచ్చు. తన అఫీషియల్ సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఫోటోలు పశ్చిమ బెంగాల్‌లోని పుర్బా మెదినిపూర్‌లోని దిఘా బీచ్‌లో తీసినట్లు ఒక యూజర్ పేర్కొన్నారు.

## సిబిల్ సరిగా లేదని ఎస్‌బీఐ
# ఉద్యోగం రద్దు




సిబిల్ స్కోర్ సరిగాలేని కారణంగా సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ (సీబీఓ) పోస్టులో ఉన్న ఓ అభ్యర్థి నియామకాన్ని రద్దు చేస్తూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తీసుకున్న నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు సమర్థించింది. నియామకానికి సంబంధించిన అన్ని పరీక్షలు, ఇంటర్వ్యూల్లో ఉత్తీర్ణత సాధించినప్పటికీ అభ్యర్థి గతంలో చేసిన క్రమరహిత చెల్లింపులు, సిబిల్ స్కోర్‌ను పరిగణించి రిక్రూట్‌మెంట్ రద్దు చేశారు.ఎస్‌బీఐ తన నియామకాన్ని రద్దు చేసినందుకు మద్రాస్ హైకోర్టులో ఆ అభ్యర్థి పిటిషన్ దాఖలు చేశాడు. దాన్ని పరిశీలించిన మద్రాస్ హైకోర్టు ఎస్‌బీఐ చర్యలను సమర్థించింది. నియామక నోటిఫికేషన్‌లో స్పష్టంగా సిబిల్ స్కోర్, గత ఆర్థిక లావాదేవీల గురించి ఎస్‌బీఐ తెలిపిందని పేర్కొంది. జస్టిస్ ఎన్.మాలా ఈ కేసులో తీర్పు చెబుతూ ప్రజాధనంతో ముడిపడి ఉన్న ఉద్యోగాలకు ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం అన్నారు. ఎస్‌బీఐ రిక్రూట్‌మెంట్ క్లాజ్ (క్లాజ్ 1(ఈ)) ప్రకారం సిబిల్ లేదా ఇతర ఏజెన్సీల నుంచి నెగెటివ్ క్రెడిట్ హిస్టరీ లేదా ప్రతికూల రిపోర్టులు ఉన్న అభ్యర్థులు అనర్హులని చెప్పారు. నియామకానికి ముందే బకాయిలు చెల్లించినట్లు అభ్యర్థి పేర్కొన్నప్పటికీ క్లీన్ రీపేమెంట్ ట్రాక్ రికార్డ్ అనేది కేవలం రుణ క్లియరెన్స్ మాత్రమే కాదని, దాన్ని నియామకాల్లో బెంచ్ మార్క్‌గా పరిగణిస్తారని కోర్టు నొక్కి చెప్పింది.

**సిబిల్ స్కోర్ పెంచుకోవడానికి మార్గాలు:**క్రెడిట్ కార్డు బిల్స్, ఈఎంఐ వంటివి సకాలంలో చెల్లించాలి. ఇది మీ సిబిల్ స్కోరును పెంచడంలో సహాయపడుతుంది. చెల్లింపులు ఆలస్యమైతే సిబిల్ స్కోర్ మీద ప్రతికూల ప్రభావం పడుతుంది. దీంతో స్కోర్ తగ్గిపోతుంది. కాబట్టి ఈ విషయంలో ఎప్పుడూ జాగ్రత్తగా ఉంటూ.. గడువుకు ముందే చెల్లింపులు పూర్తి చేయాలి. లోన్ కోసం మళ్ళీ మళ్ళీ వెంట వెంటనే అప్లై చేయడం మానుకోవాలి. తక్కువ వ్యవధిలో ఎక్కువ రుణాల కోసం దరఖాస్తు చేయడం ఆర్థిక ఒత్తిడిని సూచిస్తుంది. ఇది మీ సిబిల్ స్కోర్‌ను తగ్గిస్తుంది. మీ పేరుతో లేదా మీ డాక్యుమెంట్స్ ఉపయోగించి ఎవరికైనా లోన్ తీసి ఇవ్వడం వంటివి ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదు. ఎందుకంటే లోన్ తీసుకున్న వ్యక్తి సకాలంలో ఈఎంఐ చెల్లించకపోతే.. ఆ ప్రభావం మీ క్రెడిట్ స్కోర్ మీద చూపిస్తుంది. రుణ గ్రహీత తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని మీరు విశ్వసిస్తే మాత్రమే.. హామీదారుగా ఉండటానికి అంగీకరించండి. క్రెడిట్ కార్డ్ పరిమితిని పెంచుకున్నప్పటికీ.. ఖర్చులను కొంత ఆచితూచి చేయాల్సి. ఖర్చులు పెరిగితే.. మీ ఆర్థిక పరిస్థితి మీద ప్రభావం చూపుతుంది. ఇది మీ సిబిల్ స్కోర్ మీద ప్రభావం చూపుతుంది.సిబిల్ స్కోరు ను పెంచుకోవడానికి సరైన మార్గం.. క్రెడిట్ కార్డును ఉపయోగించడం మాత్రమే కాదు. సకాలంలో తిరిగి చెల్లించాలి.

## 'సారీ సర్.. వెజిటేరియన్ ఫ్యామిలీ ఓన్లీ..



చెన్నైలో అద్దెకు ఉండేందుకు ఫ్లాట్ల కోసం వెతుకుతున్న ఓ వ్యక్తికి విచిత్రమైన అనుభవం ఎదురైంది. మీలో చాలామందికి ఇలాంటి అనుభవమే ఎదురై ఉంటుంది. ఇదే అంశంపై ఆన్‌లైన్‌లో షేర్ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఈ రోజుల్లో దాదాపు చాలామందికి ముక్కలేనిదే ముద్దదిగదనే ధోరణి వచ్చేసింది. అలాంటిది నాన్‌వెజ్ తింటే ఇల్లు అద్దెకు అవ్వబోమని ఓ యజమాని చెప్పడం చర్చకు దారితీసింది. సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ రంగస్వామి అనే వ్యక్తి చెన్నైలో ఇంటి అద్దె కోసం వెతుకుతున్నాడు. ఓ ఫ్లాట్ యజమానిని వాట్సప్ ద్వారా సంప్రదించాడు. 'మీరు నాన్‌వెజ్ తింటే ఇల్లు అద్దెకు ఇవ్వబోం. సారీ సర్.. వెజిటేరియన్ ఫ్యామిలీ కోసం చూస్తున్నాం' అంటూ యాజమాని చెప్పాడు. దాంతో ఈ రోజుల్లో కూడా ఇలాంటి నిబంధనలు పెట్టడంపై ప్రశాంత్ ఆందోళన చెందుతూ వారిద్దరి మధ్య జరిగిన సంభాషణను స్క్రీన్‌షాట్ తీసి సామాజిక మాధ్యామాల్లో షేర్ చేశారు. 'చెన్నైలో అద్దెకు ఫ్లాట్లు దొరకాలంటే నాన్ వెజ్ తినడం హానికరం' అని ఆ పోస్ట్‌కు క్యాప్షన్ పెట్టారు.మీలో లేదా మీకు తెలిసిన వారిలో చాలామంది ఈ సమస్యను ఏదుర్కొనే ఉంటారు. ఈ తంతు ఇంకెంత కాలం అంటూ కొందరు ఈ పోస్ట్‌కు రిప్లై ఇస్తుంటే.. సైలెంట్‌గా వేరే ఇల్లు చూసుకోండంటూ ఇంకొందరు చెప్పారు. 'నేను శాకాహారినే. కానీ చుట్టూ మాంసం తినేవారున్న యూరప్‌లో నివసించాను. ఎప్పుడూ సమస్య లేదు. కానీ ఇక్కడ, ఈ ఆంక్షలు హాస్యాస్పదంగా అనిపిస్తున్నాయి' అని ఒక యూజర్ అన్నారు. అయితే కొందరు మాత్రం తమ ఆస్తిని ఎవరికి అద్దెకు ఇవ్వాలో నిర్ణయించే హక్కు ఇంటి యజమానులకు ఉందని తెలిపారు.

## హార్ముజ్ మూసివేత గండం గడిచినట్లేనా?!



ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికాల యుద్ధం నేపథ్యంలో హార్ముజ్ జల సంధిని మూసివేస్తామని ఇరాన్‌ప్రకటించడం కలకలం రేపింది. దీనికి ఎందుకంత ప్రాధాన్యం?ఇది ఇరాన్‌కు ఉత్తర భాగంలో, ఒమన్, యూఏఈ దేశాలకు పశ్చిమ భూభాగంలో ఉంటుంది. ఈ జలసంధి ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో 50 కి.మీ. వెడల్పుతో ఉంటుంది. లోతు చాల ఎక్కువగా ఉండి పెద్ద రవాణా నౌకలు కూడా ప్రయాణించడానికి అనువుగా ఉంటుంది. ఇది గల్ఫ్ దేశాలను అరేబియా సముద్రానికి అనుసంధానిస్తుంది. హార్ముజ్ జలసంధి ద్వారా ఒక్క ఇరాన్ కాకుండా ఇంకా గల్ఫ్ దేశాలైన ఇరాక్, కువైట్, ఖతర్, సౌదీ అరేబియా, యూఏఈలు కూడా ఆయిల్ సరఫరా చేస్తుంటాయి. అమెరికాలోని ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ అంచనా ప్రకారం 2023లో ఈ జలసంధి ద్వారా 2 కోట్ల బారెళ్ల క్రూడ్ ఆయిల్ని ఆ యా గల్ఫ్ దేశాలు సరఫరా చేశాయి. దీని విలువ సుమారు 600 బిలియన్ల డాలర్లు. ఇది ఒక్క ఏడాదిలో జరిగిన ఆయిల్ సరఫరా విలువ.యూకే ఇంటెలిజెన్స్ ఏజెన్సీ మాజీ డైరెక్టర్ సర్ అలెక్ యూన్గర్ అంచనా ప్రకారం ఈ జలసంధిని మూసివేయడం వల్ల ఆయిల్ రేట్లు అంచనాకు మించి పెరిగే అవకాశముంటుంది. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఈ జలసంధి ద్వారా ముఖ్యంగా ఆసియా దేశాలకు ఆయిల్ సరఫరా అవుతోంది. చైనా దిగుమతి చేసుకొనే 90% ఆయిల్ ఒక్క ఇరాన్ నుంచే సప్లై అవుతుంది. ఇండియా 60% క్రూడ్‌ను దిగుమతి చేసుకుంటోంది. దక్షిణ కొరియా 60%, జపాన్ ఉపయోగించే ఆయిల్‌లో మూడొంతులు ఈ జలసంధి ద్వారానే దిగుమతి అవుతోంది. ముఖ్యంగా చైనా, దక్షిణ కొరియాలో ఉత్పత్తి అయ్యే అన్ని వస్తువుల ధరలూ దీని మూసివేత వల్ల బాగా పెరిగే అవకాశంఉంటుంది. ఈ దేశాల వస్తువులు ఒక్క అమెరికానే కాకుండా ప్రపంచంలోని అనేక దేశాలు వాడటంతో అంతటా ద్రవ్యోల్బణం పెరిగి పోతుంది. అయితే ప్రస్తుతం యుద్ధం ఆగిపోయింది కనుక హార్ముజ్ మూసివేత నిర్ణయాన్ని విరమించినట్టు వస్తున్న వార్తలు నిజమైతే అదే పదివేలు!

## బీఎస్ఎన్ఎల్ ఫ్లాష్ సేల్ త్వరలో..

ప్రభుత్వ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ త్వరలో ఫ్లాష్ సేల్ నిర్వహించనుంది. తన సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా ఈ విషయాన్ని ప్రకటించింది. ఈ ఫ్లాష్ సేల్ ద్వారా వినియోగదారులకు ఉచిత డేటా, బ్రాడ్ బ్యాండ్ డీల్స్ లేదా డిస్కౌంట్లు లభించనున్నాయి. దేశంలో ఇటీవలే 5జీ సేవలను ప్రకటించిన బీఎస్ఎన్ఎల్.. పోస్ట్ పెయిడ్, ప్రీపెయిడ్ సిమ్ కార్డుల డోర్ డెలివరీని కూడా ప్రారంభించింది. తాజాగా వినియోగదారులను మరింత ఆకట్టుకునేందుకు త్వరలో బీఎస్ఎన్ఎల్‌ఫ్లాష్ సేల్ ఉంటుందని ప్రకటించింది. ఫ్లాష్ సేల్ గురించి బీఎస్ఎన్ఎల్ ఎక్స్ (ట్విట్టర్) లో టీజర్‌ను పోస్ట్ చేసింది. దానితో పాటు ఉన్న వీడియో క్లిప్ ఇలా ఉంది.. "ఏదో పెద్దది ల్యాండ్ కాబోతోంది! ఊహించని అనుభూతిని అనుభవించడానికి మీరు సిద్ధంగా ఉన్నారా?" అయితే ఫ్లాష్ సేల్ తేదీని మాత్రం వెల్లడించకుండా త్వరలోనే రానుందని పేర్కొంది. సేల్ సమయంలో ఎలాంటి ఆఫర్లు ఉంటాయో ఊహించండి అంటూ టీజ్ చేసింది. టీజర్ ప్రకారం బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు ఉచిత డేటా, బ్రాడ్ బ్యాండ్ డీల్స్ లేదా భారీ డిస్కౌంట్లు లభించవచ్చు. వేగంగా వినియోగదారులను కోల్పోతున్న నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ఈ ఫ్లాష్ సేల్ చేపడుతుండటం గమనార్హం. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఇటీవల విడుదల చేసిన టెలికాం సబ్‌స్క్రిప్షన్ డేటా ప్రకారం ఏప్రిల్లో బీఎస్ఎన్ఎల్ మొత్తం 2 లక్షల మంది యూజర్లను కోల్పోయింది. ఇదే కాలంలో యాక్టివ్ బీఎస్ఎన్ఎల్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1.8 మిలియన్లు తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## చైనాతో భారత్ దోస్తానా..

- సరిహద్దు ఉద్రిక్తతల పరిష్కారానికి 4-పాయింట్ ఫార్ములా
- ఇరు దేశాల ద్వైపాక్షిక భేటీలో రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదన

పునఃప్రారంభిచడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిహార్ ప్రత్యేక మదుబనీ పెయింటింగ్‌ను చైనా మం త్రికి రాజ్‌నాథ్ కానుకగా అందించారు. షాంఘై సహకార సంస్థ' (ఎస్‌సీఓ) సభ్య దేశాల రక్షణ మంత్రుల సదస్సులో పాల్గొనేం దుకు రాజ్‌నాథ్ చైనా వెళ్లారు. బుధవారం ఈ సదస్సులో పాల్గొన్న ఆయన.. జాయింట్ డాక్యుమెంట్‌లో పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, పహల్గాం ముష్కర దాడులను మచ్చుకైనా ప్రస్తావించకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించారు. దీంతో ఉమ్మడి ప్రకటన లేకుండానే గురువారం చర్చలు ముగిశాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
28 జూన్ 2025
తెలంగాణ

# దుబ్బాకలో తరుచు ప్రొటోకాల్ రగడ

- మంత్రులు వచ్చరంటే ప్రోటోకాల్ పేరుతో రచ్చరచ్చే
- పార్టీల అధిపత్య పోరుకు కేంద్రాలుగా మారుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు
- జనాల ముందే పార్టీల కార్యకర్తల బలప్రదర్శన ...
- రాష్ట్రంలో ఎక్కడలేనంత ప్రోటోకాల్ వివాదాలు
- ప్రభుత్వ కార్యక్రమం చేయలంటే చాలు తలలు పట్టుకుంటున్న అధికారులు





చాడ వేణుగోపాల్ రెడ్డి (ప్రత్యేక ప్రతినిధి, జనం సాక్షి) :

*దుబ్బాక నియోజకవర్గం... ఈ నియోజకవర్గానికి మంత్రులు రావలంటే ఒకటికి రెండుసార్లు అలోచించే పరిస్థితి వస్తుంది ... కారణం కార్యక్రమం ఏదైనా ప్రోటోకాల్ పేరుతో రగడ జరిగి తీరాల్సిందే.. పేరుకుప్రభుత్వ కార్యక్రమాలే గాని .. అక్కడ జరిగేదే అంతా ప్రోటోకాల్ రచ్చనే. ఎంతలా అంటే ఈ మధ్య దుబ్బాక అంటేనే ప్రోటోకాల్ పేరుతో నిత్యం నడిచే గొడవలతో తరుచు వార్తల్లోకి ఎక్కుతుంది. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా తరుచుగా దుబ్బాకలోనే ప్రోటోకాల్ గొడవలకు జరగడానికి కారణం ఏంటి ... అభివృద్ధి విషయంలో అధికార ,ప్రతిపక్ష నాయకులు కలిసి పని చేసే ఛాన్స్ లేదా ...దుబ్బాక నియోజకవర్గ ప్రొటోకాల్ రగడపై జనంసాక్షి ప్రత్యేక కథనం ....*

సిద్ధిపేట జిల్లా దుబ్బాక ప్రాంతం కు రాష్ట్రంలోని ప్రత్యేక పేరు ఉంది. అనేక ఉద్యమాలకు కేంద్రంగా, అభ్యుదయ భవాలు కల్గిన ప్రాంతంగా దుబ్బాకకు ప్రత్యేక స్థానం ఉన్నది. ఎన్నో ఉద్యమాలు నడిచిన దుబ్బాక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమాల గడ్డను తరచూ ప్రోటోకాల్ రగడలతో వివాదలతో తరుచు వార్తల్లోకి ఎక్కుతుంది.

దుబ్బాకలో ప్రోటోకాల్ వివాదలు జరగడానికి ప్రసుత్తం అక్కడ ఉన్న విభిన్న రాజకీయ పరిస్థితులు ముఖ్య కారణంగా కన్పిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యే గా ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నుంచి కొత్త ప్రభాకర్ రెడ్డి గెలవడం, 2024 పార్లమెంట్ ఎన్ని కల్లో మెదక్ ఎంపీగా గతంలో దుబ్బాక ఎమ్మెల్యేగా పనిచేసినా బిజెపీ ఎంపీ రఘునందన్ రావు గెలవడం, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి పోటి చేసి ఓడిపోయిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి క్రీయశీలకంగా ఉండటంతో దుబ్బాకలో భిన్న రాజకీయ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే, ఎంపీ, అధికార పార్టీ నాయకుడు వేరు వేరు పార్టీలకు ప్రతినిధ్యం వహిస్తుండటంతో ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ సమస్య అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా మాజీ మంత్రి ముత్యం రెడ్డి తనయుడు చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఇక్కడ ప్రభుత్వ కార్యక్రమాల్లో కన్పిస్తుండటంతో అగ్ని అజ్యం పోసినట్టు వేదిక ఏదైనా ప్రొటోకాల్ రచ్చ సాధరణంగా మారింది.

అధికారిక కార్యక్రమాల్లో ఏకంగా స్టేజీల మీదనే కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపి నాయకులు బాహిబాహిగా నినాదాలు చేసుకోవడం గమనర్హం. తమ నాయకుడికి ప్రాదన్యత ఇవ్వడం లేదనే కారణం చూపుతు కాంగ్రెస్, బిఅర్ఎస్ .బిజేపీ పార్టీ నాయకులు గొడవలకు దిగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ఏ పదవి లేకున్న కుడా ప్రభుత్వ కార్యక్రమాల స్టేజి మీదకు ఎలా పిలుస్తరంటూ బిఅర్ఎస్, బిజెపీ పార్టీ నాయకులు అభ్యంతరం తెలుపతుండటంతో గొడవ మొదలౌతుంది. తర్వాత పార్టీల కార్యకర్తల పోటాపోటి నినాదలు, తోపులాటలు కామన్గా కన్పిస్తున్నాయి. ప్రభుత్వం తరుపున కళ్యాణ లక్ష్మి చెక్కులు, సిఎం రిలిఫ్ ఫండ్ చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ...ఇలా కార్యక్రమం ఏదైనా ప్రతిసారి ప్రొటో కాల్ విషయంలో రగడ జరుగుతోంది. క్రెడిట్ కోసం కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపీల పార్టీ మధ్య అధిపత్య పోరు ప్రభుత్వ కార్యక్రమాలనే వేదికగా చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడినప్పటికి నుండి మంత్రులు దుబ్బాక నియోజకవర్గ పర్యటనకు మంత్రులు వచ్చరంటే చాలు ప్రోటోకాల్ పంచాయతీ పేరుతో కార్యక్రమంను రచ్చ రచ్చ చేస్తున్నారు. పాత ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, కొత్తగా వచ్చిన గడ్డం వివేక్ వచ్చినా ప్రతిసారి లబ్ధిదారుల ముందే పార్టీ నినాదలు, తమ నాయకులకు జై కొడుతూ పార్టీ కార్యకర్తలు చేసే రచ్చ అంతా ఇంతా కాదు. అసలు కార్యక్రమం పక్కకు పోయి ప్రొటోకాల్ పంచాయితీతోనే ప్రోగ్రాం ముగుస్తుంది. దింతో మంత్రుల పర్యటన అంటేనే ప్రొటోకాల్ గొడవల కారణంగా దుబ్బాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పోలిసులు అదనపు బందోబస్తును ఏర్పాటు చేసి కార్యక్రమంను సజావుగా సాగేలా నాన తిప్పలు పడుతున్నారు. ఒకరు తాజా ఎమ్మేల్యే ,మరోకరు మాజీ ఎమ్మేల్యే, ప్రస్తుత ఎంపీ, ఇంకొకరు అధికార పార్టీ కి చెందిన నేత ఇలా ముగ్గరికి సంత్రప్తి పరుస్తూ, అందరిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ కార్యక్రమాలను సక్రమంగా జరిపించడం అధికారులకు పెద్ద టాస్క్ గా మారింది. కార్యక్రమం కోసం పెట్టే ప్లెక్సీ నుండి మొదలు సభ ముగింపు వరకు ఏ చిన్న సమస్య వచ్చినా కార్యక్రమం మొత్తం రసాభసగా మారుతుంది. దింతో దుబ్బాక అధికారుల పరిస్థితి ముందు నుయ్యి..వెనుక గొయ్యి అన్నట్టు తయారైంది.

**పదవిస్తేనే ప్రోటోకాల్ సమస్యకు చెక్...**
**నామినేటడ్ పదవి ఇవ్వాలి**

2023 జనరల్ ఎన్నికల్లో శ్రీనివాస్ రెడ్డి ఓటమి పాలైన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మంత్రుల ద్వారా నియోజకవర్గనికి ఫండ్ తెచ్చి పలు అభివృద్ధి పనులు శ్రీకారం చూడుతున్నాడని, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ప్రోటోకాల్ పదవి లేకపోవడంతో కార్యకర్తల్లో ఉత్సహం లేకుండా పోయింది. చెరుకు శ్రీనివాస్ రాష్ట్రస్థాయిలో నామినేట్ పోస్ట్ ఇస్తే ప్రోటోకాల్ ఉండటంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు మరింత దోహదపడుతుందని, అంతేకాక ఇక్కడ ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి గట్టి చెక్కు పడే అవకాశం ఉందని కాంగ్రెస్ కార్యకర్తలు అనుకుంటున్నారు. తరచూ ప్రోటోకాల్ సమస్య తీరాలంటే చెరుకు శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్రస్థాయిలో పదవి ఇవ్వాలని చాలా రోజులుగా కార్యకర్తలు కాంగ్రెస్ అధిష్టానంను కోరుతున్నారు.

**పార్టీ వేరు ...ప్రభుత్వం వేరు**

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరుపున ఏ కార్యక్రమం చేసినా తమకు అభ్యంతరం లేదు ...కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రచారం చేస్తే మాకు ఏ మాత్రం ఇబ్బంది లేదు. కానీ ప్రజల చేత ఎన్నికైనా ప్రజాప్రతినిధులకు మాత్రమే ప్రభుత్వ కార్యక్రమ వేదికలపై అనుమతి ఉటుంది. అంతే గాని కాంగ్రెస్ ప్రభుత్వం పేరుతో ఎలాంటి పదవి లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు వేదిక మీద కూర్చోవడం సరికాదు. పార్టీ వేరు ...ప్రభుత్వం వేరు ....ప్రజల ద్వార ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులకు గౌరవించలని బిఅర్ఎస్, బిజెపీ నాయకులు కొరుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమం ఏదైనా ప్రజల కోసమే తప్ప పార్టీ కోసం కాదనే విషయంను ... గుర్తించుకోవాలని బిఅర్ఎస్ ,బిజేపీ నాయకులు హితవు పలుకుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా ప్రొటోకాల్ పేరుతో మూడు ప్రదాన పార్టీల క్యాడర్ గొడవలకు దిగడంతో దుబ్బాక రాజకీయాలు ఎప్పుడు టెన్షన్ గానే ఉంటున్నాయి. పార్టీల పేరుతో కింది స్థాయి కార్యకర్తలు గొడవలకు దిగడంతో ఎప్పుడు ఏమి అవుతుందో అర్ధం కాని పరిస్థితి దుబ్బాకలో ఉన్నది.

అయితే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కి నామినేటడ్ పదవి వచ్చేది ఎప్పుడో.. ఈ ప్రొటోకాల్ రచ్చ పోయేదెపుడో అని దుబ్బాక అధికారులు , ప్రజలు అనుకుంటున్నారు . అధికార పార్టీ నాయకులయినా ,ప్రతిపక్ష పార్టీ నాయకులయినా అభివృద్ధి విషయంలో పోటి పడాలి గాని .. అధిపత్యం కోసం బలపదర్శన చేయవద్దని ప్రజలు కొరుకుంటున్నారు.

## హెూం గార్డ్స్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక దృష్టి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 27 (జనంసాక్షి) :** జిల్లాలో పని చేస్తున్న హెూం గార్డుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని డిజిపి కార్యాలయం నుండి వచ్చిన ఉలెన్ జాకెట్స్, రెయిన్ కోట్స్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెూమ్ గార్డ్స్ పోలీసు శాఖలో అంతర్గత భాగమన్నారు. పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారని,ప్రతి పోలీస్ స్టేషన్లో పోలీసు సిబ్బందితో బాటు విధులు నిర్వహిస్తున్నారన్నారు.క్లిష్ట పరిస్థితులలో కూడా వివిధ బందోబస్తు విధుల్లో చాలా సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. హెూమ్ గార్డ్స్ అధికారులు,సిబ్బంది ఎవరికైన సమస్యలు ఉంటే నేరుగా తనని కలవాలన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. నిరంతరం ఎండనకా, వాననకా రాత్రింబవళ్ళు కష్టపడి పని చేసే సిబ్బందికి అత్యవసర సమయాలలో ఉలెన్ జాకెట్స్, రెయిన్ కోట్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో పనిచేస్తూ నిబంధనలు ఉల్లగింస్తే భవిష్యత్తులో శాఖ పరమైన ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఆయన వెంట ఆర్ఐలు యాదగిరి, మధుకర్, హెూమ్ హార్డ్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో జిపి ఉద్యమాన్ని ఆపలేరు

### జీపీ కార్మికులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు



**స్టేషన్ ఘన్పూర్, జూన్ 26 (జనం సాక్షి) :** అక్రమ అరెస్టులతో జిపి ఉద్యమాన్ని ఆపలేరని జిపి కార్మిక, ఉద్యోగ సంఘం చిల్పూర్ మండల అధ్యక్షుడు జీడి ఆనందం,ప్రధాన కార్యదర్శి గుగులోత్ రతన్ సింగ్ అన్నారు. గ్రామపంచాయతీ పంచాయతి కార్మికులు, కారోబార్ ల సమస్యలు పరిష్కారంకోసం హైదరాబాద్ లోని పంచాయతీ కమీషనర్ ఆఫీస్ ముట్టడి కార్యక్ర మం లో భాగంగా పంచాయతీ కార్మికులు హైదరాబాద్ కు పోకుండా ముందస్తు అరెస్ట్ లు చేయడం చిల్పూర్ మండల జిపి కార్మికుల సంఘం తీవ్రంగా ఖండించింది. శుక్రవారం చలో హైదరాబాద్ పోకుండా గ్రామపంచా యతీ కార్మికులను, కారోబార్ లను పోలీసులు ముంద స్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జిపి కార్మిక, ఉద్యోగ సంఘం చిల్పూర్ మండల అధ్యక్షుడు జీడి ఆనందం,ప్రధాన కార్యదర్శి గుగులోత్ రతన్ సింగ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల రాష్ట్ర కాంగ్రెస్ ప్రభు త్వం వ్యవహరిస్తుందని అన్నారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన గ్రామపంచా యతీ కార్మికుల డిమాండ్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్ని ఆటంకాలు కల్పించిన పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయంఎదుట ధర్నా జరిగి తీరుతుందని, అక్రమ అరెస్టులు కాదు చేతనైతే సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో జిపి కార్మిక,ఉద్యోగసంఘం చిల్పూర్ మండల అధ్యక్షు డు జీడి ఆనందం,ప్రధాన కార్యదర్శి గుగులోత్ రతన్ సింగ్, సభ్యులు శ్రీనివాస్, సురేష్, కుమారస్వామి, వెంకన్న, హరిలాల్, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.



## వకీల్పల్లి గనిని తనిఖీ చేసిన డిఎంఎస్ అధికారులు

**యైటీంక్లయిన్ కాలని జూన్, 27 (జనంసాక్షి):** సింగరేణి ఆర్జీ-2 ఏరియాలోని వకీల్ గనిని డీఎంఎస్ (ఎలక్ట్రికల్) రాజ్ కుమార్, డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్ )కోమల్ చౌదరిలు శుక్రవారం సందర్శించారు. ముందుగా వారు ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో సర్వే మ్యాప్ ద్వారా గని పని ప్రదేశాలను పరిశీలించారు. ఆనంతరం గని లోనికి దిగి 4సిమ్ ఎస్ఎస్-4 డిస్ట్రిక్లను తనికి చేశారు. రక్షణ పరమైన చర్యలు సమర్ధవంతంగా నిర్వహించాలని వారు అధికారులకు సూచించారు. వారి వెంట గని ప్రాజెక్ట్ అధికారి ఏ.నెహ్రూ, ఏరియా ఇంజినీర్ సుజన్ మెహ్రా, డీజీఎం (ఇఅండ్ఎం) వెంకటరాంరెడ్డి, గని మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ జి.కె.రెడ్డి, పిట్ ఇంజినీర్ ఫణి కుమార్, గని రక్షణ అధికారి రామ్ కుమార్, సర్వేయర్ రహమత్ అలీ ఉన్నారు.

## పేకాట, మట్కా అడితే చట్టరీత్యా కటిన చర్యలు

### పట్టణ సిఐ జీ సంతోష్ కుమార్



**తాండూరు జూన్ 27(జనంసాక్షి) :** ప్రభుత్వ నిషేధిత పేకాట, మట్కా అడితే చట్టరీత్యా కటిన చర్యలు తప్పవని పట్టణ సిఐ జీ. సంతోష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వినాయక్ చౌక్ ఏరియాలో సమచారం మేరకు మట్కా నిర్వహిస్తున్న షేక్ అబ్దుల్ సత్తార్ తండ్రి అబ్దుల్ మజీద్, మరియు. మహ్మద్ షఫీ తండ్రి అబ్దుల్ రెహ్మాన్ లను పట్టుకొని అతని వద్ద నుండి 4120 రూపాయలు మరియు మట్కా చిట్టీలు స్వాధీనం చేయడం జరిగిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామన్నారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం





- ఇందిరమ్మ రాజ్యంలో సామాన్యులకు న్యాయం
- మహిళా శక్తి క్యాంటీన్లతో ఆర్థికాభివృద్ధి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**పాలకుర్తి, జూన్ 27(జనంసాక్షి) :** మార్పు కావాలనే ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకు వచ్చారని, ఈ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుస్తామని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్భాష షేక్తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత జాగ ఉండి ఇల్లు కట్టుకునే వారికి ప్రభుత్వం రూ. 5 లక్షలు మంజూరి చేస్తుందని అన్నారు. నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుపేదల కలను ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అశీస్సులతో సాకారం చేస్తున్నామని స్పష్టం చేశారు. నిలువ నీడలేని పేదలకు సొంత జాగ ఉంటే ఎలాంటి సిఫారసులు అవసరం లేదని అన్నారు. రాబోయే నాలుగున్నరేళ్లలో 20 లక్షల ఇండ్లు నిర్మించడే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో మొదటి విడతలో 3500 ఇండ్లు మంజూరి చేసినట్లు, ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. పుట్టిన బిడ్డ నుంచి పెళ్లి చేసి అత్తారింటికి పంపేవరకు ఏదో పథకం కింద లబ్ది చేకూరిస్తున్నామని అన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు ద్వారా మహిళలు ఆర్థిక స్వాలంబన సాదించడంతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పిస్తారని దీంతో వారు కూడా ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ఒక్కో క్యాంటీన్లకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు వరకు ఎలాంటి పూచి కత్తులేకుండా, వడ్డీ లేకుండా బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయని గుర్తు చేశారు. గత సంవత్సరం బస్సు ప్రమాదంలో మృతి చెందిన ఎండి, నజియా కుటుంబానికి రూ.10 లక్షలు, లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన గూడ విజయ ఆటో ప్రమాదంలో మృతి చెందగా రూ. 10 లక్షలు చెక్కులను కుటుంబ సభ్యులకు అందచేశారు. సహజ మరణం చెందిన ఆరుగురు మహిళా సభ్యులకు రూ.6 లక్షల రుణం మాఫీ కూడా చేశారు. అనంతరం కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను కూడా అందచేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ వసంత, ఏపీడీ నూరోద్దిన్, డీపీఎం రాజేంద్రప్రసాద్, శ్రీనిధి ఆర్ఎం. నిర్మల, తహసీల్దార్ నాగేశ్వరాచారి, ఎంపీడీవో ఆవుల రాములు, ఏపీఎం నరేందర్, వెంకన్న ఉన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సుడా ఛైర్మన్



**కరీంనగర్ బ్యూరో, జూన్ 27 (జనంసాక్షి) :**

శుక్రవారం రోజు పలు అభివృద్ధి పనులకు సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సప్తగిరి కాలనిలోని కోదండ రామాలయం పక్కన సప్తగిరి కాలని కమ్యూనిటీ భవన నిర్మాణానికి పది లక్షలు కేటాయించి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కిసాన్ నగర్ లోని క్రిస్టియన్ స్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మాణానికి పది లక్షలు మంజూరు చేసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... స్థానిక నాయకుల, ప్రజల కోరిక మేరకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి ఒకవైపు సంక్షేమం ఒకవైపు కొనసాగుతోందని రాబోయే రోజుల్లో ఇంకా నిధులు వెచ్చించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, దిండిగాల మహేష్, తుమ్మల రమేష్ రెడ్డి, గౌతమ్ రావు, రామయ్య, కేశవరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందే

- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్




**హైదరాబాద్, (జనంసాక్షి) :**

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కామారెడ్డి బహిరంగ సభలో,ఎన్నికల ప్రచారంలో, మేనిఫెస్టోలో బీసీలకిచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు,విద్యా, ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందేనని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. ఇందుకోసం బాధ్యతగల ప్రతిపక్షంగా తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, కాంగ్రెస్ పాలకులు,నాయకత్వంతో మరింత వత్తిడి పెంచుతూనే ఉంటుందన్నారు.ఎంపీ వద్దిరాజు శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, సీనియర్ నాయకులు చిరుమళ్ల రాకేష్, ఉపేంద్రాచారి,కోతి కిశోర్ గౌడ్ లతో కలిసి శుక్రవారం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కాంగ్రెస్ పాలనలో బీసీలకు అన్ని రంగాలలో తీరని అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు మంత్రిమండలిలో కేవలం మూడంటే మూడు పదవులు మాత్రమే ఇవ్వడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు.మున్నూరుకాపు,యాదవ, ముస్లిం, లంబాడీ కుర్మ,చాకలి కులాల వారికి మంత్రివర్గంలో చోటివ్వక పోవడం బాధాకరమని ఎంపీ రవిచంద్ర అన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన హయాంలో బీసీలకు సముచిత ప్రాధాన్యతనిచ్చి గౌరవించారని చెప్పారు. అసెంబ్లీ స్పీకర్గా మధుసూదనాచారి, శాసనమండలి ఛైర్మన్గా స్వామిగౌడ్, మంత్రులుగా ఈటల రాజేందర్,గంగుల కమలాకర్,జోగు రామన్న,తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, పద్మారావు గౌడ్,తనతో పాటు కేశవరావు,డీ.శ్రీనివాస్,బండా ప్రకాష్ ముదిరాజ్ లను రాజ్యసభకు పంపి గౌరవించారని పేర్కొన్నారు. హైదరా బాద్ మహానగర మేయర్లుగా బొంతు రాంమోహన్, విజయలక్ష్మీ తదితరులకు పదవులిచ్చారని ఎంపీ వద్ది రాజు వివరించారు.కేసీఆర్ సుపరిపాలనకు పూర్తి భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని, కులగణన సందర్భంగా కూడా బీసీల జనాభాను తక్కువ చేసి చూపారని గుర్తు చేశారు.తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించాలని, ఇందుకోసం కాంగ్రెస్ పాలకు లు కేంద్ర ప్రభుత్వంపై మరింత వత్తిడి పెంచాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్స్ సాధించుకునేందుకు ఇదే సరైన సమయమని, ఇందుకు బీసీ కులాల వారందరం మరింత ఐక్యతతో పోరాడుదామని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.బీసీలకు 42% రిజర్వేషన్స్ సాధనకు ప్రధాని నరేంద్రమోడీ వద్దకు వెంటనే అఖిలపక్షాన్ని తీసుకువెళ్లి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేలా చిత్తశుద్ధితో కృషి చేయాల్సి ఒదిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు.బీసీలకు 42% రిజర్వేషన్స్ కోసం యుపీఏ పక్షాలతో కూడి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీవ్రతరం చేయాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ నాయకత్వంపై ఉందన్నారు.పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు బీసీల పక్షాన బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని ఎంపీ వద్దిరాజు హామీనిచ్చారు.

## ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తాం

### ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం మంథని నియోజకవర్గ పరిధిలోని కాటారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభించి, సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల ప్రాథమిక పాఠశాలలకు సిఎస్ఆర్ నిధుల ద్వారా విద్యార్థుల కోసం 600 డ్యూయల్ డెస్క్ బెంచీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలకు కావలసిన అవసరాలు గురించి మంత్రి ఉపాధ్యాయులనుఅడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తయారు చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా రెండు జతల బట్టలు, పుస్తకాలు, అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెంచేందుకు మొట్టమొదటి సారిగా కాటారం మండలం నుండి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను, ఉపాధ్యాయులను సంక్రాంతి, దసరా సెలవుల్లో హైదరాబాద్, ఢిల్లీ లాంటి నగరాలకు తీసుకువెళ్ళే కార్యక్రమం చేపడతామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలను తలదన్నేలా విద్యార్థులు విద్యను అభ్యసించాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క విద్యార్థి ఇంగ్లీషులో మాట్లాడాలని చక్కగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. జిల్లా, మండల స్థాయి విద్యా శాఖ అధికారులు ప్రతి పాఠశాలను పరిశీలించాలని ఆదేశించారు. పాఠశాలలకు కావలసిన సౌకర్యాలు, అవసరాలు గురించి తెలుసుకొని నివేదికలు అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అధునాతంగా తీర్చి దిద్దడానికి సహకరించాలని ఆదేశించారు. కాటారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల అధ్యాపకులు కోరిన విధంగా ప్రహరీ గోడ పునర్నిర్మాణం, సైన్స్ ల్యాబ్ కెమికల్స్ ను అందిస్తామని అన్నారు. లైబ్రరీ లో పుస్తకాలు, బెంచీలు, కంప్యూటర్ లను సమకురుస్తామని మంత్రి తెలిపారు. హై స్కూల్ లలో కూడా డ్యూయల్ డెస్క్ బెంచీలు అందించడానికి విద్యాశాఖ అధికారులు నివేదిక ఇవ్వాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**వన్డే సిరీస్..**
తొలి వన్డే: అక్టోబర్ 19 - పెర్త్ స్టేడియం
రెండో వన్డే: అక్టోబర్ 23 - అడిలైడ్ ఓవల్
మూడో వన్డే: అక్టోబర్ 25 - సిడ్నీ క్రికెట్ స్టేడియం

**టీ20 సిరీస్...**
తొలి టీ20: అక్టోబర్ 29 - కాన్‌బెర్రా
రెండో టీ20: అక్టోబర్ 31 - మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్
మూడో టీ20: నవంబర్ 2 - హోబార్ట్
నాలుగో టీ20: నవంబర్ 6 - గోల్డ్ కోస్ట్ స్టేడియం
ఐదో టీ20: నవంబర్ 8 - గబ్బా క్రికెట్ స్టేడియం



# త్వరలోనే ఆసీస్‌కు టీమిండియా

### రోహిత్ ,కోహ్లీలు జట్టులో చేరే అవకాశం

ప్రతిష్ఠాత్మక టీ 20 ప్రపంచకప్‌కు ముందు భారత జట్టు ఎక్కువగా టీ20లు, వన్డేలు ఆడడంపైనే దృష్టి సారించింది. ఈ క్రమంలోనే టీమిండియా ఆస్ట్రేలియాలోనూ పర్యటించనుంది. అక్కడ ఆతిథ్య జట్టుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్, ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతుంది. వన్డే సిరీస్ అక్టోబర్ 19, 2025న పెర్త్ నుండి ప్రారంభమై అక్టోబర్ 25న సిడ్నీలో ముగుస్తుంది. ఆశ్చర్యకరంగా ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా వన్డే, టీ20 సిరీస్‌ల అన్ని మ్యాచ్‌ల టిక్కెట్లు అమ్ముడయ్యాయని వార్తలు వస్తున్నాయి. బహుశా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా వన్డే సిరీస్‌లో ఆడనుండడం దీనికి కారణం కావొచ్చు. వన్డే సిరీస్ తర్వాత, రెండు జట్లు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడతాయి, ఇది అక్టోబర్ 29న కాన్‌బెర్రాలో ప్రారంభమై నవంబర్ 8న బ్రిస్బేన్‌లో ముగుస్తుంది. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ సిరీస్, రాబోయే టీ20 ప్రపంచ కప్‌కు సన్నద్ధమయ్యేందుకు మంచి అవకాశం.

**కోహ్లీ-రోహిత్‌ల కోసం..**

అక్టోబర్-నవంబర్ నెలల్లో జరగనున్న ఇండియా-ఆస్ట్రేలియా వన్డే సిరీస్ కోసం క్రికెట్ అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. "సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే వన్డే, కాన్‌బెర్రాలోని టీ20ఐ టిక్కెట్లు నాలుగు నెలల ముందుగానే అమ్ముడయ్యాయి. ఇది ఈ మ్యాచ్‌లకు అధిక డిమాండ్‌ను సూచిస్తోంది. ఈ మ్యాచ్‌లు మాత్రమే కాకుండా, ఎంసిజిలో జరిగే టీ20 , గబ్బాలో జరిగే టీ20ఐలకు కూడా అధిక డిమాండ్ ఉంది" అని క్రికెట్ ఆస్ట్రేలియా ఒక ప్రకటనలో తెలిపింది.

# మాజీ ఛాంపియన్‌కు షాకిచ్చిన అద్వానీ





ప్రతిష్ఠాత్మక ఆసియా స్నూకర్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టు వరుస విజయాలతో దూసుకెళ్తోంది. వరల్డ్ ఛాంపియన్ పంకజ్ అద్వానీ సారథ్యంలోని బృందం సెమీ ఫైనల్లో అడుగు పెట్టింది. శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో ఖతార్‌పై జయభేరి మోగించింది భారత్. ఏకపక్షంగా సాగిన పోరులో 3-0తో ప్రత్యర్థిని చిత్తు చేసి టైటిల్‌కు మరింత చేరువైంది ఇండియా. కొలంబో వేదికగా జరుగుతున్న ఆసియా స్నూకర్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత జట్టు అదరగొడుతోంది. వరుసపెట్టి ప్రత్యర్థులకు చెక్ పెడుతూ సెమీస్ చేరుకుంది. ఉదయం నిర్వహించిన తొలి సెషన్లో భారత త్రయం తమ ఆఖరి గ్రూప్ సీ మ్యాచ్‌లో హాకాంగ్ -2 టీమ్‌ను మట్టికరిపించి నాకౌట్ దశకు అర్హత సాధించింది. అనంతరం వరల్డ్ గేమ్స్ మాజీ గోల్డ్ మెడలిస్ట్ బషర్ అబ్దుల్ మజీద్‌కు పంకజ్ షాకిచ్చాడు. ఇక డబుల్స్‌లో అద్వానీ, బ్రిజేష్ దమని ద్వయం 72-5తో అల్ ఒబైదిల్ మజీద్ జంటను ఓడించారు. హాంకాంగ్ -1, బహ్రెయిన్ మ్యాచ్ విజేతను తర్వాత రౌండ్‌లో భారత స్నూకర్ టీమ్ ఢీకొననుంది.

# కొత్త రూల్స్ ప్రవేశపెట్టిన ఐసీసీ

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) నయా రూల్స్ ప్రవేశపెట్టింది. ఆటను మరింత రసవత్తరంగా మార్చేందుకు ఈ రూల్స్‌ను తీసుకొచ్చింది. వీటిలో కొన్ని రూల్స్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో అమలు కానుండగా.. మరికొన్ని జూలై 2 నుంచి అమలులోకి రానున్నాయి.ఇప్పటికే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో స్టాప్ క్లాక్ రూల్‌ను అమలు చేస్తున్నారు. స్లో ఓవర్ రేట్‌ను కట్టడి చేసేందుకు ఐసీసీ ఈ రూల్ తీసుకొచ్చింది. ఈ రూల్ ప్రకారం ఓవర్ ముగిసిన తర్వాత మరో ఓవర్‌ను 60 సెకన్లలో మొదలుపెట్టాల్సి ఉంటుంది. తాజాగా టెస్ట్ క్రికెట్‌లోనూ ఈ స్టాప్ క్లాక్ రూల్‌ను ఐసీసీ ప్రవేశ పెట్టింది. ఈ రూల్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27తోనే అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. ఈ రూల్ ఉల్లంఘిస్తే అంపైర్లు రెండు సార్లు వార్నింగ్ ఇస్తారు. మూడో సారి కూడా రిపీట్ అయితే ఐదు పరుగులు పెనాల్టీగా విధిస్తారు. బ్యాటింగ్ జట్టుకు అదనంగా 5 పరుగులు ఇస్తారు. అదే సమయంలో బౌలింగ్ జట్టు నుంచి 5 పరుగులను కట్ చేస్తారు. అయితే ప్రతీ 80 ఓవర్ల తర్వాత ఈ రూల్ రీస్టార్ట్ అవుతుంది. వన్డే, టీ20ల్లో ఈ రూల్ 2024 జూన్ నుంచే అమలు చేస్తున్నారు.ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో రెండు బంతులు వాడుతున్నారు. ఇన్నింగ్స్ ప్రారంభం నుంచి 50 ఓవర్ల వరకు రెండు బంతులు ఉపయోగిస్తున్నారు. ఐసీసీ సవరించిన రూల్ ప్రకారం 34 ఓవర్ల వరకే రెండు కొత్త బంతులు వాడాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఈ రెండు బంతుల్లో నుంచి ఒక్క బంతిని మాత్రమే ఉపయోగించాలి. బంతుల ఆకారం దెబ్బతినకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అనివార్య కారణాలతో మ్యాచ్ 35 ఓవర్లు లేదా అంతకు లోపే కుదించితే ఒక్క బంతితోనే ఆడాల్సి ఉంటుంది. ఈ రూల్ జులై 2న జరగనున్న శ్రీలంక- బంగ్లాదేశ్ మ్యాచ్?తో అమల్లోకి రానుంది.బౌండరీ లైన్‌పై ఫీల్డర్లు చేసే క్యాచ్ విన్యాసాలపై ఐసీసీ ఆంక్షలు విధించింది. ముఖ్యంగా ఫీల్డర్ బంతిని క్యాచ్ పట్టి.. ఆ తర్వాత సమన్వయం కోల్పోయి బౌండరీ లైన్ దాటినప్పుడు బంతిని గాల్లోకి విసిరేసి మళ్లీ అందుకోవడం చేస్తుంటారు. గతంలో బౌండరీ లైన్‌పై నేలకు తాకకుండా బంతిని ఎన్నిసార్లు పట్టుకున్నా అనుమతించేవారు. కానీ ఇక నుంచి బౌండరీ లైన్ ధాటరంటే.. మళ్లీ లోపలికి వచ్చి మాత్రమే బంతిని పట్టుకోవాలి. అలా అందుకుంటే సిక్సర్‌గానే పరిగణిస్తారు. ఒకే ప్రయత్నంలో బంతిని లోపలికి వేసి వచ్చి క్యాచ్ అందుకోవాలి. కరోనా సమయంలో బంతికి సెలైవా(ఉమ్మి) రాయడాన్ని ఐసీసీ నిషేధించింది.

ఐపీఎల్ 2025 సీజన్‌లో ఈ నిషేధాన్ని ఎత్తివేసినా.. అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగు తోంది. అయితే బౌలింగ్ టీమ్ బంతి మార్పు కోసం ఉద్దేశ పూర్వకంగా ఉమ్మి రాసినా.. మార్చడం తప్పనిసరి కాదు. బంతి మార్పు అనేది అంపైర్లు తుది నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.ఉద్దేశపూర్వకంగా షార్ట్ రన్ తీస్తే.. ప్రస్తుతం ఉన్న ఐదు పరుగుల పెనాల్టీ రూల్ కొనసాగుతుంది. అయితే, ఇప్పుడు బౌలింగ్ జట్టు తదుపరి డెలివరీకి ఏ బ్యాటర్ స్ట్రైక్‌లో ఉండాలో ఎంచుకోవచ్చు. వ్యూహాత్మకంగా షార్ట్ రన్స్ తీసుకోవడాన్ని నిరోధించేందుకు ఐసీసీ ఈ రూల్ తీసుకొచ్చింది. ప్రస్తుతం నో బాల్‌కు ఫీల్డర్ క్యాచ్ పడితే.. క్యాచ్ సరిగ్గా పట్టారా లేదా? అనేది పరిశీలించేవారు కాదు. కానీ ఇకపై నోబాల్ క్యాచ్‌లను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తారు. క్యాచ్ సరిగ్గా పడితే నోబాల్ ద్వారా వచ్చే ఒక్క పరుగు మాత్రమే ఇస్తారు. ఒకవేళ క్యాచ్ సరిగ్గా పట్టకపోతే.. బ్యాటింగ్ జట్టు ఎన్ని పరుగులు తీస్తే అన్ని పరుగులతో పాటు నోబాల్ రన్ కూడా కలుపుతారు.ఎల్బీడబ్ల్యూ వికెట్ల విషయంలో ఖచ్చితమైన డీఆర్ఎస్ నిర్ణయాల కోసం స్టంప్స్, బెయిల్స్ లైన్‌ను వికెట్ జోన్‌గా పరిగణిస్తారు. ఇది ఎల్బీడబ్ల్యూ నిర్ణయాల్లో ఖచ్చితత్వం తీసుకురానుంది. గతంలో ఎల్బీడబ్ల్యూ నిర్ణయాల కోసం డీఆర్ఎస్‌లో 'వికెట్ జోన్'అనేది స్టంప్స్ కొత్త ఊహాత్మ ప్రాంతాన్ని కలిగే ఉండేది. కొత్త వైడ్ బాల్ రూల్ ప్రకారం.. బౌలర్ బంతిని వేసే సమయంలో బ్యాటర్ కాళ్ల స్థానాన్ని పరిగణలోకి తీసుకుంటారు. ఆ తర్వాత బ్యాటర్ కదిలినా ఈ స్థానాన్ని పరిగణలోకి తీసుకొనే వైడ్‌పై నిర్ణయం తీసుకుంటారు.కంకషన్ రిప్లేస్‌మెంట్ రూల్స్‌ను కూడా ఐసీసీ మార్చింది. మ్యాచ్‌కు ముందే కంకషన్ సబ్‌స్టిట్యూట్ లిస్ట్ ఇవ్వాలి. ఒక ఆటగాడు కంకషన్ గాయానికి గురై జట్టుకు దూరమైతే.. అతను మరో మ్యాచ్ ఆడేందుకు కనీసం ఏడు రోజుల విశ్రాంతి తీసుకోవాలి. ఆటగాళ్ల భద్రత, శ్రేయస్సు కోసం ఈ మార్పు చేశారు.అక్టోబర్ 2025 నుంచి ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇంజ్యూరీ రిప్లేస్‌మెంట్ రూల్ అమలు చేయనున్నారు. ఈ రూల్ ప్రకారం మ్యాచ్ ప్రారంభమైన తర్వాత మైదానంలో తీవ్రమైన గాయానికి గురైన ఆటగాడి స్థానంలో లైక్-ఫర్ లైక్ ఆటగాడితో భర్తీ చేయవచ్చు.







# వైభవ్ సూర్యవంశీ విధ్వంసం

### అండర్-19 వన్డే సిరీస్‌లో

ఇంగ్లాండ్‌తో జరుగుతోన్న అండర్-19 వన్డే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ విధ్వంసం సృష్టించాడు. తన జట్టు కెప్టెన్ ఆయుష్ మాత్రేతో కలిసి అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. అండర్ 19 వన్డే సిరీస్‌లో భారత్ తరపున వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మాత్రే ఓపెనింగ్ దిగారు. పరుగుల వరద పారించి.. ఇంగ్లాండ్‌పై తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. జూన్ 27న హోవ్‌లో భారత్, ఇంగ్లాండ్ అండర్ 19 జట్ల మధ్య తొలి వన్డే మ్యాచ్ జరగనుంది. దీనికి ముందు వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మాత్రేతో కలిసి 3 మ్యాచ్‌ల్లో ఓపెనింగ్ పార్టనర్‌షిప్ దిగాడు. ఆ 3 మ్యాచ్‌ల్లో, వారిద్దరూ కలిసి 81 బంతుల్లో 123 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ సమయంలో వారిద్దరూ కలిసి 25 బౌండరీలు కొట్టారు. అందులో 5 సిక్సర్లు, 8 ఫోర్లు వైభవ్ సూర్యవంశీ.. 12 ఫోర్లు ఆయుష్ మాత్రే బాదాడు.ఇప్పటివరకు మూడు అండర్-19 వన్డేలలో తన కెప్టెన్‌తో కలిసి 123 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన వైభవ్ సూర్యవంశీ.. మొత్తంగా 5 సిక్సర్లు, 20 ఫోర్లతో ఇంగ్లాండ్‌కు సవాల్ విసిరారు. హోవ్‌లో జరగనున్న భారత అండర్ 19 జట్టు తరపున వైభవ్, ఆయుష్ ఓపెనింగ్ నాలుగో సారి దిగబోతున్నారు. అంతకుముందు వీరిద్దరూ కలిసి ఓపెనింగ్ చేసిన మూడు మ్యాచ్‌లు బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంకలతో జరిగాయి. ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో ప్రారంభం కానున్న సిరీస్ అనేక విధాలుగా ప్రత్యేకమైనదని చెప్పాలి. కుడిచేతి వాటం ఆయుష్ మాత్రే, ఎడమచేతి వాటం వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ ఈసారి వీక్షకులను ఆకట్టుకుంటుంది అనడంలో సందేహం లేదు.

ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఓపెనర్‌గా జట్టుకు శుభారంభాలు ఇస్తున్న రాహుల్ . తన నెలల బిడ్డను ఎంతో మిస్ అవుతున్నాడు. మార్చిలో తండ్రైన అతడు.. కూతురును ముద్దు చేయాల్సింది పోయి దేశం కోసం ఆడాల్సిందే అంటూ స్క్వాడ్ కంటే ముందుగానే ఇంగ్లండ్ విమానం ఎక్కాడు.




# టైటిళ్లతో రికార్డు..

### మళ్లీ వరల్డ్ నంబర్ 1గా బడిసె వీరుడు

ఈ సీజన్‌లో రికార్డు విజయాలు సాధిస్తున్న ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా మళ్లీ వరల్డ్ అథ్లెటిక్స్‌లో అగ్రస్థానానికి చేరువయ్యాడు. పారిస్ డైమండ్ లీగ్, ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్స్ టోర్నీలో విజేతగా నిలిచిన చోప్రా నంబర్ 1 ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. రెండేళ్ల క్రితం టాప్ ర్యాంకర్‌గా కొనసాగిన బడిసె వీరుడు.. ఈ ఏడాది సూపర్ ఫామ్‌తో అగ్రపీఠం సాధించాడు. దాంతో, గ్రెనెడాకు చెందిన అండర్సన్ పీటర్స్‌ను రెండోస్థానానికి పడిపోయాడు. ప్రస్తుతం భారత బడిసె వీరుడి ఖాతాలో 1,445 పాయింట్లు ఉండగా.. పీటర్స్‌కు 1,431 పాయింట్లు ఉన్నాయి. దోహా డైమండ్ లీగ్‌లో చోప్రాను దాటేసి ఛాంపియన్‌గా అవతరించిన జులియన్ వెబర్ మూడో స్థానంలో, పాకిస్థాన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్ 1,370 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు బద్ధలు కొడుతున్న నీరజ్ చోప్రా విశ్వవ్యాప్తంగా భారత్ పేరు మార్మోగిపోయేలా చేస్తున్నాడు. టోక్యో విశ్వ క్రీడల్లో గోల్డ్ మెడల్‌తో చరిత్ర సృష్టించిన అతడు.. పారిస్ ఒలింపిక్స్‌లో రజతంతో మెరిశాడు. వరస ఒలింపిక్ పతకాలతో యావత్ భారతావని గర్వపడేలా చేసిన నీరజ్ ఈ ఏడాది కూడా అదరగొడుతున్నాడు. దక్షిణాఫ్రికాలోని పాట్చ్ ఇన్విటేషన్‌లో విజేతగా నిలిచిన చోప్రా.. అనతరం దోహా డైమండ్ లీగ్‌లో ఈటెను 90 మీటర్ల దూరం విసిరాడు. కానీ, రెండో స్థానంతోనే సరిపెట్టుకున్న అతడు.. పారిస్ డైమండ్ లీగ్‌లో ఛాంపియన్‌గా అవతరించాడు. అనంతరం ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్స్‌లోనూ 90 మీటర్ల మార్క్ అందుకోకున్నా సరే టైటిల్ గెలుపొందాడు. ఫైనల్లో 85.29 మీటర్ల దూరంతో నీరజ్ విజయం సాధించాడు.

# డోప్ పరీక్షలో విఫలం..

### నిషేధానికి గురైన నేషనల్ ఛాంపియన్

భారత అథ్లెట్లు వరుసగా డోప్ పరీక్షలో దొరికిపోతున్నారు. ఈమధ్యే క్వార్టర్ మిలర్ (400 మీటర్ల రన్నర్) స్నేహ కొల్లేరి నిషేధానికి గురవగా.. తాజాగా జాతీయ స్థాయిలో పలు పతకాలు గెలుపొందిన రన్నర్ ట్వింకిల్ చౌదరీ సైతం డోప్ టెస్టులో పట్టుబడింది. అంతర్జాతీయ టోర్నీల్లో సత్తా చాటుతున్న ఆమె అనూహ్యంగా నిషేధిత డ్రగ్ తీసుకొని బుక్ అయిందది. దాంతో, అథ్లెటిక్స్ ఇంటెగ్రిటీ యూనిట్ ఆమెపై నిషేధం విధించింది. నిరుడు ఉత్తరాఖండ్‌లో జరిగిన 4ఐ400 మీటర్ల రీలే పోటీల్లో స్వర్ణం సాధించిన బృందంలో ట్వింకిల్ సభ్యురాలు. అదే ఈవెంట్లో 4ఐ400 మీటర్ల మిక్స్‌డ్ రీలేలో కాంస్యం గెలుపొందిందీ అథ్లెట్. కెరియర్‌లో ఒక్కోమెట్టు ఎక్కుతున్న సమయంలోనే ట్వింకిల్ డోప్ పరీక్షలో విఫలమైంది. ఆమె రక్త నమూనాల్లో నిషేధిత మిథైల్‌టెస్టోస్టిరాన్ డ్రగ్ ఉంది. ఇది ఒక అనబాలిక్ స్టిరాయిడ్.

# టాప్-10లో నలుగురు టీమిండియా ఆటగాళ్లు!

టెస్ట్ కొత్త ర్యాంకింగ్స్‌ను ఐసీసీ ప్రకటించింది. ఈ సారి టీమిండియా నుంచి నలుగురు ఆటగాళ్లు టాప్-10లో చోటు దక్కించుకున్నారు. బ్యాట్స్‌మెన్ జాబితాలో ఇద్దరు కనిపిస్తే, బౌలర్ల జాబితాలో ఒకరు చోటు దక్కించుకున్నారు. ఆల్ రౌండర్ల జాబితాలో టీమిండియా ప్లేయర్ నంబర్ వన్ ప్లేస్‌లో ఉండటం విశేషం. ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న బౌలర్ టీమిండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా. హెడింగ్లీలో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టులో 5 వికెట్లు తీసిన బుమ్రా 907 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలుపుకున్నాడు. బుమ్రా తప్ప, టీం ఇండియా నుంచి మరే ఇతర బౌలర్ కూడా బౌలర్ల జాబితాలో టాప్ టెన్‌లో చోటు దక్కించుకోలేదు.ఐసీసీ టెస్ట్ బ్యాట్స్‌మెన్ జాబితాలో టీమిండియా యువ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్ 4వ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో 101 పరుగులతో అద్భుతమైన సెంచరీ చేసిన జైస్వాల్ ఇప్పుడు 851 పాయింట్లతో 4వ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు చేసిన రిషబ్ పంత్ 801 పాయింట్లతో టెస్ట్ బ్యాట్స్‌మెన్ జాబితాలో 7వ స్థానానికి ఎగబాకాడు. ఇది భారత వికెట్ కీపర్ సాధించిన అత్యుత్తమ స్థానం. అంటే.. టీమిండియా నుండి ఏ వికెట్ కీపర్ కూడా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో 800 పాయింట్లకు పైగా సాధించలేదు. ఇప్పుడు పంత్ 801 రేటింగ్‌తో ఏడో స్థానంలో నిలిచాడు. ఐసీసీ టెస్ట్ ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా కూడా అగ్రస్థానంలో ఉన్నాడు. 376 పాయింట్లతో జడేజా గత కొన్ని నెలలుగా అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగే మిగిలిన మ్యాచ్‌లలో అతను బాగా రాణిస్తే, అతని రేటింగ్ 400 దాటే అవకాశం ఉంది.



# చండూరు ఎస్సై అత్యుత్సాహం



### ఓ సివిల్ కేసులో యువకుడిని చావ బాదిన ఎస్సై

- ఎస్సై వ్యవహార శైలిపై మండల వ్యాప్తంగా వెల్లువెత్తుతున్న విమర్శలు
- తమ దాయాది వర్గంతో చేతులు కలిపాడని ఆరోపిస్తున్న బాధితుడు
- సివిల్ కేసుల్లో పోలీసులు తలదూర్చ వద్దని చెబుతున్న ఉన్నతాధికారులు
- ఉన్నతాధికారుల మాటను కూడా పెడచెవిన పెడుతున్న తీరు
- రాజీ కుదుర్చుకునేందుకు ఎస్సై ప్రయత్నం

చండూరు, జనం సాక్షి :

*సివిల్ తగాదాల్లో పోలీసులు తలదూర్చ వద్దని ఉన్నతాధికారులు పదే పదే చెబుతున్నా.. వారి మాటను పెడచెవిన పెడుతూ కొందరు పోలీసు అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఇప్పుడు జిల్లాలో వివాదాస్పదంగా మారింది. తాజాగా ఇలాంటి సంఘటనే చండూరు మండలంలో చోటు చేసుకుంది. ఓ సివిల్ కేసులో చండూరు ఎస్సై నర్సింగ్ వెంకన్న అత్యుత్సాహం ప్రదర్శించారు.*

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని తాస్కానిగూడెం గ్రామానికి చెందిన ఆవుల వెంకన్న, తండ్రి యాదయ్య, వయసు: 30 సంవత్సరాలు అను వ్యక్తికి తన దాయాదులతో గత కొన్ని ఏళ్లుగా భూ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో వెంకన్న దాయాదులు తమ భూమిలో కరెంట్ వైర్లను తొలగించాడని వెంకన్న పై చండూరు పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. కాగా చండూరు ఎస్సై నర్సింగ్ వెంకన్న ఇరు వర్గాల వారిని స్టేషన్ కు పిలుపించు కుని సమస్యను పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కారించుకోవలసిందిగా సూచించడం జరిగిం ది. కానీ వెంకన్న దాయాదులు పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన పంచాయతీలో సమస్య పరిష్కారానికి ససేమిరా అనడంతో సదరు సమస్య అలాగే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో చండూరు ఎస్సై గురువారం మరోసారి వెంకన్న ను స్టేషన్ కు రావాల్సిందిగా హుకుం జారీ చేశారు. అయితే ఆ సమయంలో వెంకన్న తన వ్యవసా య భూమిలో గుంటుక కట్టానని, శుక్రవారం ఉదయం స్టేషన్ కు వస్తానని తెలుపగా ఎస్సై ససేమిరా అన్నారు. ఖచ్చితంగా అదే రోజు స్టేషన్ రావాలని చెప్పడంతో రైతు వెంకన్న చేసేదేమీ లేక తను చేసే పనిని వదిలి పోలీసు స్టేషన్‌కు వచ్చాడు. అయితే రైతు వెంకన్న స్టేషన్ కు రావడం తో మీ భూమి పంచాయతీ ఏమైందని ఎస్సై ప్రశ్నించారు. దీనికి రైతు వెంకన్న బదులిస్తూ సమస్య పరిష్కారానికి తమ దాయాదులు అంగీకరించడం లేదని తెలిపాడు. దానితో ఆగ్రహించిన ఎస్సై రైతు వెంకన్నను నానా దుర్భాషలాడుతూ, అతని పై పిడిగుద్దుల వర్షం కురిపించారు.

ఈ క్రమంలో ఎస్సై దెబ్బలకు తాళలేక రైతు వెంకన్న అసలు మీరు నన్ను ఎందుకు కొడుతున్నారు సార్.. నేను చేసిన తప్పేంటి అంటూ.. నేను ఎస్పీ వద్దకు వెళతాను, మీ వ్యవహార శైలి పై ఫిర్యాదు చేస్తానని అనడంతో సదరు ఎస్సై వెంకన్న గ్రామానికే చెందిన ఒక పెద్ద మనిషికి ఫోన్ చేసి పిలిపించారు.


రైతు వెంకన్న

అనంతరం రైతు వెంకన్న ను ఆయన కుటుంబ సభ్యులు చండూరు మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్లి చికిత్స ను అందించారు. కాగా శుక్రవారం ఉదయం బాధితుడు రైతు వెంకన్న చండూరు మండల కేంద్రంలో మీడియా ముందు తన గోడును వెళ్లబోసుకోవడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో కొన్ని టీవీ ఛానెల్స్‌లో ఈ ఘటన పై బ్రేకింగ్ న్యూస్ కూడా ప్రసారమయ్యాయి. ఈ నేపథ్యంలో వెంటనే అప్రమత్తమైన ఎస్సై బాధితునితో రాజీ కుదుర్చు కునేందుకు ప్రయత్నించారనే పుకార్లు సైతం షికార్లు చేస్తుండడం ఇక్కడ గమనార్హం. కాగా బాధితుడు రైతు వెంకన్న తనపై అకారణంగా దాడి చేసిన ఎస్సై పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశాడు.

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

# నిర్మాణం కోసం స్థల పరిశీలన

**ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**



**నర్సంపేట జూన్ 27 (జనం సాక్షి) :** ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామంలో అధునాత నమైన అంగులతో విశాలవంతమైన వాతావరణంలో 30 ఎకరాలలో 200 కోట్ల రూపాయలతో నిర్మించబోయే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి స్థల సేకరణ నేడు నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి దొంతి మాధవరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు..నర్సంపేట నియోజకవర్గానికి రూ. 200 కోట్ల నిధులతో ఆధునిక సదుపాయాలతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలును రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది, ఆయన అన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గం విద్యారంగ అభివృద్ధిలో ఇది కీలక మైలురాయని, మన నియోజకవర్గ పిల్లలు ఇక మెట్రో స్థాయి వసతులతో కూడిన పాఠశాలలో చదివే అవకాశం పొందారన్నారు, ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి, ముఖ్యంగా మన నియోజకవర్గానికి రావడం గర్వంగా ఉందన్నారు, ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి నర్సంపేట నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మన్నారు, ఈ పాఠశాల ద్వారా గ్రామీణ విద్యార్థులకు సైతం నాణ్యమైన విద్యను సులభంగా పొందగలగడం విశేషమని, ఇది మన నియోజకవర్గ భవిష్యత్ తరాల విద్యాభివృద్ధికి బలమైన పునాది కానుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నాన్న.. అమ్మ కావాలి

## అమ్మకు ఫోన్ చెయ్యి...

- క్యాన్సర్‌తో మృత్యుఒడికి కన్నతల్లి
- కంటతడి పెట్టిస్తున్న చిన్నారుల ఆవేదన



రంగారెడ్డిజిల్లా ప్రతినిథి (జనంసాక్షి) నాన్న....అమ్మ కావాలి.. మళ్లీ మా అమ్మ రావాలి.. ఎక్కడుంది.. ఎప్పుడొస్తుంది.. అని ముగ్గురు చిన్నారులు అడుగుతున్న ప్రశ్నకు సమాధానం చెప్పలేక ఆ కుటుంబం కూలిపోతుంది.. జరిగిన ఘోరాన్ని తలుచుకొని తల్లడిల్లుతుంది. విషయం ఏమిటంటే రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన చిన్నంతరగారి అఖిల(35)సంవత్సరాలు క్యాన్సర్ తో బాధపడుతూ మూడు రోజుల క్రితం మృతి చెందింది మూడు రోజుల కార్యక్రమం తరువాత ఇంటికి వచ్చిన తండ్రి శ్రీనివాస్ ను ముగ్గురు చిన్నారులు (యువన్) (కిట్టు) (అమ్ములు) నాన్న అమ్మకు ఫోన్ చెయ్యి అమ్మ ఎక్కడ ఉంది అని పిల్లలు అడుగుతుంటే అమ్మ కోసం రోదిస్తుంటే వారికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక తండ్రి శ్రీనివాస్ అయోమయంలో పడ్డాడు ఈ ఘటన ప్రతి ఒక్కరి హృదయం చెల్లించేలా చేసింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
28 జూన్ 2025

# మావోయిస్టుల లేఖపై అసత్య ప్రచారం

- మహిళనని చూడకుండా అసభ్యపదజాలంతో దూషించడం ఆవేదన కలిగిస్తోంది
- ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ముందుంటా
- ఎస్టీ ఎమ్మెల్యేల సమవేశంలో జీవో 49 రద్దు చేయాలని తీర్మాణం చేశాము
- అత్యుత్సాహం ప్రదర్శించే అటవీ అధికారులపై చర్యలు చేపట్టాము
- ములుగు, భద్రాద్రి జిల్లాల్లో ఆదివాసీ, గిరిజనలకు అండగా నిలిచాము
- గిరిజన మహిళలను చెట్లకు కట్టేసి కొట్టి, చంటి పిల్లల తల్లులను జైల్లో వేసిన బీఆర్ఎస్ కు మాట్లాడే నైతిక అర్హత లేదు
- ములుగు జిల్లా ఏటూరు నాగారంలో మంత్రి సీతక్క



**ములుగు (జనంసాక్షి) :** అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ములుగు పర్యటనలో ఉన్న పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఏటూరు నాగారంలో తనను కలసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఇటీవల మావోయిస్టుల పేరిట వచ్చిన లేఖపై స్పందిస్తూ..ఆ లేఖ మావోయిస్టు పార్టీ ఇచ్చిందా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదన్నారు. అయితే ఆ లేఖలో లేని అంశాలపై కొన్ని మీడియా సంస్థలు, రాజకీయ పార్టీలు తప్పుడు వ్యాఖ్యలతో దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మహిళ అని చూడకుండా తనపై అసభ్య పదజాలాన్ని వాడుతూ తమ రాజకీయ కక్షను తీర్చుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల లేఖను అడ్డం పెట్టుకొని తనను అవమానిస్తూ బీఆర్ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారని పేర్కొన్నారు. తాను ఎన్నడూ ప్రజలకు దూరంగా లేనని.. వారంలో రెండు మూడు రోజుల పాటు ములుగు, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని పేర్కొన్నారు. అయితే తనను ఎన్నికల్లో ఓడించాలని పనిచేసిన శక్తులే..ఇప్పుడు తనను టార్గెట్ చేశాయని తెలిపారు. ఒక కోయ మహిళలకు జనరల్ పోర్ట్ ఫోలియో దక్కడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందని మంత్రి సీతక్క మండిపడ్డారు. 75 సంవత్సరాల్లో ఒక కోయ మహిళకు అతి పెద్దదైన పంచాయతీ రాజ్ శాఖ రావాడన్ని సహించలేకే, తన వ్యక్తి గత ప్రతిష్టను దెబ్బతీసేలా అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 49 తో అడవి బిడ్డలు నష్టపోతారని ఆ జీవోను తాను వ్యతిరేకించినట్లు గుర్తు చేశారు. గిరిజన సంక్షేమ మంత్రి కాకున్నా..పార్టీలకు అతీతంగా ఎస్టీ ఎమ్మెల్యేలందరితో సమావేశమై జీవో 49 ను రద్దు చేయాలని గతంలోనే తీర్మాణించినట్లు తెలిపారు. ఏ హెూదాలో, ఏ స్థాయిలో ఉన్నా తాను ఆదివాసి అడవి బిడ్డనేనని, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం తన జీవితం అంకితమని స్పష్టం చేశారు. ఆదివాసీలు, అణగారిన వర్గాల కోసం విపక్షంలో ఉన్నప్పుడు పోరాటాలు చేసిన తాను, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదివాసులకు మేలు చేసేలా అధికారాన్ని వినియోగిస్తున్నట్టు తెలిపారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ఘటనలు తమ దృష్టి రాగానే అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రిన్స్ పల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ – పీసీసీఎఫ్ సువర్ణ గారితో స్వయంగా మాట్లాడినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు జరగకుండా చర్యలు చేపడుతామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అడవి బిడ్డల పట్ల అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతిపక్షంలోనైన అధికార పక్షంలోనైనా తనదొకటే నినాదమన్నారు. అటవి హక్కుల చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కొత్తగా అడవిని కొట్టొద్దు.. పాత అడవిని వదిలిపెట్టదు అన్నదే తన విధానమన్నారు. తన నియోజకర్గంలో కొంతమంది అడవి అధికారులు ఆదివాసి గుడిసెల మీద దాడి చేయగా..తానే వారికి ఫోన్ చేసి వెనక్కు పంపించినట్లు తెలిపారు. సొంత నిర్ణయాలతో అటవి అధికారులు తప్పు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివాసులు, అట్టడుగు వర్గాలు, కష్టాల్లో ఉన్న ప్రజలకు నిరంతరం అండగా ఉంటామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఆదివాసులపై దాడులు చేశారని, చంటి పిల్లల తల్లులను జైల్లో పెట్టారని సీతక్క గుర్తు చేశారు. అప్పుడు అడవి బిడ్డలను చెట్లకు కట్టేసి కొట్టిన బీఆర్ఎస్...ఇప్పుడు ఆదివాసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తోందని ఎద్దేవ చేశారు మంత్రి సీతక్క. పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు పోడు సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. మీ హయంలో అడవి బిడ్డలకు ఇండ్లు ఇస్తే ఇలాంటి సమస్యలే ఉత్పన్నం అయ్యేవి కావన్నారు. తనను ఓడించేందుకు బీఆర్ఎస్ వంద కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు.

## కృష్ణా, గోదావరి జలాశయాలలో
# తెలంగాణా వాటా కోసం పోరాటం

- బిఆర్ఎస్ పాలకుల పాపానికి 16 వేల కోట్ల వడ్డీ భారం
- ఎత్తిపోతల పథకాలతో హుజుర్‌నగర్, కోదాడలు సస్యశ్యామలం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్‌నగర్ (జనంసాక్షి) :** కృష్ణా,గోదావరి జలాశయాలలో తెలంగాణాకు న్యాయబద్ధంగా రావలసిన నీటి వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజీ లేకుండా పోరాటం చేస్తుందని ఆయన చెప్పారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సంప్రదింపులతో కేటాయింపులు జరగకుంటే న్యాయపరంగా పోరాడి న్యాయమైన వాటా సాధిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇది రైతుపక్ష పాత ప్రభుత్వమని,వారి ఉన్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని ఆయన చెప్పారు. కృష్ణా జలాశయాలలో 811 టి.యం.సి లకు గాను ఆంధ్రప్రదేశ్ కు 599 టి.యం.సి లనీటిని ధారా దత్తం చేసిన ఘనత బి.ఆర్.ఎస్ పాలకులదని ఆయన మండిపడ్డారు. తెలంగాణా కు 299 టి.యం.సి లు ఆంధ్రప్రదేశ్ కు 599 టి.యం.సి లంటూ వ్రాత పూర్వకంగా రాసిచ్చిన చరిత్ర బిఆర్ఎస్ ప్రాణుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. పదేళ్ళ బి.ఆర్.ఎస్ పాలకులు చేసిన పాపానికి రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 16 వేల రూపాయల వడ్డీలు చెల్లించాల్సి వస్తుందని ఆయన చెప్పారు. శుక్రవారం ఉదయం హుజుర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పాలకీడు మండలం జానపహాడ్,బెట్టే తండా ఎత్తిపోతల పథకాలను ఆయన పరిశీలించారు. నీటిపారుదల రంగాన్ని అప్పటి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఆయన విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందే తడవుగా కృష్ణా నది పరివాహక ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో పాటు ఆయకట్టు,జనాభా ఆధారంగా నీటి కేటాయింపుల కోసం పోరాడుతున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 38 వేల కోట్ల అంచనా వ్యయంతో తుమ్మడిహట్టి వద్ద డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ చేవెళ్ల–ప్రాణహిత పేరుతో ప్రాజెక్టును నిర్మిస్తే కమిషన్ల కక్కుర్తితో లక్ష కోట్లు వెచ్చించి బి.ఆర్.ఎస్ పాలకులు లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం కుప్ప కూలి పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన చేవెళ్ల–ప్రాణహిత ప్రాజెక్టును అదే తుమ్మడిహట్టి వద్ద నిర్మిస్తే 62 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి మిగిలి ఉండేవని ఆయన తెలిపారు. అవే డబ్బులతో ఎస్.ఎల్.బి.సి,పాలమూరు రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, కోయిలసాగర్, దేవాదుల, సీతారామ, గౌరెల్లి వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణా ప్రాంతాన్ని సస్యశ్యామలం అయ్యేదని ఆయన అన్నారు. వీటన్నింటినీ తోసి రాజని బి.ఆర్.ఎస్ పాలకులు చేసిన తప్పిదాలతో నేడు రాష్ట్ర ప్రభుత్వంపై సంవత్సరానికి 16 వేల కోట్ల రూపాయలు వడ్డీ భారం పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పైగా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు 27,500 కోట్లు,సీతారామ ప్రాజెక్టు మీద 10 వేల కోట్లు ఖర్చు చేసి కొత్తగా ఒక్క ఎకరా కొత్త ఆయకట్టును సేద్యంలోకి తీసుకు రాలేక పోయారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖామంత్రిగా తాను గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దుకుంటు రావడం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారినా ఖరీఫ్ ,రబీ సీజన్ లను కలిపి రికార్డు స్థాయిలో 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించామన్నారు. ఇది యావత్ భారత దేశంలోనే ఆల్ టైం రికార్డ్ గా ఆయన అభివర్ణించారు. రైతుభరోసా పథకంతో రైతాంగం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు.తొమ్మిది రోజుల వ్యవధిలో 9 వేల కోట్లను రైతుల ఖాతాలలో జమ చేశామని ఆయన వెల్లడించారు.

### కాంట్రాక్టర్ పై గరం...గరం

జవహర్ జానపహాడ్ ఎత్తిపోతల పథకం పనులు వేగవంతంగా జరగడం లేదంటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధించిన ఏజెన్సీ నిర్వహకుల పై మండి పడ్డారు. స్వయంగా తాను మూడు సార్లు స్వయంగా తనిఖీలు నిర్వహించినా పనులు ముందుకు సాగడం లేదంటూ ఆయన తీవ్రంగా మందలించారు.డిజైన్ లో మార్పులు అవసరం అయితే సి.డి.ఓ (సర్క్యులర్ డీజైన్ ఆపరేషన్ ) ద్వారా చేసుకోవచ్చని ఆయన సూచించారు.

# లడ్డూ కల్తీపై సిట్ నివేదిక

- సుప్రీంకు అందించనట్లు సమాచారం

**అమరావతి, జూన్27 (జనంసాక్షి) :** తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక అందించింది. రెండు రోజుల క్రితం సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు ఈ నివేదికను సిట్ అధికారులు అందించినట్లు తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా కేసు దర్యాప్తు పురోగతి, ఇప్పటివరకు దర్యాప్తులో తేలిన విషయాలతో నివేదిక అందించారని సమాచారం. అయితే, ఈ కేసు దర్యాప్తు ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు దర్యాప్తులో బయటపడిన అంశాలు, స్థానిక కోర్టు నుండి హైకోర్టు వరకు కూడా నిందితులు దాఖలు చేసిన పిటిషన్లు, వాటిపైన జరుగుతున్న విచారణ, వాటి పురోగతి తదితర అంశాలను నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. కాగా, తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడకం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఇందులో నిజానిజాలను తేల్చేందుకు సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ నేతృత్వంలో సిట్ ఏర్పాటైంది. కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో నలుగురు కీలక నిందితులను ప్రత్యేక దర్యాప్తు బృందం అరెస్టు చేసింది. ఒక్క టీటీడీకే కాకుండా.. ఇతర దేవాలయాలకు కూడా నకిలీ నెయ్యి సరఫరా చేసినట్లు దర్యాప్తులో తేలింది. టీటీడీ నుంచే నిందితులు దాదాపు 240 కోట్ల వరకు లబ్ది పొందారని వార్తలు వినిపించాయి. నకిలీ నెయ్యి తయారీ, సరఫరాలో భోలేబాబా డైరీదే కీలక పాత్ర అని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

# కన్యాకుమారిలో కుండపోత వర్షం

**చెన్నై, జూన్27 (జనంసాక్షి) :** తమిళనాడు కన్యాకుమారి జిల్లాలో గురువారం రాత్రి నుంచి కుండపోతగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. మీనాక్షిపురం రోడ్డు, కోట్టార్ రోడ్డు, అసంబు రోడ్డు తదితర రహదారులలో మోకాలి లోతున నీరు ప్రవహించింది. విద్యార్థులు గొడుగులు పట్టుకుని వెళ్లారు. సుశీంద్రం, అంజుగ్రామం, మయిలాడి, కొట్టారమ్ తదితర ప్రాంతాల్లోనూ చెదురుముదురుగా వర్షాలు కురిశాయి. కాళికేశం, గిరిప్పారై ప్రాంతాల్లో వరద పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పేచ్చిపారై, పెరుంజాని, సిట్రారు జలాశయాల పరివాహక ప్రాంతాల్లోనూ భారీగా వర్షాలు కురిశాయి. పేచ్చిపారై డ్యాంలో గురువారం ఉదయం నీటిమట్టం 44.21 అడుగులకు చేరింది. డ్యాంలో సెకనుకు 1285 ఘనపుటడుగుల జలాలు ప్రవేశిస్తున్నాయి. డ్యాం నుంచి సెకను 753 ఘనపుటడుగుల చొప్పున దిగువకు వదులుతున్నారు. పెరుంజాని డ్యాంలోను నీటిమట్టం 69.45 అడుగులకు పెరిగింది. డ్యాంలోకి సెకనుకు 900 ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశిస్తున్నాయి. ఈ వర్షాల వల్ల కాళికేశం, గిరిప్పారై, తడింగారోహణం ప్రాంతాల్లోని రబ్బరు తోటల్లో అడుగులోతున నీరు ప్రవహిస్తోంది. దీనితో రబ్బరు కోత పనులు ఆగిపోయాయి.

# విమాన ప్రమాద బాధితులకు సాయం

- ట్రస్ట్‌ను ఏర్పాటు చేసే యోచనలో టాటా




**న్యూఢిల్లీ, జూన్27 (జనంసాక్షి) :** ఎయిరిండియా విమానం ఏఐ 171 ప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందించేలా ఓ ట్రస్ట్‌ను ఏర్పాటుచేయాలని టాటా సన్స్ బోర్డును అనుమతి కోరింది. గురువారం జరిగిన కీలక సమావేశంలో ఈ ప్రతిపాదన తీసుకొచ్చినందుకు టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ సభ్యులను అభినందించినట్లు ఓ ఆంగ్ల పత్రిక కథనంలో వెల్లడించింది. ఈ సమావేశానికి టాటా ట్రస్ట్ నామినీలు నోయల్ టాటా, వేణు శ్రీనివాసన్, విజయ్‌సింగ్ హాజరయ్యారు. ఈ ట్రస్ట్‌కు రూ.500 కోట్లు కేటాయించేలా అనుమతులు కోరింది. ఈ విమాన దుర్ఘటనను టాటా సంస్థ చాలా సీరియస్‌గా తీసుకొంది. ఎయిరిండియా రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతను నేరుగా టాటాసన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తన చేతుల్లోకి తీసుకొన్నట్లు వార్తలొస్తున్నాయి. సంస్థకు ఈ దుర్ఘటన పెనుసవాలుగా మారడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంతో సంబంధాలు, ప్రయాణికుల భద్రతను అంచనా వేయడం, విమానాల నిర్వహణ, సిబ్బంది సంక్షేమం వంటివి ఆయన పరిధిలోకి రానున్నాయి. తమ సంస్థలు కష్టాల్లో ఉన్నప్పుడు ఛైర్మన్లు స్వయంగా రంగంలోకి దిగి వాటిని ఎదుర్కోవడం టాటా గ్రూపులో ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయం. 1989లో టాటాస్టీల్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకొని దాదాపు 50 మంది చనిపోయారు. నాడు జేఆర్‌డీ టాటా స్వయంగా రంగంలోకి దిగి ఈ సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. ఇక టాటా ఫైనాన్స్ కుంభకోణం, 26/11 తాజ్ హోటల్‌పై ఉగ్రదాడి సందర్భంగా ఆ వ్యవహారాలను నాటి ఛైర్మన్ రతన్ టాటా స్వయంగా పర్యవేక్షించారు. ఎన్.చంద్రశేఖరన్‌కు కూడా టీసీఎస్‌ను సంక్షోభాల నుంచి బయటపడేసిన రికార్డు ఉంది. ఇక తాజ్ హోటల్‌పై ఉగ్రదాడులు జరిగిన వేళ కూడా టాటా గ్రూప్ ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. బాధిత ఉద్యోగుల కుటుంబాలకు దీర్ఘకాలంపాటు ఆర్థిక, నైతిక మద్దతును అందించింది. వాస్తవానికి తొలుత టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ రెండు వేర్వేరు ట్రస్ట్‌లను ఏర్పాటుచేయాలని భావించింది. వీటిల్లో ఒకటి భారతీయ బాధితుల కుటుంబాలను చూసుకొనేందుకు కాగా.. మరొకొటి విదేశీ బాధితుల కుటుంబాల కోసం. తాజాగా ట్రస్ట్‌కు కేటాయించే సొమ్ముతో 271 బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించడం, క్షతగాత్రుల వైద్య ఖర్చులు, మెడికల్ కాలేజీ పునరుద్ధరణ, సమీపంలో విమాన శకలాల కారణంగా దెబ్బతిన్న వాటిని పునరుద్ధరించడం వంటి పనులు చేపట్టనుంది. మిగిలిన మూల నిధిని బాధిత కుటుంబాల దీర్ఘకాలిక అవసరాలు తీర్చడానికి వినియోగించాలని భావిస్తున్నారు. త్వరలోనే ట్రస్ట్‌ను రిజిస్టర్ చేసే అవకాశం ఉంది. ఇదే భారత, విదేశీ బాధితుల కుటుంబాలకు నేరుగా సాయం చేస్తుంది. ఈ కార్యక్రమానికి టాటా మోటార్స్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ నేతృత్వం వహించనున్నారు. ఆయనకు నియంత్రణ సంస్థలు, ఫైనాన్షియల్, కార్పొరేట్ గవర్నెన్స్‌లో మంచి అనుభవం ఉంది.

# జీవితకాలం ముగిసిన వాహనాలకు షాక్

- ఇంధనం నిలిపివేసేందుకు సర్కార్ సన్నాహాలు



**న్యూఢిల్లీ, జూన్27 (జనంసాక్షి) :** జీవితకాలం ముగిసిన వాహ నాలకు ఢిల్లీ ప్రభుత్వం షాక్ ఇవ్వనుంది. ఆ వాహనాలకు జూలై 1, 2025 నుండి ఆయిల్ పంపుల వద్ద ఇంధనాన్ని నిషేధించేందుకు ఢిల్లీ ప్రభుత్వం రెడీ అయ్యింది. అలాంటి వాహనాలకు ఇంధనాన్ని నింపకుండా ఉండేందుకు.. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరా సిస్టమ్‌ల సహాయంతో ఇంధన స్టేషన్‌లకు వచ్చే వాహనాలను పర్యవేక్షిస్తుంది. కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఆదేశం ప్రకారం, అన్ని జీవితకాలం ముగిసిన వాహనాలను వాటి రిజిస్ట్రేషన్ తో సంబంధం లేకుండా ఢిల్లీలో ఇంధనం నింపడంపై నిషేధం విధించనున్నారు. కాగా, నిబంధనల ప్రకారం, వాహన యజమానులు మొదటిసారి అఫిడవిట్ సమర్పించిన తర్వాత వారి కార్లను తీసుకెళ్లడానికి అనుమతించబడతారు. కానీ రెండవసారి.. అలాంటి వాహనాలను వెంటనే జప్తు చేస్తారు. ఢిల్లీ–ఔఅఖీ ప్రాంతంలో జీవితకాలం ముగిసిన వాహనాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. నివేదికల ప్రకారం, ఢిల్లీలో జీవితకాలం ముగిసిన బైకుల సంఖ్య 62 లక్షలు ఉండగా.. నాలుగు టైర్ల వాహనాల సంఖ్య 41 లక్షలు. ఇక, ఔఅఖీ (నేషనల్ క్యాపిటల్ రీజియన్)ను పరిగణనలోకి తీసుకుంటే.. హర్యానాలో సుమారు 27.5 లక్షల వాహనాలు, ఉత్తరప్రదేశ్‌లో 12.4 లక్షలు, రాజస్థాన్‌లో 6.1 లక్షల వాహనాలు జీవితకాలం ముగిసిపోయాయి. 2018లో, సుప్రీంకోర్టు ఢిల్లీలో 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలను, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాలను నిషేధించింది.

# సమస్యలపై స్పందించకుంటే 30న ధర్నా : జూడాలు

**హైదరాబాద్, జూన్27 (జనంసాక్షి) :** తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, వైద్యారోగ్య శాఖ మంత్రి స్పందించకపోవడంతో ఈ నెల 30 నుంచి ధర్నా చేపట్టనున్నట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ నేతలు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం టీ జూడాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇసాక్ న్యూటన్ ఓ ప్రకటన విడుదల చేశారు. స్టైఫండ్ చెల్లింపులో జాప్యం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, బోధనా సిబ్బంది కొరత, స్కాలర్‌షిప్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో ఆలస్యంపై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రం అందజేసిన ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 30 నుంచి చేపట్టిన ధర్నాలో రాష్ట్ర వ్యాప్తంగా జూడాలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ ఇళ్ల విషయంలో
# దళితులకు అన్యాయం


- ఇలాంటి వివక్ష గతంలో ఎప్పుడూ చూడలేదు
- బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ విమర్శలు



**హైదరాబాద్, జూన్27 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో దళితుల పట్ల చూపిస్తున్న వివక్ష ఆర్ఎస్పీ మండిపడ్డారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లికి చెందిన నక్క సనా, వేణు దంపతులకు ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్‌ను ఆపేసిన ఘటనపై ఆర్ఎస్పీ తీవ్రంగా స్పందించారు. అంటే మీ ఏఐ లాంగ్వేజ్ మోడల్‌లో వాట్సాప్‌లో బీఆర్ఎస్ స్టాటస్ పెట్టుకుంటే, ఎస్సీలైతే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వనవసరం లేదని షరతులు విధించి ప్రోగ్రాం తయారు చేసింద్రన్న మాట! మరీ ఇంత చిల్లర పాలనా? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీతోపాటు కేసీఆర్ ఫొటో వాట్సాప్ స్టేటస్ పెట్టినందుకు బుధవారం మంత్రి వివేక్ నిర్వహించే కార్యక్రమంలో తనకు ఇవ్వాల్సిన ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్‌ను ఆపేసినట్టు మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లికి చెందిన నక్క సనా ? వేణు దంపతులు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఉదయం పోలంపల్లిలోని తమ గుడిసె ముందు మాట్లాడారు. ఎస్సీ మాదిగ అయినందునే వివక్ష చూపి ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ ఇవ్వలేదని ఆరోపించారు. ఈ విషయమై ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శి సృజనను కలిస్తే.. మంత్రి పీఏ ప్రొసీడింగ్ ఆపేయమని చెప్పారని, బీఆర్ఎస్ స్టేటస్‌లు ఎందుకు పెడుతున్నారని పంచాయతీ కార్యదర్శి పేర్కొనడంతో వారు కంగుతిన్నారు. వాట్సాప్ స్టేటస్ పెట్టడం వల్లే మంత్రి పీఏకు ఫిర్యాదు వెళ్లిందని, అందుకే ప్రొసీడింగ్ ఇవ్వడం లేదని ఆమె తెలిపినట్టు వారు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అర్హులందరికీ ఇందిరమ్మ ఇవ్వాలని చెప్తున్నారని, ప్రజాపాలన అంటే ఇదేనా? అని వారు ప్రశ్నించారు. ప్రొసీడింగ్ ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

# 142 మంది ఆటో కార్మికుల ఆత్మహత్యలు

- వీరి సమస్యలపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శ



**సంగారెడ్డి, జూన్27 (జనంసాక్షి) :** ఆటో కార్మికుల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. పటాన్‌చెరువు ఆటో డ్రైవర్ల సంఘం ప్రతినిధులు శుక్రవారం హరీష్‌రావును కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ జీవితాలు దయనీయంగా మారాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి తమను మోసం చేశారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాడాలని వారు కోరారు. సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల వ్యవధిలో 142 మంది ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. అవి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని మండపడ్డారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12,000 భృతి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని, ఇప్పుడు ఆటో కార్మికుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని విమర్శించారు. ఆటో కార్మికులు తమ ఆటోలు నడవక, బ్యాంకుల కిస్తీలు చెల్లించలేక ఆర్థికంగా కుదేలవుతున్నారని హరీష్‌రావు అన్నారు. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో కార్మికులు తమ కుటుంబాల పోషణ భారంగా మారి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వేదికగా కూడా ఆటో కార్మికుల పక్షాన బీఆర్ఎస్ మాట్లాడిందని గుర్తుచేశారు. కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, ఆటో కార్మికులకు కేసీఆర్ అండగా ఉంటారని హరీష్‌రావు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేసి, ఆటో కార్మికులకు భద్రత కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు. చనిపోయిన ఆటో కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల ఆర్థిక సాయం చేయాలని సూచించారు. అదేవిధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏడాది రూ.12 వేల చొప్పున రెండేళ్లుగా ఒక్కో ఆటో కార్మికుడికి బాకీపడిన రూ.24 వేలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370